ఆర్టీసీలో అధరహో!

నగరంలోని ఆర్టీసీ బస్టాండ్లల్లో ఉన్న దుకాణాల్లో ధరల మోత మోగుతోంది. స్టాల్స్ నిర్వాహకులు అధిక ధరలతో ప్రయాణికులను దోచుకుంటున్నారు. సంక్రాంతి పండుగలకు వచ్చి దూర ప్రాంతాలకు తిరుగు ప్రయాణం అయిన ప్రయాణికులు ఈ ధరలు చూసి నోరెళ్లబెడుతున్నారు.

- ఎమ్మార్పీ కంటే ఎక్కవ వసూళ్లు
- హోటల్‌లో రెండు ఇడ్లీ రూ.50
- దోపిడీకి గురవుతున్న ప్రయాణికులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్టాండ్ల ఎమ్మార్పీ కంటే అధిక ధరకు వస్తువులు అమ్మరాదన్న బోర్డులు దిష్టిబొమ్మల్లా మారాయి. ప్రతి దుకాణంలోనూ అధిక ధరలకే విక్రయాలు సాగుతున్నాయి. ప్రతి వస్తువుపై రూ.5 నుంచి రూ.15 వరకు అధికంగా వసూలు చేస్తున్నారు. ప్రధానంగా వాటర్ బాటిళ్లు, కూల్‌డ్రింక్ బాటిళ్లపై ఈ దందా సాగుతోంది. తినుబండారులు అయితే వారికి నచ్చిన ధరలకు విక్రయిస్తున్నారు. ఏదో ఒక స్టాల్లో కాదు... అన్నింటిలోనూ ఇదే పరిస్థితి!. ఈ ధరల మోతపై కొందరు ప్రయాణికులు అధికారులకు ఫిర్యాదు చేసినా వారి నుంచి చర్యలు శూన్యం.



రెండు ఇడ్లీ రూ.50

ఆర్టీసీ బస్టాండులోని హోటల్‌లో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే సర్వీసులను ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనానికి నెల్లూరులోని ప్రధాన బస్టాండులో నిలుపుతారు. పైగా నెల్లూరంటే భోజనానికి ఫేమస్!. ఈ కారణం గా ఇతర జిల్లాల వారు ఎంతో ఆశగా హోటల్‌లోకి అడుగులు వేస్తున్నారు. అయితే అక్కడ ధర లు చూసి ఖంగు తింటున్నారు. రెండు ఇడ్లీ రూ.50, రెండు వడ రూ.50, సాదా దోశ రూ.50, ఫుల్ మీల్స్ రూ.140, సింగిల్ పరోటగానీ, చపాతీగానీ రూ.50 ఇలా ఆ ధరలు చూస్తూనే ప్రయాణికులకు కడుపు నిండి పోతుంది. ఇంత ధరలు ఏమిటని ప్రశ్నిస్తే ' మా దగ్గర ఇంతే!' అని హోటల్ సిబ్బంది నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారు.



ఇదంతా ఉత్తదే...!



బస్టాండులోని హోటల్లో ధరలు

ప్రతి వస్తువుపై అధిక ధరే!

కడప వెళ్లేందుకు నెల్లూరు ప్రధాన బస్టాండుకు కుటుంబంతో వచ్చాను. మా పిల్లలు ఆకలేస్తోందంటే హోటల్‌లోకి వెళ్లి ఇడ్లీ అడిగితే రెండు ఇడ్లీకి రూ.50 తీసుకున్నారు. ఆ ఇడ్లీలు కూడా చిన్నవిగా ఉన్నాయి. బస్టాండులోని స్టాల్స్‌లో పిల్లలకు కూల్‌డ్రింక్ బాటిళ్లు కొంటే ఎమ్మార్పీపై రూ.10 అధికంగా తీసుకున్నారు. ఈ దోపిడీ దారుణం.


- చోటు, ప్రయాణికుడు

విద్యారంగ సమస్యలపై ఎంటీఏ పోరాటం

నెల్లూరు(విద్య), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలపై మహాజన టీచర్స్ అసోసియేషన్(ఎంటీఏ) పోరాటాలు చేస్తుందని ఎంఈఎఫ్ జాతీయ నాయకుడు మందా వెంకటేశ్వర్లు మాదిగ తెలిపారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ పాఠశాలలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. సంఘం భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. రాష్ట్ర నాయకులు చేమూరు మస్తాన్ మాదిగ, దూడల పెంచలయ్య, అన్నం శ్రీనివాసులు, వాసిలి సురేష్, ఖాజారహంతుల్లా, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దుగ్గినపల్లి రాంప్రసాద్, భూమన శ్రీశైల తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు 'రావూస్' విద్యార్థుల ఎంపిక

నెల్లూరు(విద్య), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రావూస్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన క్యాంపస్ ఎంపికల్లో 32 మంది విద్యార్థులు ప్రతిభ చూపి కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై కోటేశ్వరరావు, డైరెక్టర్ వై శివశంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ బోధనతోపాటు వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం 32 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈవో ఎన్ శివారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు త్యాగరాజ స్వామి ఆరాధనోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని వేదాయపాళెం త్యాగరాజస్వామి మందిరంలో శనివారం ఆరాధనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు మందిర నిర్వాహకుడు డాక్టర్ వై నాగదేవి ప్రసాద్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 7గంటలకు అభిషేకం, 7.30కు భిక్షాటన ఆ తర్వాత సంగీత కచేరీలు, ఆరాధనోత్సవం, అన్నప్రసాద వితరణ జరుగుతాయని తెలిపారు

రాజరాజేశ్వరి సేవలో సోమిరెడ్డి

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారిని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చకులు ఆయనకు స్వాగతం పలికారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆనందంగా ఉండాలని సోమిరెడ్డి ఆకాంక్షించారు. ఆలయ మర్యాదలు స్వీకరించారు.

ఆర్టీసీ జోనల్ చైర్మన్‌కు సత్కారం

నెల్లూరు (సాంస్కృతికం), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ జోనల్ చైర్మన్ సన్నపురెడ్డి సురేశ్‌రెడ్డిని నెల్లూరు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి ఏ జయప్రకాష్ శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో జనార్దన్‌రావు పాల్గొన్నారు.

'అమృత్' డీడీగా మాధురి

నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి): అమృత్ పథకం కింద నగరంలో జరుగుతున్న పనుల ఆర్థిక లావాదేవీలపై పర్యవేక్షణకు డిప్యూటీ డైరెక్టర్‌గా జీ మాధురిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. రాష్ట్ర ఆడిట్ శాఖలో డీడీగా పని చేస్తున్న ఆమెను నెల్లూరుకు బదిలీ చేశారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లూరు (జడ్పీ/రూరల్), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నవలాకులతోటలోని 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శని, ఆదివారాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీలక్ష్మీ తెలిపారు. నెల్లూరు రూరల్లోని కోడూరుపాడు, నారాయణరెడ్డిపేట, నవలాకులతోట, కొత్తకాలువ, అల్లీపురం, పెద్దచెరుకూరు, గుడిపల్లిపాడు, చింతారెడ్డిపాళెం, సౌత్‌రాజుపాళెం ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, నవలాకులతోట సబ్ స్టేషన్ మరమ్మతుల వల్ల నగరంలోని హరనాథపురం, రామూర్తినగర్, రేబాలవారి వీధి, శెట్టిగుంట రోడ్డు, ఎన్టీఆర్ నగర్, యలమవారిదిన్నె, జగదీష్‌నగర్, అల్లీపురం టిడ్కో గృహాల ప్రాంతాల్లోనూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ ఎం శ్రీధర్ మరో ప్రకటనలో తెలిపారు.

అన్న క్యాంటీన్లకు నోడల్ అధికారులు

- నగర కమిషనర్ సూర్యతేజ
- సిబ్బంది పెంపునకు ఉత్తర్వులు
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

నెల్లూరు(సిటీ), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : పేదోడికి పట్టెడన్నం పెట్టే అన్న క్యాంటీన్ల పర్యవేక్షణకు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్యతేజ ఆదేశాలిచ్చారు. ఇటీవల నగరంలోని అన్న క్యాంటీన్లలో వాస్తవ పరిస్థితులను పరిశీలించిన ఆంధ్ర జ్యోతి బృందం ప్రత్యేక కథనాన్ని వెలువరించింది. ఈ నేపథ్యంలో కమిషనర్ శుక్రవారం కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. నగరంలో ఉన్న ఏడు అన్న క్యాంటీన్లకు ఏడుగురు నోడల్ అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. నిత్యం క్యాంటీన్లలో మెరుగైన పరిస్థితులు, నెలకొన్న లోపాలపై అధ్యయనం చేసి తనకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రస్తుతం క్యాంటీన్లలో ఏడుగురు సిబ్బంది సేవలు అందిస్తున్నారని, అవసరమైన మేరకు వారి సంఖ్య పెంచుకోవచ్చన్నారు. క్యాంటీన్ల వద్ద రద్దీ వల్ల ఉద్రిక్తత నెలకొనకుండా పోలీసు వారి సహకారం తీసుకోనున్నట్లు చెప్పారు.

భవనాలకు నోటీసులివ్వండి

నగరంలో అనుమతుల్లేకుండా నిర్మిస్తున్న భవనాలను గుర్తించి వాటి యజమానులకు నోటీసులు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్యాన్ని, అక్కడి భవనాలను ఆయన పరిశీలించారు. రోడ్లపై చెత్త వేసే వారికి జరిమానా విధించాలని సూచించారు. సచివాలయాల్లోని ప్లానింగ్ సెక్రటరీలతో సమీక్ష నిర్వహించారు. అనుమతులు లేకుండా నిర్మిస్తున్న భవనాలను కట్టుబడి దశలోనే తొలగించాలన్నారు. ఈ కార్యక్రమాల్లో డీసీ చెన్నుడు, ఎంహెచ్‌వో డాక్టర్ చైతన్య, సీపీ హిమబిందు, డీసీపీ పద్మజ పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ సూర్యతేజ

నగరంలో ఫీవర్ సర్వే

- ఇంటింటి పరిశీలనలో అధికారులు

నెల్లూరు (వైద్యం), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో నగరంలో ఫీవర్ సర్వే జరుగుతోంది. శుక్రవారం వేదాయపాళెం పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని సప్తగిరి కాలనీలో ఇంటింటి సర్వే నిర్వహించారు. అనుమానిత డెంగ్యూ కేసులు ప్రబలిన ప్రాంతాల్లో ఈ సర్వే నిర్వహిస్తున్నారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు జిల్లా మలేరియా నివారణ విభాగం వైద్యాధికారి నాగార్జున సూచించారు.


ఫీవర్ సర్వే చేస్తున్న అధికారులు, సిబ్బంది

సహకార శాఖ డైరీ ఆవిష్కరణ



నెల్లూరు (హరనాథపురం), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : సహకార శాఖ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ 2025 డైరీని జాయింట్ కలెక్టర్ కార్తీక్ శుక్రవారం తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి గురప్ప తదితరులు పాల్గొన్నారు.

ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో కొత్తూరు అరుంధతివాడలో నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీల విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ముగ్గుల పోటీ నిర్వహించి విజేతలకు బంగారు, వెండి బహుమతులు అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, రాజాగాలి, మోష, గురుబ్రహ్మం, కరిముల్లా పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రవాణాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం వీఆర్సీ సెంటర్‌లో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అధికారులు అవగాహన కల్పించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రఫి మాట్లాడుతూ రోడ్డుపై వాహనాలు నడిపే ప్రతి ఒక్కరు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐ గోపీనాయక్, ఏఎంవీఐలు మల్లికార్జునరెడ్డి, కార్తీక్ పవన్‌కుమార్, పూర్ణచంద్రరావు, స్వప్నిల్ రెడ్డి పాల్గొన్నారు.



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న రవాణా శాఖ అధికారులు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తోటపల్లిగూడూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కోడూరు, నరుకూరు, సౌత్ఆములూరు, పొట్లపూడి, నెలిమెట్ట కండ్రిగ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాలకు విద్యుత్ సరఫరాకు శని, ఆదివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు మరమ్మతులు జరగనుండడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని కోడూరు సెక్షన్ ఏఈ ప్రతాప్ ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి వచ్చే 33/11 కేవీ, నవలాకులతోట గార్డెన్ దగ్గర మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. దీంతో సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, దీనికి ఆయా ప్రాంతాల వినియోగదారులు, రైతులు సహకరించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతులే లక్ష్యం

- సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

వెంకటాచలం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వసతుల కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించి మాట్లాడుతూ సెంబ్ కార్ప్ కంపెనీ సహకారంతో రూ.53 లక్షలతో 15 రోజుల్లో పరికరాలు సమకూర్చనున్నట్లు పేర్కొన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన పరికరాల కోసం సెంబ్ కార్ప్ కంపెనీ రూ.1.90 కోట్లు ఖర్చు పెడుతుందన్నారు. త్వరలో పొదలకూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ చేతుల మీదుగా డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రభుత్వ ఆసుపత్రులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇటు ప్రభుత్వ నిధులతో పాటు ప్రైవేటు కంపెనీల నిధులతో సాధ్యమైనన్ని వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.


ఆసుపత్రిలో రోగులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

మనుబోలు(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరంపల్లికి చెందిన అడపాల నిర్మలమ్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.81,500 చెక్కును శుక్రవారం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నెల్లూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు నిర్మలమ్మ భర్త కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొట్టేళ్ల ప్రసాద్, రఘురామయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

'మానిపండు' నివారణకు చర్యలు చేపట్టాలి : ఆత్మ పీడీ

ఇందుకూరుపేట, జనవరి 17(ఆంధ్రజ్యోతి): వరి పైరులో మానిపండు తెగులు, ఎలుకల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆత్మ పీడీ శివన్నారాయణ సూచించారు. కొమరికలో శుక్రవారం నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి మానిపండు తెగులు, ఎలుకలను గమనించామన్నారు. చిరుజల్లులు, తేమతో కూడిన వాతావరణం మానిపండు తెగులుకు కారణమన్నారు. దీని నివారణకు ప్రొఫైకోనజోల్ (టిల్ట్) 200ఎంఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. ఎలుకల నివారణ కోసం బ్రోమోడైలిన్ మందును రైతు లుకు ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు, వీఏఏలు శ్రీకాంత్, సుదీక్షణ, తదితరులు పాల్గొన్నారు.

పరిశోధనా వ్యాసం సమర్పించిన ఎంబీఏ విద్యార్థులు

కొడవలూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : కొడవలూరులోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు, ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఇన్ టెక్నాలజీ సంస్థకు పరిశోధన గ్రంథం సమర్పించారు. 'డీ కోడింగ్ కన్స్యూమర్ ఇన్సైట్, పర్సెప్షన్స్ అండ్ ఎక్స్పెక్టేషన్స్ ఆఫ్ హీరో టూ వీలర్స్' పత్రంను ఎంబీఏ అధ్యాపకురాలు శ్రావణి మార్గదర్శకంలో సమర్పించారు. ఈ పత్రాన్ని విద్యార్థులు విశ్వాస్, ఫణి, రుహీనా, సోఫియా పరిశోధించి రచించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్ మాట్లాడుతూ నూతన సంవత్సరం ప్రారంభంలోనే ఎంబీఏ విద్యార్థులు పరిశోధన పత్రం సమర్పించినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌డీ డీన్ వెంకటనాగేంద్ర, ఎంబీఏ విభాగాధిపతి విజయ్‌కుమార్‌లు విద్యార్థులను అభినందించారు.

ఎన్టీఆర్ విగ్రహానికి రంగులు

కోవూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీ రామారావు వర్ధంతిని శనివారం ఘనంగా నిర్వహించేందుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఏర్పాట్లను పూర్తి చేశారు. పడుగుపాడు చంద్రమౌళినగర్ గిరిజన కాలనీలో ఎన్టీఆర్ విగ్రహానికి రంగులు వేశారు. స్థానిక వీఆర్ఆర్ కాలనీలో భారీ స్థాయిలో అన్నదానం చేసేందుకు కార్యక్రమాన్ని రూపొందించారు. పేదలకు దుస్తులు, దుప్పట్లను పంపిణీ చేయనున్నారు.


ఎన్టీఆర్ విగ్రహానికి వేస్తున్న రంగులు

కామాక్షితాయి సేవలో ఎన్‌సీసీ అధికారి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ నెల్లూరు 10(ఏ) నేవెల్ యూనిట్ ఎన్‌సీసీ కమాండింగ్ అధికారి గణేష్, శివాని దంపతులు శుక్రవారం జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయిలను దర్శించుకున్నారు. ముందుగా ఆలయ ఇన్‌స్పెక్టర్ మురళి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేసి శేషవస్త్రాలతో సత్కరించారు. వారి వెంట స్థానిక సర్పంచు కే.పెంచలయ్య, వీఆర్వో సౌమ్య, తదితరులు ఉన్నారు


ఎన్‌సీసీ అధికారిని సత్కరించిన ఆలయ ఇన్‌స్పెక్టర్

కామాక్షితాయికి వైభవంగా నిత్య కల్యాణం

మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయంలో శుక్రవారం ఉదయం గంగా, కామాక్షి సమేత మల్లికార్జునస్వామికి నిత్య కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లను ఆలయం చుట్టూ ఊరేగించారు. రాత్రి కామాక్షితాయికి సామూహిక కుంకుమార్చన, పల్లకీ సేవలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దీంతో మధ్యాహ్నం 45 నిమిషాలు దర్శన సమయం పొడిగించారు.

నేడు రాపూరు మండల సర్వసభ్య సమావేశం

రాపూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీవో భవానీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మండలంలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీలు, జడ్పీటీసీ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొంటారని ఎంపీడీవో పేర్కొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

- గైర్హాజరైన ఎన్‌ఎంలకు షోకాజ్ నోటీసులు

విడవలూరు, జవవరి 17 (ఆంధ్రజ్యోతి): మహిళల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని గ్రామ సర్పంచు ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి ఎస్థాని తెలిపారు. విడవలూరు కామాక్షినగర్‌లో శుక్రవారం జరిగిన మహిళా గ్రామసభలో వారు పాల్గొని మాట్లాడారు. పంచాయతీ అభివృద్ధిలో మహిళలు భాగస్వామ్యులు కావాలన్నారు. కాగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన గ్రామసభకు సచివాలయ ఏఎన్‌ఎంలు హాజరు కాకపోవడంపై వివరణ ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి ఎస్థాని షోకాష్ నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాశం శ్రీహరిరెడ్డి, చెముకుల శ్రీనివాసులు, పొన్నలూరు పురంధర్‌రెడ్డి, సత్యంరెడ్డి, చలంచర్ల కామేశ్వరమ్మ లు పాల్గొన్నారు.

'రూ.2 కోట్ల ప్రభుత్వ స్థలం కబ్జాపై చర్యలు తీసుకోండి'

కొడవలూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నార్తురాజుపాలెంలో సుమారు రూ.2కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాన్ని ఓ వైసీపీ నేత ఆక్రమించుకున్నారని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై శుక్రవారం తహసీల్దారు స్ఫూర్తిరెడ్డికి రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్తురాజుపాలెం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుండడంతో ఇక్కడ భూములు విలువ పెరిగిందని, దీంతో గత ప్రభుత్వంలో ఇష్టానుసారంగా కోట్ల విలువ చేసే భూముల నెంబర్లు మార్చి ఆక్రమించారన్నారు. ఆక్రమణకు గురైన ప్రభుత్వం భూమిని కాపాడాలని కోరారు. ఆయన వెంట టీడీపీ నాయకులు కరకటి మల్లికార్జున, పాటూరు రమేష్, తువ్వర ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

కురుగొండ్ల సోదరుడి మృతికి సంతాపం

రాపూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తమ్ముడు చంద్రశేఖర్‌నాయుడు (53) ఆకస్మికంగా గురువారం గుండెపోటుతో మరణించారు. విషయం తెలుసుకున్న రాపూరు మండల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. పెంచలకోన మాజీ చైర్మన్ చెన్నుతిరుపాల్‌రెడ్డి, మార్కెటింగ్ మాజీ వైస్‌పర్సన్ గంగిశెట్టి వెంకటేశ్వర్లు, నల్లవడ్ల వెంకటరమణరెడ్డి, మధురెడ్డి, పలువురు నాయకులు గుంటూరులోని ఆయన అంత్యక్రియలకు హాజరయ్యారు.

నేడు పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం పట్టణంలో జొన్నవాడ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు శనివారం పారిశుధ్యంపై అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు నగర పంచాయతీ కమిషనర్ ఎల్.చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

హనుమంతుడికి సామూహిక కుంకుమార్చన

మనుబోలు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని యాచవరంలో అభయాంజనేయస్వామి ఆలయంలో 3 రోజులుగా ప్రవచన కార్యక్రమాలు నిర్వహించారు. అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమాలను సమరత సేవా ఫౌండేషన్ మండల కన్వీనర్ ఆలూరు రాము ఆచారి, ఆలయ నిర్వాహకులు చల్లా శంకరయ్య, చల్లా నవకోటి తదితరులు పర్యవేక్షించారు.


సామూహిక కుంకుమార్చనలో భక్తులు

'సర్వేపల్లి' అభివృద్ధిపై చర్చకు సిద్ధమా!


- కాకాణికి టీఎన్ఎస్ఎఫ్ సవాల్

పొదలకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఎవరి హయాంలో అభివృద్ధి జరిగిందో చర్చకు మాజీ కాకాణి గోవర్ధన్‌రెడ్డి సిద్ధమా అని టీఎన్ఎస్ఎఫ్ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు కలగట్ల సందీప్ సవాల్ విసిరారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సర్వేపల్లి ప్రజల కోసం నిత్యం శ్రమిస్తున్న తమ నాయకుడు సోమిరెడ్డిని విమర్శించే స్థాయి కాకాణికి లేదని మండిపడ్డారు. గతంలో పేదలకు మినరల్ వాటర్ అందించేందుకు సుమారు రూ.4 కోట్లతో మినీవాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేస్తే, వైసీపీ అధికారంలోకి రాగానే ఎమ్మెల్యేగా కాకాణి వాటికి చరమగీతం పాడారన్నారు. ఇప్పటికైనా కాకాణి సోషల్ మీడియాలో అవాక్కులు చవాక్కులు పేలకుండా అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యువ నాయకులు రావూరి సుధీర్‌నాయుడు, అనిశెట్టి వీరేంద్రబాబు, గిరి, సురేష్, శివ, విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎస్ఐ రంగనాథ్‌గౌడ్

కోవూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు-కోవూరు మార్గంలో నిత్యం తిరిగే ఆటో డ్రైవర్లు కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ ఆదేశించారు. స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో శుక్రవారం ఆటో డ్రైవర్లకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆటోలను ఇష్టానుసారంగా నడుపుతున్నందు వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయని చెప్పారు. స్థానిక బజారుకూడలిలో ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యం వల్ల తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందన్నారు. నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శనివారం | 18-1-2025 | పేజీలు: 10 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 17 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: పంచమి పూర్తి; నక్షత్రం: పుబ్బ మ. 2.51 తదుపరి ఉత్తర; వర్జ్యం: రా. 10.50-12.37; దుర్ముహూర్తం: ఉ. 6.52-8.21; అమృతఘడియలు: ఉ. 7.53-9.37; రాహుకాలం: ఉ. 9.30-10.30; సూర్యోదయం:6.52; సూర్యాస్తమయం: 5.58 | శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు సిటీ

Nellore | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



తెలుగుదేశం పార్టీ






29వ వర్ధంతి
నా పరిపూర్ణ, పరిశుద్ధ హృదయంతో..
నిను కొల్చు భాగ్యం ఇంకెప్పుడూ..
ప్రభూ... ఈ జన్మకూ...
BOMMARILLU
ఆయన వీరాభిమాని
"బొమ్మరిల్లు వారి" సంస్థ అధినేత
వై.వి.ఎస్. చౌదరి


SITHARA ENTERTAINMENTS
SRIKARA STUDIOS presents
FORTUNE FOUR CINEMAS
KING OF SANKRANTI
A BOBBY KOLLI FILM
డాకు మహారాజ్
PRODUCED BY
SURYADEVARA NAGA VAMSI · SAI SOUJANYA
A THAMAN S MUSICAL
ADITYA MUSIC


MAHAAKAAL PICTURES
TRAILER OUT NOW
IN CINEMAS FROM
24th JAN
హత్య
DIRECTOR SRIVIDYA BASAWA PRODUCER S PRASHANTH REDDY


GOKULAM GOPALAN
SREE GOKULAM MOVIES
RAGAM MOVIES
MOVIE MAXX
SREENIWAAS MAMIDALA
SVM
SRI VEDAKSHARA MOVIES
CHINTHAPALLI RAMARAO
TOVINO THOMAS IN
IDENTITY
తెలుగులో
2025 లో విడుదలైన తొలి మలయాళ సూపర్ హిట్
చిత్రం 40 కోట్లు వసూలు చేసి తెలుగులో యాక్షన్
థ్రిల్లర్ మూవీగా విడుదలవుతోంది.
WRITTEN & DIRECTED BY
AKHIL PAUL – ANAS KHAN
RAJU MALLIATH DR ROY C J
24TH JAN 2025


SMT.ANITHA PRESENTS
SRI VENKATESWARA CREATIONS
GLOBAL STAR
RAM CHARAN
ZEE STUDIOS
DIL RAJU PRODUCTION
SANKRANTI
BLOCKBUSTER
SHANKAR'S
GAME CHANGER
PRODUCED BY RAJU - SHIRISH
A THAMAN S MUSICAL
TELUGU - TAMIL - HINDI - KANNADA - MALAYALAM
NOW IN CINEMAS


DIL RAJU PRESENTS
SRI VENKATESWARA CREATIONS
BLOCKBUSTER
PONGALUU
సంక్రాంతికి వస్తున్నాం
AN ANIL RAVIPUDI FILM
PRODUCER SHIRISH

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

సింహపురి భగీరథుడు ఎన్టీఆర్



అభిమానులకు ఆరాధ్య దైవం, రాజకీయ నాయకులకు అన్న, రైతాంగానికి సింహపురి భగీరథుడిగా జిల్లావాసుల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నట సార్వభౌమ, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు. సిరుల పంటలకు నిలయమైన కృష్ణా, గోదావరి జిల్లాల్లో ఒకటి కాకపోయినా పెన్నా నదిని జిల్లావాసుల జీవనాడిగా మార్చి నెల్లూరును ఆ జిల్లాలతో సరితూగేలా చేసిన దార్శనికుడు ఎన్టీఆర్. తన రాజకీయ అరంగేట్రం ద్వారా ఎందరికో రాజకీయ భవిష్యత్తును ఇచ్చిన ఆయన ముఖ్యమంత్రిగా కృష్ణా, పెన్నా నదుల అనుసంధానంతో జిల్లాను సస్యశ్యామలం చేశారు. జిల్లావాసులకేకాక చెన్నై నగరవాసుల దాహార్తిని తీర్చి, జిల్లాలో సమృద్ధిగా పంటలు పండేలా చేలకు గంగమ్మను పారించారు.

పక్షుల పండుగ వచ్చేసింది..

- నేటి నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్
- సూళ్లూరుపేటలో ఏర్పాట్లు పూర్తి



అటకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రం వద్ద ఆహ్వానం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెమింగో సైకత శిఖరం



మైదానంలో ఎమ్మెల్యే విజయశ్రీతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సూళ్లూరుపేట/తడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో సంక్రాంతి, ఏటి పండుగ ముగియగానే పక్షుల సంబరాలు వచ్చేశాయి. పులికాట్, నేలపట్టులకు వచ్చే వలస పక్షుల ప్రాముఖ్యతను తెలుపుతూ శనివారం నుంచి మూడు రోజుల పాటు పక్షుల పండగ అంగరంగ వైభవంగా జరగనుంది. ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. శనివారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర టూరిజం, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ జూనియర్ కళాశాల మైదానంలో ఈ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఉదయం చెంగాళమ్మ ఆలయం నుంచి శోభాయాత్రలో మంత్రులు పాల్గొని కళాశాల మైదానంలో జరిగే ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. కళాశాల మైదానంలో స్టేజీ, స్టాల్స్, డిజిటల్ గ్యాలరీలు సిద్ధం చేశారు. భీములవారిపాళెంలో పడవషికారుకు 35 పడవలను సిద్ధం చేశారు. లైఫ్ జాకెట్‌లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. అక్కడే స్టేజీ నిర్మించి స్థానిక కళాకారుల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అటకానితిప్ప, శ్రీసిటీలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో ఇద్దరు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 22 మంది ఎస్ఐలతో సహా 400 మందితో భద్రతా ఏర్పాట్లు చేశారు. పర్యాటకులను అటకానితిప్ప, నేలపట్టు, భీములవారిపాళెంలకు తీసుకువెళ్లేందుకు ఆర్టీసీ బస్సులతో పాటు కొన్ని ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేశారు.

వలస పక్షులకు ఆహ్వానం పలుకుతూ..

ఏటా శీతాకాలంలో పులికాట్ సరస్సు, నేలపట్టు ప్రాంతాలకు వలస వచ్చే విదేశీ విహంగాలకు ఆహ్వానం పలుకుతూ వాటి విశిష్టతను తెలియజేసేందుకు 2001లో తొలిసారిగా పక్షుల పండగకు అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అప్పటి ఉమ్మడి నెల్లూరు కలెక్టర్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో ఈ పండగ నిర్వహించారు. పులికాట్‌కు వచ్చే వలస పక్షుల్లో అరుదైన ఫ్లెమింగో పేరుతో ఈ పండగను ఏటా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు కూడా ఈ పండగను ఆట్టహాసంగా చేస్తూ వచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది చేసి తర్వాత ఆపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ఫెస్టివల్‌ను అట్టహాసంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంది. ఈ ఏడాది మొత్తం 5 చోట్ల పండగ నిర్వహిస్తున్నారు. నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం, సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానం, అటకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రం, బీవీపాలెం, శ్రీసిటీలో నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

పక్షుల పండుగ కార్యక్రమాల వివరాలు ఇలా..

తొలిరోజు..

- చెంగాళమ్మ ఆలయం నుంచి శోభాయాత్ర
- బెలూన్ల విడుదల
- ప్రారంభోత్సవం
- సాయంత్రం 4 గంటలకు పాఠశాల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు
- 5 గంటలకు సాంస్కృతిక వేడుకలు
- రాత్రి 7 గంటలకు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు

రెండవ రోజు

- మధ్యాహ్నం వరకు క్రీడా పోటీలు
- సాయంత్రం 4 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక పోటీలు
- రాత్రి 7 గంటలకు ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు

మూడవ రోజు

- ఉదయం 10 గంటలకు వంటల పోటీలు
- సాయంత్రం 4 గంటలకు ముగింపు వేడుక
- 5 గంటలకు సంప్రదాయ సంస్కృతి వేడుక
- 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు

నేడు స్వచ్ఛ ఆంధ్ర..
స్వచ్ఛత దివస్!

- ప్రతి మూడో శనివారం నిర్వహించాలి
- అధికారులకు కలెక్టర్ ఆనంద్ ఆదేశం

నెల్లూరు (సాంస్కృతికం) జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ప్రతినెల మూడో శనివారం జిల్లా అంతటా స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛత దివస్ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా అధికారులతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి స్వచ్ఛతా కార్యక్రమాల్లో చేపట్టవలసిన అంశాలపై దిశానిర్దేశం చేశారు. పట్టణాలు, గ్రామాల్లో వీధులను, డ్రైనేజీలను, తాగునీటి వనరులను, ఓహెచ్ఎస్ఆర్‌లను శుభ్రం చేయాలని ఆదేశించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యశాఖ అధికారులు, సిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛత కార్యక్రమాలపై ర్యాలీలు నిర్వహించి, అందరిచేత ప్రతిజ్ఞ చేయించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, గ్రామీణాభివృద్ధి, డ్వామా, వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపల్ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో కీలకపాత్ర వహించాలని, ప్రజలను ప్రజాప్రతినిధులను పెద్ద ఎత్తున భాగస్వామ్యులను చేయాలన్నారు. ప్రతి శాఖలో ఈ కార్యక్రమాలను సమన్వయపరచడానికి ఒక నోడల్ అధికారిని నియమించినట్లు చెప్పారు. కాగా, శనివారం నగరంలో ర్యాలీ నిర్వహించి, వీఆర్సీ కూడలిలో ప్రతిజ్ఞ చేయనున్నారు.

అవన్నీ రద్దు!

వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పులు నేటికీ శాపాలుగా వెంటాడుతూనే ఉన్నాయి. నాడు అవకాశం ఉన్నా ఉపయోగించుకోలేని అసమర్థత నేడు ప్రత్యక్షంగా ప్రజలపై ప్రభావం చూపుతోంది. జిల్లాలో కీలకమైన రోడ్డు పనులను రద్దు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వంలో విచ్చలవిడిగా లెక్కకు మించి అనుమతులు మంజూరు చేసిన ఫలితంగా ఇప్పుడు రద్దు చేయాల్సిన పరిస్థితి తలెత్తింది. అనుమతులు మంజూరు చేసినా ఆ పనులను కాంట్రాక్టర్లు చేపట్టకపోవడంతో తదుపరి కొత్త వర్కులు మంజూరు చేయడం ప్రభుత్వానికి ఇబ్బందిగా మారింది. వీటన్నింటి నేపథ్యంలో గత ప్రభుత్వంలో మంజూరై ప్రారంభం కాని వర్కులను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటితో పాటు 25 శాతంలోపు పనులు జరిగిన వర్కులను కూడా రద్దు జాబితాలోకి చేర్చింది. జిల్లాలో మూడు సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ (సీఆర్ఐఎఫ్) రోడ్లతో పాటు పలు ఎండీఆర్ రోడ్లు, రాష్ట్ర రహదారులు కూడా రద్దయ్యాయి.

- కీలకమైన రోడ్డు పనులు కేన్సల్ చేసిన ప్రభుత్వం
- ప్రారంభంకాని రోడ్లు, 25 శాతంలోపు వర్కులే
- ఈ జాబితాలో ముఖ్యమైన మూడు సీఆర్ఐఎఫ్ రోడ్లు
- రద్దు లిస్టులో ఎండీఆర్, స్టేట్ హైవేస్ వర్కులు
- గత ప్రభుత్వంలో లెక్కకు మించి అనుమతులివ్వడమే కారణం

నెల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు-మైపాడు రోడ్డు, నెల్లూరు-పొదలకూరు-సైదాపురం రోడ్డు, గూడూరు-తురిమెర్ల రోడ్లు రద్దు జాబితాలో ఉన్నాయి. ఈ మూడూ కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టినవి కావడం గమనార్హం. నెల్లూరు-మైపాడు రోడ్డును రూ.48 కోట్ల అంచనాతో 2023 చివర్లో టెండర్లు పిలిచి అప్పగించారు. రెండేళ్లలో పని పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఏడాది పాటు కాంట్రాక్టర్ పని మొదలుపెట్టలేదు. గతేడాది అక్టోబరులో రాష్ట్ర ప్రభుత్వం వర్కులను రద్దు చేసేందుకు ప్రోగ్రెస్ రిపోర్ట్ తీసుకున్న తర్వాత హడావిడిగా పనులు ప్రారంభించారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం నుంచి విడుదలైన జాబితాలో ఈ వర్కు అసలు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. కానీ ఇటీవల ఆ రోడ్డు విస్తరణ చేపట్టేందుకు గతంలో వేసిన గ్రావెల్‌ను తవ్వి తరలించడంతో రోడ్డు గందరగోళంగా మారింది. మరి ప్రభుత్వానికి నివేదిక పంపాక కాంట్రాక్టర్ చేత ఆర్అండ్‌బీ అధికారులు ఎలా పనులు చేయించారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అలానే నెల్లూరు-పొదలకూరు-సైదాపురం రోడ్డును 2023లో టెండర్లు పిలిచి అప్పగించారు. కానీ ఈ పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. ఇప్పటికి సుమారు 7 శాతం పనులు మాత్రమే జరిగాయి. గూడూరు-తురిమెర్ల రోడ్డును కూడా 2023లోనే టెండర్లు పిలిచి అప్పగించినప్పటికీ పనులు ఆశించిన స్థాయిలో జరగలేదు. ఇప్పటికి 13.61 శాతమే పనులు జరిగినట్లు అధికారులు నివేదికలు చెబుతున్నాయి. రద్దయిన ఈ మూడు సీఆర్ఐఎఫ్ వర్కుల విలువ రూ.123 కోట్లుగా ఉండడం గమనార్హం.

● రద్దు జాబితాలో ఇంకా..

వెంకటాచలం మండలం తిరుమలమ్మపాలెం వద్ద ఉప్పుకాలువపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.13 కోట్లు, ముత్తుకూరు మండలం బ్రహ్మదేవం-పొట్టేంపాడు మధ్య నక్కలవాగుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ 2023లో జీవో విడుదల చేశారు. అయితే ఈ రెండు పనులకు ఆర్అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. తిరుమలమ్మపాలెం రోడ్డు అభివృద్ధికి 2023లో రూ.3 కోట్లు, కొలనకొదురు రోడ్డు అభివృద్ధికి రూ.4 కోట్లు మంజూరు చేసినప్పటికీ వాటికి ఇంత వరకూ టెండర్లు పిలవలేదు. కావలి మెయిన్ రోడ్డును అభివృద్ధి చేసేందుకు రూ.55 కోట్ల అంచనాలతో 2020లో టెండర్లు పిలిచారు. అయితే పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ చాలా కాలం పాటు పనులు చేయలేదు. ఆ తర్వాత కొద్దిగా పనులు చేసి ఆపేశారు. ఇప్పటివరకూ 12.3 శాతం మాత్రమే పనులు జరిగాయి. దీంతో ఈ వర్కులన్నిటినీ రద్దు చేస్తూ ఆర్అండ్‌బీ సెక్రటరీ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. వీటన్నింటి విలువ రూ.82 కోట్ల వరకూ ఉంది. మొత్తంగా జిల్లాలో రూ.200 కోట్ల విలువైన వర్కులు రద్దయ్యాయి. కాగా ఈ అంశంపై ఆర్అండ్‌బీ ఎస్ఈ గంగాధర్‌ను వివరణ కోరగా ప్రారంభం కాని వర్కులు, 25 శాతంలోపు పనులు జరిగిన వర్కులను రద్దు చేసిన మాట వాస్తవమేనని చెప్పారు. ఈ ఉత్తర్వులు సెక్రటరీ నుంచి ఈఎన్‌సీకు అందాయని, వారు తమకు వాట్సాప్ ద్వారా పంపారని పేర్కొన్నారు. ఫిజికల్ కాపీలో ఒకటి, రెండు రోజుల్లో అందుతాయని ఎస్ఈ చెప్పారు.

ఇరిగేషన్ ఎస్ఈగా
దేశా నాయక్

- టీజీపీ, సోమశిలకు రెగ్యులర్ ఎస్ఈలు

నెల్లూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు ఇరిగేషన్ సర్కిల్ రెగ్యులర్ ఎస్ఈగా ఎస్ దేశా నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకూ ఆయన డ్రైనేజీ డివిజన్ ఈఈగా ఉంటూ ఇన్‌చార్జ్ ఎస్ఈగా కొనసాగుతున్నారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగోన్నతులు కల్పించగా అందులో దేశానాయక్ ఎస్ఈగా ఉద్యోగోన్నతి పొందారు. తాజాగా ఆయన్ను నెల్లూరు సర్కిల్‌కే రెగ్యులర్ ఎస్ఈగా ప్రభుత్వం నియమించింది. ఇక సోమశిల ప్రాజెక్టు రెగ్యులర్ ఎస్ఈగా ప్రస్తుతం ఇన్‌చార్జ్‌గా ఉన్న బీవీ రమణారెడ్డి నియమితులయ్యారు. ఆయన కూడా ఇటీవల ఉద్యోగోన్నతి పొందారు. అలానే కడప జిల్లా జమ్మలమడుగులో జీఎన్ఎస్ఎస్ సర్కిల్‌లో ఈఈగా పనిచేస్తున్న ఎన్ రాధాకృష్ణారెడ్డిని ఉద్యోగోన్నతిపై నెల్లూరు టీజీపీ ఎస్ఈగా ప్రభుత్వం నియమించింది. చాలా కాలంగా ఇన్‌చార్జ్‌ల పాలనలో సాగుతున్న మూడు సర్కిళ్లకు ఎట్టకేలకు రెగ్యులర్ ఎస్ఈలు వచ్చారు.

పురుషులకూ
పొదుపు సంఘం

- 'డ్వాక్రా' తరహాలో ఏర్పాటుకు కసరత్తు
- వివరాలు సేకరిస్తున్న మెప్మా అధికారులు
- లక్ష్యం 200 గ్రూపులు.. ఇప్పటిదాకా 21

నెల్లూరు (హరనాథపురం) జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : ఇప్పటివరకు మహిళల పొదుపు సంఘాల (డ్వాక్రా) గురించి విన్నాం. మరి పురుషుల పొదుపు సంఘాల గురించి ఎప్పుడైనా విన్నారా!?. అయితే, కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. మహిళలతో సమానంగా వివిధ అసంఘటిత రంగాల్లో ఉన్న పురుషులతో గ్రూపులను ఏర్పాటు చేయించి.. వారి చేత కూడా పొదుపు చేయించి వారూ ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి చర్యలు చేపట్టింది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఈ పురుషుల పొదుపు సంఘాలు ఏర్పాటవుతున్నాయి. ఇప్పటికే అసంఘటిత రంగాల్లో ఉన్న పురుషుల వివరాలను మెప్మా అధికారులు సేకరిస్తున్నారు. జిల్లాలో 200 గ్రూపులు ఏర్పాటు చేయాలని లక్ష్యం కాగా ఇప్పటివరకు 21 గ్రూపులను ఏర్పాటు చేశారు. తెలుగుదేశం పార్టీ తొలుత డ్వాక్రా సంఘాలను ఏర్పాటు చేయగా, 10 మంది మహిళా సభ్యులతో ఒక్కో సంఘాన్ని నెలకొల్పి పొదుపు చేయించారు. పొదుపు ఆధారంగా బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని సక్రమంగా చెల్లించే వారికి రుణం పెంచుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ఒక్కో సంఘానికి రూ.20లక్షల వరకు ఎలాంటి పూచీకత్తు లేకుండా బ్యాంకులు రుణాలు ఇస్తున్నాయి. జిల్లాలో 15,024 మహిళా సంఘాలు ఉండగా, 1.5 లక్షల మంది సభ్యురాళ్లు ఉన్నారు. బ్యాంకుల నుంచి రుణాలు పొంది చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. ఇదే తరహాలో పురుషుల గ్రూపులను ఏర్పాటు చేయించి తొలి విడతలో ఒక్కో గ్రూపునకు రూ.50 వేల నుంచి లక్ష వరకు రుణం ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించిన గ్రూపులకు ఎలాంటి పూచీకత్తు లేకుండా బ్యాంకర్లు రుణం మొత్తాన్ని పెంచి ఇస్తారు.



పురుషుల పొదుపు గ్రూపు సభ్యులకు వివరాలు తెలియజేస్తున్న మెప్మా అధికారి

ఈ రంగాల వారికి..

భవన నిర్మాణ కార్మికులు, రిక్షా కార్మికులు, వాచ్‌మెన్, డెలివరీ బాయ్స్ ప్రైవేటు సంస్థల్లో పనిచేస్తున్న వారు ఇలా 18 ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఉన్న పురుషులు, పురుషుల గ్రూపులుగా (వనరు లబుల్ గ్రూప్స్) చేరవచ్చు. గ్రూపుల ఏర్పాటుకు తెల్ల రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు కలిగి ఉండాలి.

200 గ్రూపుల లక్ష్యం

జిల్లాలో 200 పురుషుల పొదుపు గ్రూపులు ఏర్పాటు చేయడానికి మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. నెల్లూరు, కావలి, ఆత్మకూరు, కందుకూరు, బుచ్చి మున్సిపాలిటీలలో ఈ గ్రూపులను ఏర్పాటు చేయిస్తున్నారు. ఇప్పటికే నెల్లూరులో 21 గ్రూపులను ఏర్పాటు చేయించారు. ఈ నెలాఖరులోగా మిగిలిన గ్రూపుల ఏర్పాటుకు మెప్మా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ గ్రూపులలోని సభ్యులతో పొదుపు అలవాటు చేయించడమేగాక వారికి రుణాలు ఇచ్చేలా బ్యాంకర్లతో మాట్లాడుతున్నారు.

21 గ్రూపులు ఏర్పాటు చేయించాం



జిల్లావ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల పరిధిలో 200 పురుషుల పొదుపు గ్రూపులను ఈ నెలాఖరులోగా ఏర్పాటు చేయించాలని నిర్ణయించాం. ఇప్పటికే 21 గ్రూపులను ఏర్పాటు చేయించాం. మహిళా పొదుపు సంఘాల మాదిరిగానే పురుషుల చేత పొదుపు సంఘాల ఏర్పాటు చేయించి, వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి, వారు ఆర్థికంగా నిలదొక్కుకుని జీవనోపాధి పొందేలా చర్యలు తీసుకుంటున్నాం.

- రాధమ్మ, మెప్మా పీడీ

- వైసీపీ హయాంలో అడ్డగోలు బదిలీలు
- 49 మంది టీచర్లకు దొడ్డిదారిన స్థానచలనాలు
- ఆ ఉత్తర్వులను రద్దు చేసిన కూటమి ప్రభుత్వం
- కమిషనర్ చుట్టూ ఉపాధ్యాయుల ప్రదక్షిణలు





ఇప్పుడేం
చేద్దాం!?

వైసీపీ హయాంలో కౌన్సెలింగ్‌తో సంబంధం లేకుండా అడ్డదారుల్లో బదిలీలు చేయించుకున్న ఉపాధ్యాయుల్లో ఇప్పుడు వణుకు మొదలైంది. జిల్లాలో రెండు విడతలుగా 49 మంది టీచర్లకు సిఫారసు బదిలీలను నాటి విద్యాశాఖాధికారులు చొరవ చూపి బ్లాక్ చేసిన వేకెన్సీలు, పదోన్నతుల్లో ఏర్పడిన ఖాళీల్లో పోస్టింగ్‌ల ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ప్రస్తుతం ఆ ఉత్తర్వులను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో సదరు ఉపాధ్యాయులు ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు.

నెల్లూరు(విద్య), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొంతమంది ఉపాధ్యాయులు వైసీపీ ప్రభుత్వానికి అనుకూలంగా ఉంటూ నాటి మంత్రులు, నేతలను నమ్ముకుని సిఫారసు బదిలీలకు రూ.లక్షల్లో ఖర్చు చేశారు. దీంతో ఎన్నికలకు ముందు హడావుడిగా ఉపాధ్యాయుల బదిలీల ఉత్తర్వులు వెలువడడంతో జిల్లాలో నాడు ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. నాడు ఎస్‌జీటీలు, ఎస్ఏలు కలిపి 49 మంది బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు సీల్డ్‌కవర్‌లో జిల్లా విద్యాశాఖకు చేరాయి. జిల్లాలో గత ఏడాది జూన్‌లో జరిగిన సాధారణ బదిలీల్లో దాదాపు 4వేలమంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగింది. జీఓ నెం 117 ఉత్తర్వులు, పాఠశాలల విలీనం, రేషనలైజేషన్ తదితర కారణాలతో పలువురు టీచర్లకు అప్పటివరకు పనిచేసిన ప్రాంతం, మండలం, డివిజన్ దాటి సుమారు 100 నుంచి 200 కిలోమీటర్ల దూరంలోని పాఠశాలలకు బదిలీ కావాల్సి వచ్చింది. ఈ నిబంధనలను సవరించాలని దూరప్రాం తాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులు నాటి వైసీపీ ప్రభుత్వాన్ని వేడుకున్నా పట్టించుకోలేదు. కానీ సిఫారసు బదిలీలకు మాత్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ముడుపులు ఇచ్చిన వారికి నచ్చిన స్థానాలను కేటాయించింది.

● బదిలీల రద్దుపై సందిగ్ధత

వైసీపీ ప్రభుత్వంలో అడ్డదారుల్లో వెళ్లిన కొంతమంది ఉపాధ్యాయులు ప్రస్తుతం సందిగ్ధంలో ఉన్నారు. నాడు పోటాపోటీగా క్యూలు కట్టడంతో పాటు రూ.లక్షలు చెల్లించి తెచ్చుకున్న ఆర్డర్‌లను కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో ఏం చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. వీరిలో కొంతమంది న్యాయస్థానాలను ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో విద్యాశాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ప్రస్తుతం వారు పని చేస్తున్న ప్రాంతాల నుంచి తొలగించడంతో తమకు పాఠశాలలు కేటాయించాలని విద్యాశాఖ కమిషనర్‌ను కలిసినట్లు సమాచారం. మెడికల్ లీవ్‌లు పెట్టుకుని వెళ్లాలని, వచ్చే విద్యాసంవత్సరంలో జరిగే సాధారణ బదిలీల్లోనే తిరిగి అవకాశం కల్పిస్తామని చెప్పడంతో పలువురు టీచర్లు గగ్గోలు పెడుతున్నారు. ఈ ఉత్తర్వులు ఇచ్చిన సమయంలో జిల్లాలో పనిచేసిన డీఈఓతోపాటు ఆయనకు సహకరించిన సిబ్బంది వివరాలను కూడా ఉన్నతాధికారులు రహస్యంగా సేకరిస్తున్నారు. దీంతో నాడు జేబులు నింపుకున్న అధికారులు, సిబ్బంది ఈ సమస్యను ఎలా అధిగమించాలన్న ఆలోచనలతో కమిషనర్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. అక్రమ బదిలీలపై ఎప్పుడు ఎలాంటి ఉత్తర్వులు జిల్లాకు వస్తాయోనని అందరిలో ఉత్కంఠ నెలకొని ఉంది.

అనుమతులెందుకు... కట్టేయ్!



నెల్లూరు నగరంలో అక్రమ నిర్మాణదారులు ఎంతగా బరితెగించారో చెప్పడానికి ఈ చిత్రంలోని నిర్మాణమే నిదర్శనం. బాలాజీనగర్ ప్రాంతం చీపురకట్ట వీధి మలుపు వద్ద ఓ వ్యక్తి ఏకంగా రెండంతస్తుల భవనాన్ని దుకాణాలతో కట్టేశాడు. దీనికి కార్పొరేషన్ నుంచి అనుమతులు లేవు. అయినా.. మనల్ని ఎవరు అడుగుతాడు?, అడిగినా సొమ్ములిచ్చేస్తే సరిపోద్దనుకున్నాడో ఏమో తెగించి కట్టేశాడు. దీని విలువ సుమారు రూ.2కోట్ల పైమాటే. కానీ ఇదికాస్తా రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ నోటీసుకెళ్లింది. వెంటనే కూల్చేయమని ఆయన ఆదేశించారు. ఈ నిర్మాణం జరుగుతున్న సమయంలో ఎందుకు చర్యలు తీసుకోలేదని గురువారం కార్పొరేషన్‌లో జరిగిన సమీక్షలో సిటీ ప్లానింగ్ అధికారులను మంత్రి నిలదీశారు. దీంతో యంత్రాంగం రంగంలోకి దిగింది. రోడ్ల పక్కన నిలువ నీడకోసం పేదలు వేసుకునే గుడిసెలను ఉన్నపళంగా కూల్చేసే అధికారులు నడిరోడ్డుపై ఇలాంటి నిర్మాణాలను ఎందుకు అడ్డుకోరని నగర వాసులు ప్రశ్నిస్తున్నారు.

- నెల్లూరు(సిటీ,ఆంధ్రజ్యోతి)

'కుష్ఠు' నివారణకు సహకరించాలి

● స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం), జనవరి 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కుష్ఠు వ్యాధి నివారణకు స్వచ్ఛంద సంస్థలు పూర్తి సహకారం అందించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాత పిలుపునిచ్చారు. శుక్రవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 20 నుంచి జరిగే కుష్ఠు వ్యాధి సర్వేకు తగిన సహకారం అందించాలని కోరారు. సర్వేలో ఏ విధంగా పాల్గొనాలో ఏడీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సురేంద్రబాబు, నరసింహులు, ప్రసాద్ ఆచారి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. కాగా, కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీఎంహెచ్‌వో ఆవిష్కరించారు. ప్రభుత్వ వైద్య పథకాల అమలుకు పీహెచ్‌పీలు సహకరించాలని కోరారు.


పీహెచ్‌పీల క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో సుజాత, అధికారులు, పీహెచ్‌పీ నాయకులు

ఆ రిజిస్ట్రేషన్లు రద్దు చేయండి

నెల్లూరు(సిటీ), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగర పాలక సంస్థకు చెందిన రిజర్వు స్థలాలను కొందరు వ్యక్తులు అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నందున వాటి రిజిస్ట్రేషన్లు రద్దు చేయాలని కమిషనర్ సూర్య తేజ రిజిస్ట్రారుకు లేఖ రాసిన విషయం శుక్రవారం వెలుగులోకి వచ్చింది. నెల్లూరు బిట్-1లోని 2006లో వేసిన లేఅవుట్‌లో సర్వే నెం. 140, 141లో ప్రజాప్రయోజనాలకు వదిలిన 250 అంకణాల స్థలాన్ని కొందరు వ్యక్తులు అక్రమంగా తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని, వాటి తాలూకు పత్రాలు రద్దు చేయాలని ఆయన రిజిస్ట్రేషన్ శాఖ అధికారులను కోరారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పక్షుల కిలకిలలే పులికాట్ భాష!

కథనం: దొరవారిసత్రం, ఆంధ్రజ్యోతి

మంచు కురిసేవేళ పక్షుల కిలకిలరావాలతో పులికాట్ కొత్త అందాలు సంతరించుకుంది. బాల భానుడి లేలేత కిరణాలతో సంగమించి పుత్తడి పులికాట్‌లా సాక్షాత్కరిస్తోంది. కదిలే పడవలు.. వలలు విసిరే జాలర్లు.. బిలబిలమంటూ వాలే వలస పక్షులు.. సుందర మనోహర దృశ్యం ఆవిష్కృతమవుతోంది. సూళ్లూరుపేట నుంచి శ్రీహరికోటకు వెళ్లే దారికి ఇరువైపులా పక్షులు సందడి చేస్తుంటాయి. తడ సమీపంలోని భీములవారిపాళెం నుంచి ఇరకం దీవి వైపునకు పడవలో వెళ్తే ఆ అనుభూతి మరోలా ఉంటుంది. ఫ్లెమింగో పండుగకు జిల్లా సిద్ధమవుతున్న వేళ పులికాట్ సందర్శన పర్యాటకులకు ఈ ఏడాది అద్భుత ఆనందాన్ని ఇస్తుంది. పర్యాటకులకు స్వాగతం పలుకుతూ పులికాట్ అందాలను ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్ ఇలా వడ్డిస్తున్నారు...



గ్రేట్ ఎగ్రేట్ (పెద్ద తెల్ల కొంగ)
ఎర్రకాళ్ల కొంగల జపం
పక్షుల గణాంకంలో అటవీశాఖ సిబ్బంది


పులికాట్‌లో దొరికే అరుదైన ముక్కోలాను చేపలు


పెలికాన్స్ (గూడబాతులు)


రెడ్ క్రెస్టెడ్ పోఛ్చ్ (ఎర్ర తల చిలువ)


కామన్ కూట్ (నామాల కోడి)


పక్షులూ.. పడవలూ

ఇదీ ఈ ఏడాది పక్షుల లెక్క..

చెన్నై నుంచి వచ్చిన నిపుణులు పక్షుల పోటిడిని గమనిస్తూ లెక్కలు కడుతున్నారు. శక్తిమంతమైన బైనాకులర్లు, వీడియో కెమెరాలతో వీరు పక్షులను లెక్కకడుతున్నారు. వీరి అంచనా ప్రకారం ఈ ఏడాది ఇప్పటిదాకా పులికాట్‌ను ఆశ్రయించిన వలస పక్షుల వివరాలు ఇవీ...

పక్షి పేరు	వాటి సంఖ్య
గ్రేటర్ ఫ్లేమింగో(రాజహంస) :	27,153
గ్రే పెలికాన్ (గూడబాతు) :	425
పెయింటెడ్‌స్టార్క్(ఎర్రకాళ్ళ కొంగ) :	2616
లిటిల్ ఈగ్రేట్స్(చిన్న తెల్లకొంగ) :	7962
లిటిల్ కార్మోరెంట్స్(చిన్న నీటికాకులు):	9862
లార్జీకార్మోరెంట్స్(పెద్ద నీటికాకులు) :	211
లార్జీఈగ్రేట్స్(తెల్ల కొంగ) :	1929
గ్రేహెరాన్(నారాయణపక్షి) :	280
పాండ్ హెరాన్(గుడ్డి కొంగ) :	595
నైట్‌హెరాన్(చింత వాఖీ) :	347
ప్రాపెల్ హెరాన్(ఎర్రనారాయణపక్షి):	16
కర్లెవ్(ఉల్లంకి పిట్ట) :	44
గ్లోస్‌సి ఐబిస్(తాటి కంకణం) :	4323
కాటిల్ ఈగ్రేట్(పశువుల కొంగ) :	6589
ఇండియన్ మూర్హెన్(తెల్లబొర్ర నీటి కోడి) :	988
యురేషియన్ కూట్(నామాల కోడి) :	4487
కామన్ కింగ్ ఫిషర్(చిన్న నీల బుచ్చిగాడు) :	176
పర్పల్ స్విమ్‌ఫెన్(సుల్తాన్ పక్షి) :	637
డాబ్ చిక్(బుడ్డకోడి) :	1086
సీగల్స్(సముద్రపు గౌరుకాకి) :	893
రెడ్ వాటిల్ లాప్వింగ్(ఎర్ర తీతువు పిట్ట) :	86
వైట్ బ్రెఆస్టెర్డ్ కింగ్ ఫిషర్(తెల్లచుక్కల నీలబుచ్చిగాడు) :	41
స్పాట్ బిల్ డక్(చుక్కమూతిబాతు) :	211
బ్లాక్ వింగ్డ్ స్టిల్(నల్ల రెక్కల ఉల్లంకి) :	2482
పైడ్ కింగ్ ఫిషర్(నీళ్ళ బుచ్చిగాడు) :	28
26. గ్రాబ్ ప్లోవర్(వాడర్ పక్షి) :	196
కామన్ టర్న్(రివ్వు పిట్ట) :	211
కాస్పియన్ టర్న్(సముద్రపు కాకి) :	373
రివర్ టర్న్(రామదాసు) :	440
వింబ్రెల్ (పెద్ద ఉల్లంకి) :	13
ఓపన్ బిల్ స్టార్క్(నత్తగుల్ల కొంగలు) :	8165
వైట్ ఐ బీస్(తెల్లకంకణాయి) :	5556
మార్ష్ హారియర్(చిత్త నేల గద్ద) :	03
ఫాసియానాస్ టిల్డ జాకనా(నెమలి తోక కొంగ) :	720
లెసర్ విజిలింగ్ డక్(సన్న ఈల చిలువ) :	200
రింగ్ ప్లోవర్ (పెద్ద బైతు ఉల్లంకి) :	353
బ్లాక్ టైల్డ్ గాడ్విట్(తొండు ఉల్లంకి) :	353
ప్లామ్ స్విఫ్ట్(చటక పక్షి) :	114
ఫ్లై క్యాచర్స్ (పిగిలి పిట్ట) :	96
బ్లాక్ డ్రోంగో (పసల పోలిగాడ్డు) :	62
గ్రీన్ బీ ఈటర్స్(చిన్న పస్సిరికి) :	289
పిన్టైల్ (సూదితోక బాతు) :	2450
కెంటిష్ ప్లోవర్(చిన్న బైతు ఉల్లంకి):	98
కామన్ రెడ్డాంక్(ఎర్రకాళ్ళ ఉల్లంకి) :	129
కామన్ గ్రీన్డాంక్(పచ్చకాళ్ళ ఉల్లంకి):	268
గ్రీన్ శాండ్ పైపర్(నల్ల ఉల్లంకి) :	342
సూపన్‌బిల్(తెడ్డు మూతి కొంగ) :	122
డార్టర్(పాము మెడ బాతు) :	08
మొత్తం :	117216



అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాల్సిందే

● మరో 337 అనధికార లేఅవుట్ల గుర్తింపు

● ప్రత్యేక బృందాలతో తొలగిస్తాం ● నుడా చైర్మన్ కోటంరెడ్డి


అధికారులతో మాట్లాడుతున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి

నెల్లూరు(జడ్పీ), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) పరిధిలోని లేఅవుట్లలో 10శాతం రిజర్వుడు స్థలం వదిలి నుడా అనుమతులు పొందకుంటే వాటన్నింటినీ తొలగిస్తామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు. అక్రమ లేఅవుట్లపై నుడా టౌన్ ప్లానింగ్ అధికారులతో ఆయన నుడా కార్యాలయంలో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ అక్రమ లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోవాలని, లేకుంటే వాటిని తొలగించేందుకు మంత్రి నారాయణ ఆదేశాల మేరకు నుడా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తుందని తెలిపారు. ఇప్పటికే అక్రమ లేఅవుట్ దారులకు నోటీసులు ఇచ్చామని చెప్పారు. నుడా పరిధిలో ఇప్పటికే 260 అక్రమ లేఅవుట్లను గుర్తించామని, ఇవికాక కొత్తగా 77 లేఅవుట్లను గుర్తించినట్లు తెలిపారు. వారంతా లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోకపోతే లేఅవుట్లలో రోడ్లు, హద్దురాళ్లని తొలగిస్తామన్నారు. ప్రజలు కూడా అవగాహనతో మెలగాలని కోరారు. ఈ సమావేశంలో టీపీవో హిమబిందు, కార్యదర్శి పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగర డీఎస్పీగా సింధుప్రియ



నెల్లూరు(క్రైం), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగర డీఎస్పీగా పెసర సింధుప్రియను నియమిస్తూ శుక్రవారం రాత్రి రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం నగర డీఎస్పీగా పనిచేస్తున్న డీ శ్రీనివాసరెడ్డిని పోలీసు కేంద్ర కారాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన 2022 నవంబరులో నగర డీఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. కాగా, పెసర సింధుప్రియ తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా వీరారెడ్డిపల్లిలో జన్మించారు. సీడీపీవోగా పనిచేస్తూ 2022లో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్ష రాసి డీఎస్పీగా ఎంపికయ్యారు. ప్రొబేషన్ పూర్తిచేసుకోవడంతో ప్రభుత్వం నెల్లూరు నగర డీఎస్పీగా తొలి పోస్టింగ్ ఇచ్చింది.

ఉమ్రా యాత్ర పేరుతో మోసం

నెల్లూరు(క్రైం) : ఉమ్రా యాత్ర పేరుతో చెన్నైకు చెందిన ఓ ట్రావెల్స్ సంస్థ ముస్లింల నుంచి రూ.లక్షలు తీసుకుని బోర్డు తిప్పేసిన ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల సమాచారం మేరకు... నెల్లూరులోని వెంగళరావు నగర్ ఎన్‌సీసీ కాలనీకి చెందిన సయ్యద్ ఖాదర్ షరీఫ్ తన భార్య బంధువు రిజ్వాన్ ద్వారా నగరానికి చెందిన జబ్బార్ మౌలానాను కలిశారు. ఉమ్రా యాత్రకు వెళ్లాలని తెలిపారు. ఆయన ద్వారా వెంగళరావు నగర్‌కు చెందిన అబ్దుల్ ముజీర్‌ను, అతని ద్వారా ట్రావెల్ నిర్వాహకుడు జాఫర్, అతని పీఏ సలాంతో మాట్లాడారు. యాత్రకు ఒక్కొక్కరికి రూ.55 వేలు ఖర్చు అవుతుందని, ఆలస్యం అయితే రూ.60 వేలు చెల్లించాల్సి వస్తుందని జాఫర్ నమ్మబలికాడు. దీంతో షరీఫ్, రిజ్వాన్ కుటుంబ సభ్యులు ముజీర్ ద్వారా రూ.3.40 లక్షలు ట్రావెల్ సంస్థకు పంపారు. వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను సైతం అందజేశారు. త్వరలో వీసాలు పంపుతామని ట్రావెల్ సంస్థ తెలిపింది. రోజులు గడుస్తున్నా వీసాలు రాకపోవడం, సంస్థ ఫోన్లు పనిచేయకపోవడంతో బాధితులకు అనుమానం వచ్చింది. ఈ నెల 6వ తేదీ చెన్నైకు వెళ్లి చూడగా సంస్థ మూసివేసి ఉంది. దీంతో మోసపోయామని గ్రహించి వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలతో చెన్నైలో నిందితుల కోసం గాలిస్తున్నారు.

సింహపురి భగీరథుడు ఎన్టీఆర్

'సోమశిల', 'తెలుగు గంగ'తో జలసిరి

జిల్లాతో ప్రత్యేక అనుబంధం

పార్టీ రూపకల్పనకు మంతనాలు ఇక్కడే!

నేడు వర్ధంతి

సోమశిల వద్ద జలాశయం నిర్మించాలనేది 1920 కాలం నుంచే ప్రజల ఆకాంక్ష. 1975లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు సోమశిల ప్రాజెక్టు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అయితే ఎలాంటి పురోగతి లేదు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక కృష్ణా నదికి పెన్నమ్మను అనుసంధానించి 78 టీఎంసీల సామర్థ్యంతో 1988లో 'సోమశిల'కు పురుడు పోశారు. నాటి ఎంపీ బెజవాడ గోపాలరెడ్డి కోరిక మేరకు ఉత్తర కాలువ నిర్మాణంతో కావలి, సంగం, అల్లూరు, దగదర్తి, బోగోలు, జలదంకి మండలాల్లో లక్షల ఎకరాలకు సాగునీటి సౌకర్యం కల్పించారు. తన మానస పుత్రికగా 'తెలుగు గంగ' ప్రాజెక్టును తీర్చిదిద్దారు. ఆసియా ఖండంలోనే అతిపెద్ద మట్టి కట్ట కలిగినదిగా కండలేరు రిజర్వాయర్‌ను నిర్మించారు. 68 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ ప్రాజెక్టు ద్వారా జిల్లాతోపాటు, కర్నూలు, కడప, చిత్తూరు జిల్లాలకు, తమిళనాడు రాష్ట్రానికి నీటిని తరలించారు.

- నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి)

● దశాబ్దాల అనుబంధం

రామారావుకు జిల్లాతో ఎంతో అనుబంధం ఉంది. 1951 మార్చి 15న విడుదలైన పాతాళభైరవి చిత్రం శతజయంతి వేడుకలకు తొలిసారి నెల్లూరు జిల్లాకు వచ్చారు. 1960లో కోట ప్రాంతంలో ఎన్టీఆర్‌కు ప్రజలు గండపెండేరం తొడిగి సత్కరించారు. నెల్లూరు కనకమహల్‌లో అడవి రాముడు చిత్రం శతజయంత్యుత్సవం, అక్కినేని నాగేశ్వర రావు ప్రేమాభిషేకం విజయోత్సవం జరిగిన పోలీసు పరేడు మైదానానికి తన సతీమణి బసవతారకంతో కలిసి హాజరయ్యారు. ఆ దంపతులకు నాడు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. బెజవాడ పాపిరెడ్డి తదితర ఉద్ధండులతో పొగతోటలోని పాపిరెడ్డి బంధువుల గృహంలోనే మంతనాలు సాగించి తెలుగుదేశం పార్టీకి రూపురేఖలు తీర్చిదిద్దారు. నటుడిగా, రాజకీయవేత్తగా ముఖ్యమంత్రి గా విశ్వవిఖ్యాతం చెందడానికి ఎన్టీఆర్‌కు బలం, బలగం అభిమానులే. 1960లోనే ఎన్టీఆర్ అభిమానులు సంఘంగా ఏర్పడ్డారు. 1962లో దానిని నందమూరి ఫ్యాన్స్‌గా రిజిస్టర్ చేశారు. వ్యవస్థాపక కార్యదర్శిగా కత్తుల వెంకటరత్నం (అయ్యప్పగుడి దేవస్థానం కార్యదర్శి వెంకటరత్నం విజయా ప్రెస్ అధినేత) నెల్లూరు కాపువీధి కుర్రాళ్లతో అభిమాన సంఘం ఏర్పాటు చేశారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యే వరకు ఎన్టీఆర్ అభిమానులుగా ఆయనతోపాటు బండారు వేణుగోపాల్‌రెడ్డి, నజీర్ బాషా, బాలకృష్ణారెడ్డి, భూపతి రాజు, పుల్లయ్య, సుధాకర్, దశయ్య, తదిత రులు ఎన్టీఆర్‌ని ఆరాధి స్తూ ఎన్నో కార్యక్రమాలు చేశారు. అనంతరం తాళ్లపాక రమేష్‌రెడ్డి అఖిల భారత ఎన్టీఆర్ అభిమాన సంఘం ఏర్పాటు చేశారు.

పదవులు ఆశించలేదు..


అభిమానం పొందాం నందమూరి తారక రామారావు చలనచిత్ర రారాజుగా, ప్రజా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అభిమానిగా ఏనాడూ పదవులు ఆశించలేదు. ఆయన జీవించి ఉన్నంత వరకు ఆయన అభిమానాన్ని చూరగొన్నాం. అదే మాకు సంతృప్తి నిచ్చింది.

- కత్తుల వెంకటరత్నం, నందమూరి ఫాన్స్ (1962) వ్యవస్థాపక కార్యదర్శి

ఎన్టీఆర్ స్ఫూర్తితోనే కళాకారుడిగా..

నాకు ఊహ తెలిసిన నాటి నుంచి ఎన్టీఆర్ అంటే అభిమానం. ఆయన స్ఫూర్తితోనే కళాకారుడిగా ఈ వృత్తిని ఎంచుకున్నాను. ఆవిర్భావం నుంచి తెలుగుదేశం పార్టీలోనే ఉన్నాను. 1982లో పార్టీ ఆవిర్భావ సందర్భంగా నవాబుపేట నుంచి జరిగిన చైతన్య రథం ర్యాలీలో ఎన్టీఆర్‌ను ప్రత్యక్షంగా చూశాను. ఆ తర్వాత ప్రేమాభిషేకం శత జయంతి వేడుక, ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా విజయవాడలో నిర్వహించిన మహానాడులో, 1989లో ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు చూశాను.

- దోర్నాల హరిబాబు, టీడీపీ జిల్లా సాంస్కృతిక విభాగం మాజీ అధ్యక్షుడు



నేటి కార్యక్రమాలు

ఎన్టీ రామారావు 29వ వర్ధంతి శనివారం ఉదయం 9.30 గంటలకు తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో జరుగుతుందని, పార్టీ శ్రేణులు అందరూ హాజరు కావాలని జిల్లా కార్యాలయం ఓ ప్రకటనలో కోరింది. కాగా, నగరంలోని నర్తకీ సెంటర్‌లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఉదయం 10.30గంటలకు వర్ధంతి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాజీ మంత్రి తాళ్లపాక రమేష్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనురాధ దంపతులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని విజ్ఞప్తి చేశారు.

పెదపవనిలో ఉద్రిక్తత

● వివాదాస్పద స్థలంలో ఇరువర్గాల ఘర్షణ

● అదుపుదాటిన పరిస్థితి.. లాఠీలకు పనిచెప్పిన పోలీసులు


పెదపవని పీర్లచావిడి స్థలంలో గుమికూడిన జనం

లింగసముద్రం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పెదపవనిలోని వివాదాస్పద స్థలంపై శుక్రవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గ్రామంలోని పీర్లచావిడి స్థలం విషయమై గత ఏడాది నుంచి జడ్పీటీసీ సీహెచ్ నళినీ పద్మ, షేక్ రఫీ వర్గీయుల మధ్య పలుమార్లు ఘర్షణ జరిగింది. అందులో భాగంగా శుక్రవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో షేక్ రఫీ ఆధ్వర్యంలో భారీగా చేరుకున్న జనం స్థలంలో ఇనుప కంచె వేసేందుకు ప్రయత్నించారు. అయితే ఈ స్థలం తాము కొనుగోలు చేశామంటూ జడ్పీటీసీ నళినీ పద్మ తమ వర్గీయులు వచ్చి అడ్డుకున్నారు. ఈ సమయంలో ఇరువర్గాల మధ్య మాటలు పెరిగి ఒకరినొకరు నెట్టుకున్నారు. సిబ్బందితో సహా అక్కడకు చేరుకున్న ఎస్‌ఐ మహబూబ్ సుబానీ వారిని విడదీసేందుకు ప్రయత్నించినా వినకపోవడంతో లాఠీలతో పని చెప్పించారు. ఈ విషయాన్ని ఎస్‌ఐ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. గుడ్లూరు సీఐ మంగారావు, వలేటివారి పాలెం, గుడ్లూరు ఎస్‌ఐలు, తహసీల్దార్ ఎస్.సీతా మహాలక్ష్మి వచ్చి సర్ది చెప్పేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈ స్థలాన్ని తాను 2020లో ముస్లిం పెద్దల నుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నానని, ప్రస్తుతం ఈ సమస్య కోర్టు పరిధిలో ఉందని నళినీ పద్మ అధికారులకు తెలిపారు. ఈ స్థలాన్ని అక్రమంగా కొనుగోలు చేశారని, అవన్నీ నకిలీ పత్రాలు అని అసలు పత్రాలను బయటకు తీసుకొని రావాలని రఫీతోపాటు మిగిలిన వారు డిమాండ్ చేశారు. ఈ స్థలంలో నుండి వారు బయటకు వెళ్లక పోవడంతో నళినీపద్మ తన అనుచరులతో రోడ్డుపై బైఠాయించి నిరసనకు దిగారు.

సంగం టౌన్‌లో దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రహదారి మరమ్మతు పనులు శుక్రవారం చేపట్టారు. సంగం ముంబయి జాతీయ రహదారి కూడలి నుంచి సంగం బస్టాండ్‌కు వెళ్లే రహదారిలో గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతలతో ప్రజలు, వాహన చోదకులు గత కొంతకాలం నుంచి ఇబ్బందులు పడుతున్నారు. ఎట్టకేలకు ఆర్ అండ్ బీ అధికారులు ఎస్సీ బాలికల హాస్టల్, వెంకటేశ్వర, టీడీఆర్ కల్యాణ మండపాలకు ఎదురుగా ఉన్న గుంతల పూడ్చివేత పనులు చేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- సంగం, (ఆంధ్రజ్యోతి)

రహదారిపై గుంతలు పూడ్చివేత



కుంకుడు ఆకుపై 'ఫ్లెమింగో'

తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో శనివారం నుంచి మూడు రోజుల పాటు జరగనున్న పక్షుల పండుగ నేపథ్యంలో పొదలకూరు మండలంలోని మహ్మదాపురానికి చెందిన విశ్రాంత డ్రాయింగ్ ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య కుంకుడు ఆకుపై ఫ్లెమింగో పక్షి సూక్ష్మ చిత్రాన్ని రూపొందించారు. నాలుగేళ్ల తర్వాత కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో ఫ్లెమింగో ఫెస్టివల్ జరుగుతుండడంతో పలువురిని ఆకట్టుకునేలా చిత్రీకరించిన ఈ చిత్రం ద్వారా ఆయన ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

- పొదలకూరు(ఆంధ్రజ్యోతి)



కూలితే అంతే..

మండలంలోని గండిపాళెంలో ఏళ్ల తరబడి నిర్మించిన రెవెన్యూ భవనం శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న ఆ భవనం సమీపంలోని చేతిపంపు వద్దకు చేరుకున్న ప్రజలు, మహిళలు ఏ క్షణంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని బెంబేలెత్తిపోతున్నారు. అంతేగాక మసీదు, రామాలయంతో పాటు కాలనీకి సైతం అటుగానే వెళ్లాల్సి ఉండడంతో బిక్కుబిక్కుమంటూ ముందుకు సాగాల్సిన దుస్థితి నెలకొంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ఉదయగిరి రూరల్, (ఆంధ్రజ్యోతి)



న్యూస్ బాక్స్

పెట్రోలులో రాయితీ కోసం దివ్యాంగులు దరఖాస్తు చేసుకోవాలి

నెల్లూరు (హరనాథపురం), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో మూడు చక్రాల వాహనాలు కలిగిన దివ్యాంగులు రాయితీపై పెట్రోలు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకుడు ఏ మహమ్మద్ అయూబ్ ఓ ప్రకటనలో కోరారు. సదరం వైద్య ధ్రువీకరణ పత్రం, పెట్రోలు బిల్లులు, రేషన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, వాహనం రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం, బ్యాంకు పాస్‌బుక్ మొదటిపేజీ, పాస్‌పోర్టు సైజ్ ఫొటో (వైకల్యం కనిపించే విధంగా) స్వయం ఉపాధి వ్యాపారం లేదా ప్రైవేటు సంస్థలో పనిచేస్తున్నట్లు ధ్రువపత్రాల నకళ్లు తదితరాలతో తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 0861-2329581 నెంబరును సంప్రదించాలని కోరారు.

సోమశిలలో 69.890 టీఎంసీల నీరు

అనంతసాగరం జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగువ నుంచి శుక్రవారం 1,927 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టు సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా ప్రస్తుతం 69.890 టీఎంసీల నిల్వ ఉంది. దిగువ కండలేరుకు 200, డెల్టాకు 2,550, ఉత్తర కాలువకు 600, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ముగిసిన సంగమేశ్వరుడి గిరి ప్రదక్షిణ

సంగం, (ఆంధ్రజ్యోతి): సంగమేశ్వరుడి గిరి ప్రదక్షిణ ఉత్సవం శుక్రవారం ముగిసింది. కనుమ పండుగ సందర్భంగా బుధవారం బయలుదేరిన సంగమేశ్వరుని గ్రామోత్సవం సంగం కొండ చుట్టూ ఉన్న కొరిమెర్ల, తలుపూరుపాడులో తిరిగి గురువారం తరుణవాయిలో విడిది చేశారు. అక్కడ గ్రామోత్సవం అనంతరం శుక్రవారం ఉదయం ఉత్సవాన్ని సంగం గ్రామస్థులకు అప్పగించారు. స్వామివారిని పురవీధుల్లో ఊరేగించి ఆలయానికి చేర్చారు. దీంతో గిరి ప్రదక్షిణ గ్రామోత్సవం పూర్తయింది.

వివాహిత ఆత్మహత్య

నెల్లూరు(క్రైం), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని మధ్వపతి వారి వీధిలో గురువారం రాత్రి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల సమాచారం మేరకు.. మధ్వపతి వారి వీధిలో చెంచయ్య, రాజేశ్వరి(40) దంపతులు నివసిస్తున్నారు. చెంచెయ్య ఆచారవీధిలోని ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తుండగా రాజేశ్వరి ఇంటి వద్దనే ఉంటుంది. వారికి ఇద్దరు పిల్లలు. కుమార్తె శ్రావణికి వివాహం కాగా కుమారుడు సురేష్ కాపు వీధిలోని ఓ బంగారు దుకాణంలో పనిచేస్తున్నాడు. ఈ నెల 13వ తేదీ డబ్బు విషయంలో చెంచయ్య, రాజేశ్వరి గొడవపడ్డారు. 14వ తేదీ రాజేశ్వరి వెంకటగిరిలోని పుట్టింటికి వెళ్లి గురువారం తిరిగి వచ్చింది. రాత్రి మళ్లీ గొడవ జరగడంతో సురేష్ బయటకు వెళ్లిపోయాడు. తిరిగి వచ్చేసరికి తండ్రి చెంచయ్య నిద్రిస్తుండగా తల్లి ఫ్యానుకు చీరతో ఉరివేసు కొని వేలాడుతూ కనిపించింది. తండ్రీ కొడుకులు కలిసి హుటాహుటిన రామచంద్రారెడ్డి వైద్యశాలకు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సురేష్ శుక్రవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు మృతదేహాన్ని పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేతన బకాయిల కోసం
లస్కర్ల ఎదురుచూపులు

- వైసీపీ ప్రభుత్వం మొండిచేయి

ఉదయగిరి రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విధులు నిర్వర్తించిన లస్కర్లు తమకు అందాల్సిన వేతనాల కోసం ఏళ్ల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. ఉదయగిరి, వరికుంటపాడు మండలాలకు వరప్రసాదినిగా చెప్పుకొనే గండిపాళెం జలాశయ పరిధిలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన 10మంది విధుల్లో చేరారు. ఇళ్లు, వాకిలి వదిలి రేయింబవళ్లు అడవులను తలపిస్తున్న చెరువులు, కాలువల వెంట తిరుగుతూ రైతులకు సకాలంలో సాగునీరు అందించడంలో కీలకంగా వ్యవహరించారు. నిబంధనల మేరకు ఒక్కో లస్కర్‌కు నెలకు రూ. 10,500 చొప్పున నెలవారీ వేతనం అందించాల్సి ఉంది. అదీనూ వ్యవసాయ సీజన్‌ను ఆధారంగా చేసుకొని ఏడాదికి కేవలం ఐదు నెలల కాలానికి మాత్రమే వేతనాలు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకొని బాధ్యతలు అప్పగించింది. తొలుత ఏడాది పాటు అంటే ఐదు నెలల సీజన్‌కు వేతనాలు చెల్లించినప్పటికీ ఆపై పైసా నిధులు కూడా విడుదల చేయకుండా మొండిచేయి చూపిందని, వరుసగా మూడేళ్ల పాటు వేతన బకాయిలు పేరుకుపోయాయని, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని లస్కర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గండిపాళెం జలాశయం

గాలిలో దీపంలా జీవనం

ప్రసుత్తం లస్కర్ల పరిస్థితి గాలిలో దీపంలా మారింది. బకాయిల సంగతి ఏమోగానీ విధుల్లో ఉన్నారో, లేరో తెలియని పరిస్థితుల్లో వారి జీవనం ప్రశ్నార్థకంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో తమకు అనుకూలమైన వారికి అవకాశం కల్పిస్తారో, లేక గతంలో ఉన్న వారినే యథావిధిగా కొనసాగిస్తారో అన్న ఉత్కంఠ వెంటాడుతోంది. ప్రస్తుత ప్రభుత్వం వేతన బకాయిలను విడుదల చేయడంతో పాటు తమ జీవితాలకు భరోసా కల్పించి ఆదుకోవాలని లస్కర్లు వేడుకుంటున్నారు.

యూత్ పార్లమెంట్ ప్రాంతీయ విజేత 'కేవీ'



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

నెల్లూరు(విద్య), జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ రీజియన్ స్థాయిలో జరిగిన యూత్ పార్లమెంట్ పోటీల్లో నెల్లూరులోని కొత్తూరులో ఉన్న పీఎంశ్రీ కేంద్రీయ విద్యాలయం(కేవీ) విద్యార్థులు ప్రథమ స్థానాన్ని సాధించారని రీజియన్ డిప్యూటీ కమిషనర్ డీ మంజునాథ్ తెలిపారు. నెల్లూరులో శుక్రవారం జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎనిమిది మంది విద్యార్థులు న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవనాన్ని సందర్శించడానికి కేంద్ర పార్లమెంటరీ మంత్రిత్వ శాఖ ఆహ్వానం అందుకున్నారని చెప్పారు. ప్రిన్సిపాల్ కే శంకరయ్య, ఉపాధ్యాయులు జోషిబాబు, సంధ్య శర్మతో ఎనిమిది మంది విద్యార్థులు పార్లమెంట్ భవనాన్ని సందర్శించడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దొరసానమ్మ, అలివేలు మంగాబాయి తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమకు జరిగే అన్యాయాలపై తిరుపతిలో 'పొలికేక'

- ఫిబ్రవరి 27న నిర్వహణ
- రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న కుంచం వెంకటసుబ్బారెడ్డి

నెల్లూరు (హరనాథపురం) జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తరతరాలుగా రాయలసీమకు జరిగే అన్యాయాలపై ఫిబ్రవరి 27వ తేదీన తిరుపతిలో 'రాయలసీమ పొలికేక' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి తెలి పారు. శుక్రవారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏ పార్టీ అయినా ఓట్ల కోసం రాయలసీమకు వస్తుందని, ఓట్లు వేయించుకున్నాక అభివృద్ధిని మాత్రం విశాఖలోనో, అమరావతిలోనో చేపడుతుందని మండిపడ్డారు. రాయలసీమలో స్టీల్ ప్లాంట్ లేదు.. నీరు లేదు.. నిధులు లేవు.. ఎలాంటి అభివృద్ధి లేదని చెప్పారు. 1951లో కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు, ప్రకాశం, కృష్ణగిరి, రాయవేలూరు, బళ్లారి, రాయచూర్, చిత్రదుర్గ, కోలార్ తదితర జిల్లాలతో రాయలసీమ ఉండేదని చెప్పారు. కర్నూలులో రాజధాని ఉండేదని గుర్తు చేశారు. నాటి రాయలేలిన రాయలసీమ రతనాలసీమ అయితే నేటి రాయలసీమ రాళ్లసీమగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. 1951లో ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పటి రాయలసీమ జిల్లాలను ప్రత్యేక రాయలసీమ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందించినట్లు చెప్పారు. సీమ సంస్కృతి సంప్రదాయాలైన ఉత్సవాలను, జాతరలతోపాటు సీమ స్వాతంత్ర్యోద్యమ నాయకుల వర్ధంతి, జయంతులను ప్రభుత్వమే నిర్వహించాలన్నారు. సీమ దళిత బంధు, రైతుబంధు పేరుతో ఒక్కో కుటుంబానికి రూ.10లక్షలు కేటాయించాలన్నారు. టీటీడీలో రాయలసీమ యువతకు ఎక్కువ భాగం ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. రాయలసీమలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుతో పాటు ప్రతి జిల్లాకు ఒక సాఫ్ట్ వేర్ కారిడార్ ఏర్పాటు చేయాలన్నారు. గుంతకల్లును రైల్వేజోన్‌గా ప్రకటించాలని, రాయలసీమకు రూ.10 లక్షల కోట్ల ప్యాకేజీ ఇవ్వాలన్నారు. ఇలా అనేక డిమాండ్ల సాధన కోసం రాయలసీమ వాసులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తిరుపతిలో జరిగే పొలికేక ద్వారా రాయలసీమ వాణిని ఢిల్లీకి వినిపిస్తామని స్పష్టం చేశారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

దుత్తలూరు (ఉదయగిరి), జనవరి 17(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారని భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీ రామచంద్రయాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం దుత్తలూరు-నర్రవాడ గ్రామాల మధ్యలో 565 జాతీయ రహదారి పక్కనే ఉన్న యాదవ చైతన్య వేదిక ప్రాంగణంలో చేపట్టిన శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యద్దనపూడి వెంకటరత్నం రచించిన యదువంశ రాజవంశస్తుడు శ్రీకృష్ణదేవరాయల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో ఉదయగిరి జడ్పీటీసీ మోడి రామాంజనేయులు, యాదవ సంఘ నాయకులు, పారిశ్రామికవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

CRIME NEWS



కారును ఢీకొన్న లారీ

త్రుటిలో తప్పింది..!

- కారును ఢీకొన్న లారీ

మనుబోలు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కోల్‌కత్తా- చెన్నై జాతీయ రహదారిపై శుక్రవారం కారును లారీ ఢీకొంది. ఈ ఘటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. వివరాల మేరకు.. నెల్లూరు నుంచి ఓ కుటుంబం బెంగళూరుకు కారులో బయలుదేరారు. మనుబోలు వద్ద యాచవరం క్రాస్‌రోడ్డు సమీపంలో ముందు వెళుతున్న కారును అధిగమించే ప్రయత్నంలో లారీ ఢీకొట్టింది. దీంతో కారు స్టీరింగ్ రాడ్డు విరిగి అదుపుతప్పి వెనుదిరిగి లారీ అంచున చిక్కుకుంది. అయితే అదృష్టవశాత్తు కారులో ఉన్న ఇద్దరు పిల్లలు, ఇద్దరు పెద్దలకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనతో లారీ డ్రైవర్ పరారీకావడంతో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు అక్కడి చేరుకుని ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

కావలిలో గోవా మద్యం!

- ఎక్సైజ్‌శాఖలో కలవరం
- ఎలా వచ్చాయన్నదానిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల విచారణ

కావలి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముద్ర తీరంలో ఉన్న పెద్దపట్టపుపాలెంలో సుంకం చెల్లించని 180 ఎంఎల్ పరిమాణం కలిగిన 60 హనీ కీ ప్రీమియం బాందీ బాటిళ్ల పట్టివేతపై ఎక్సైజ్‌శాఖలో కలవరం మొదలైంది. ఈ విషయం తెలిసిన వెంటనే జిల్లా ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటిండెంట్లు ఆర్.జగదీశ్వరరెడ్డి, జే.రమేష్‌లు సిబ్బందితో శుక్రవారం ఉదయానికి కావలి ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకున్నారు. సీఐ సుంకర శ్రీనివాసులు, ఎస్ఐ దేవికతో గోవా మద్యం ఎలా వచ్చాయనే దానిపై వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పెదపట్టపుపాలెం మత్స్యకారుడు ప్రళయకావేరి ప్రసాద్ వద్ద గోవా మద్యం దొరకటంతో ఆయన్ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. నెల్లూరు బుజ్జి అలియాస్ భూపతిరాజు కారులో పెదపట్టపుపాలెం తీసుకవచ్చి తమకు ఇచ్చాడని నిందితుడు ప్రసాద్ అధికారులకు చెబుతున్నాడు. అయితే ఎవరా బుజ్జి ఆయనకు ఈ మద్యం ఎలా వచ్చింది దాని వెనుక ఎవరున్నారు. గోవా మద్యం కావలికే పరిమితమా ఇంకా జిల్లాలో ఎక్కడెక్కడ వెళుతుందనే కోణంలో దర్యాప్తు చేపడుతున్నారు. అసలు నిందితుడు చెప్పేది నిజమేనా లేక సముద్రమార్గంలో ఏమైనా మద్యం వచ్చాయా అనే అనుమానాలు కూడా వ్యక్తం మవుతున్నాయి. సముద్రతీరంలో ఉన్న పెద్దపట్టపుపాలెంలో అవి లభ్యం కావటంతో సముద్రమార్గంపై కూడా అనుమానించాల్సి వస్తోంది. గతంలో 10ఏళ్ల కిందట సార్వత్రిక ఎన్నికల సమయంలో అప్పటి వైసీపీ అభ్యర్థి రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి తరుపున సుంకం చెల్లించని గోవా మద్యంను వైసీపీ నాయకులు కావలికి తెచ్చి ఎన్నికలలో పంచటంతో కావలిలో ఏరులై పారింది. అప్పట్లో వారిపై కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే తిరిగి 10ఏళ్ల తర్వాత గోవా మద్యం కావలికి రావటంతో ప్రొహిబిషన్‌అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఈ విషయాన్ని ఆ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై లోతుగా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల విచారణ జరిపి దాని మూలాలను పట్టుకుని సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుని ఇకపై గోవా మద్యం రాకుండా చేస్తారా లేక దొరికిన వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టుకు పెట్టి చేతులు దుడుపుకుంటారో చూడాల్సి ఉంది.



కావలి ఎక్సైజ్ కార్యాలయంలో గోవా మద్యంపై ఆరా తీస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

60 గోవా మద్యం సీసాలు స్వాధీనం

కావలి రూరల్: పెదపట్టపుపాలెంలో అక్రమంగా మద్యం కలిగి ఉన్నారనే సమాచారంతో గురువారం రాత్రి ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ప్రళయ కావేరి ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న గోవా రాష్ట్రంకు చెందిన 60 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. దాడుల్లో సీఐతో పాటు ఎస్ఐ దేవిక, సిబ్బంది పాల్గొన్నారు.

నవోదయ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి

ఉదయగిరి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగే జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎంఈవో-2 తోట శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. ఉన్నత పాఠశాలలోని పరీక్షా కేంద్రానికి 284 మంది విద్యార్థులు హాజరు కానున్నారన్నారు. 11 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. పరీక్షల చీఫ్ సూపరిడెంటెండ్‌గా బాలకేశవులు, డిపార్టుమెంట్ అధికారిగా యమునా లక్ష్మీలు వ్యవహరిస్తారన్నారు. ఈ పరీక్ష ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందన్నారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రతిఒక్కరు సహకరించాలన్నారు.

ఉపాధి హామీ పథకంలో
వెలుగుచూసిన అవినీతి

- ఏడుగురు సిబ్బంది సస్పెన్షన్
- రూ.13 లక్షల రికవరీకి ఆదేశం
- ఉన్నతాధికారులకు నివేదిక

వింజమూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన ఉపాధిహామీ ప్రజావేదిక కార్యక్రమంలో మండలంలో చేపట్టిన ఉపాధి పనులలో అవినీతి వెలుగుచూసింది. దీనికి సంబంధించి గుండెమడకల మండలం ఏకిస్తీపురం, నంది గుంట, వింజమూరు పంచాయతీలకు సంబంధించి ఏడుగురు ఉపాధిహామీ సిబ్బంది సస్పెన్షన్‌కు గురయ్యారని, వీరిలో నలుగురు క్షేత్ర సహాయకులు, ఇద్దరు టెక్నికల్ సహాయకులు, ఒక ఇంజనీరింగ్ కన్సల్టెంట్ ఉన్నారని, వీరి నుంచి రూ.13లక్షలను రికవరీ చేయాలని ఆదేశించినట్లు పీడీ గంగాభవానీ తెలిపారు. సోషల్ ఆడిట్ బృందం తమ తనిఖీల్లో ముఖ్యంగా మస్టర్‌లో తేడాలు, సంతకాలు లేకుండానే చెల్లింపులు చేయడం, చనిపోయిన వారి పేర్లు మీద మస్టర్‌లు రాయడం, కిందిస్థాయి ప్రభుత్వ ఉద్యోగులు కూడా జాబ్‌కార్డులు పొందినట్లు గుర్తించి నివేదిక అందజేసినట్లు ఆమె తెలిపారు. అంతేకాకుండా శంకవరం పంచాయతీ వెంకటాద్రిపాలెం గ్రామంలో గత సంవత్సరం జరిగిన ప్రభుత్వ భవన నిర్మాణాలలో అవకతవకలను గుర్తించి క్షేత్రస్థాయి విచారణ జరపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో కె శ్రీనివాసరెడ్డి, ఉదయగిరి ఏపీడీఆర్ గాయత్రిదేవి, ఏపీవో ఎండీ సుభాన్, క్లస్టర్ టెక్నికల్ అసిస్టెంట్ పి చెన్నయ్య, తనిఖీ బృందం సభ్యులు అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, చల్ల వెంకటేశ్వర్లుయాదవ్, శ్రీను, శివ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన చెన్నయ్య

ఉదయగిరి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుర్రపల్లి, మాసాయిపేట గ్రామాల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. సీతారామపురం మండలం బసినేనిపల్లి గ్రామానికి చెందిన అరపాటి చెన్నయ్య పని నిమిత్తం ఉదయగిరికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళుతు న్నాడు. ఈ తరుణంలో కుర్రపల్లి గ్రామం వద్దకు రాగానే మోటార్‌బైక్ అదుపు తప్పి బోల్తాపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. అలాగే మాసాయిపేట గ్రామం నుంచి తెలిసినవారితో మోటార్ బైక్‌పై జీ వెంకటయ్య ఉదయగిరికి వస్తున్నాడు. గ్రామ సమీపానికి రాగానే గండిపాళెం నుంచి ఉదయగిరికి వస్తున్న ఓ మోటార్‌బైక్ ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అనం తరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరు తర లించారు.

ఇరువర్గాల పరస్పర దాడులు

కావలి రూరల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కోళ్లదిన్నెలోని ఆలయ స్థల వివాదంలో ఘర్షణలో శ్రీనివాసులు రెడ్డి, ఒంటేరు తిరుపతి వర్గీయులు శుక్రవారం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో గాయపడిన వారు చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు వచ్చారు. అక్కడ వీరి మధ్య మాటలు పెరడంతో రెండోసారి వాదులాడుకుంటూ కాళ్లు చేతులతో కొట్టుకున్నారు. విషయం తెలుసుకున్న వైద్య సిబ్బంది 1వ పట్టణ పోలీసులకు సమాచారమిచ్చారు. వారు అక్కడకు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి మందలించి పంపించారు. దీనిపై ఎవరి నుండి ఎలాంటి ఫిర్యాదు అందలేదని సీఐ ఫిరోజ్ తెలిపారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	129
లేయర్ లైవ్	88
స్కిన్ చికెన్	232
స్కిన్‌లెస్	256
లేయర్	150

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7640
వెండి కిలో ధర	రూ. 93,700
వెండి ఒక గ్రాము	రూ.96.70

వ్యవసాయ పనులకు కూలీల కొరత

- రైతులకు తప్పని ఇబ్బందులు
- సుదూర ప్రాంతాల కూలీల తరలింపు
- వ్యవసాయానికి 'ఉపాధి' పనులు అనుసంధానం చేయాలంటున్న రైతులు

కొండాపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి):వర్షాలు ఒక్కసారిగా పడటం.. అన్నిరకాల వ్యవసాయ పనులు ఒకేసారి రావడంతో కూలీలకు డిమాండు ఏర్పడింది. సకాలంలో జరగాల్సిన పనులు కూలీల కొరతతో జరగడం లేదు. ఎక్కువ నగదు చెల్లించినా కూలీలు దొరక్క రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదీ మండలంలోని రైతుల పరిస్థితి.

● 5వేల ఎకరాలలో వరి సాగు..

మండలంలోని 19పంచాయతీల పరిధిలో చెరువులు, బోర్ల కింద 5వేల ఎకరాలలో వరిసాగు చేస్తున్నారు. నార్లు పూర్తి చేసుకొన్న పంట పొలాల్లో కంకి దశకు చేరుకున్నాయి. ఎక్కువభాగం భూముల్లో వరినాట్లు పూర్తయి కలుపు దశకు చేరుకున్నాయి. కలుపులు తీసేం దుకు ఎకరానికి 5నుండి 8మంది వరకు అవస రం ఉన్నా తీయడానికి కూలీలు దొరకడం లేదు.

● రోజు కూలీ రూ.500 నుంచి 700 వరకు..

కూలీలు అడిగిన మొత్తాన్ని భరించేందుకు రైతు సిద్ధంగా ఉన్నా కూలీలు రెండురోజులు తర్వాత వస్తామని చెబుతున్నారు. చేసేదేమిలేక రైతు వారి చుట్టూ తిరుగుతున్నారు. రోజుకు రూ.500 నుండి రూ.7వందలు వరకు కూలీలు డిమాండు చేస్తున్నారు. అలాగే పొగాకు సాగుచేసిన రైతులు సదరు భూమిలో గడ్డిని తొలగించేందుకు కూలీలు తప్పనిసరి అవసరం అయ్యింది.

ఎక్కువ కూలి చెల్లించి తరలింపు..

వరి, పొగాకుతో పాటు శనగ, మిరప సాగు చేసిన రైతులు తమ భూముల్లో గడ్డిని తొలగించేందుకు కూలీలు అవసరం అయ్యింది. అన్ని వ్యవసాయ పనులు ఒకే సమయంలో రావడంతో కూలీలకు డిమాండు పెరిగింది. ఎలాగైనా తమ పనులను పూర్తి చేసుకోవాలని రైతులు ఇతర గ్రామాలకు వెళ్లి అధిక కూలీ చెల్లించి ఆటోలలో తరలిస్తున్నారు. దీంతో పెట్టుబడులు విపరీతంగా పెరిగిపోతున్నాయిని వాపోతున్నారు. ప్రభుత్వాలు అన్ని పంటలకు మద్దతు ధరను పెంచాలని కోరుతున్నారు.



పొగనాట్లు వేస్తున్న కూలీలు

ఉపాధి పనులను అనుసంధానం చేయాలి



కూలీలకు ఉన్న డిమాండుతో వ్యవసాయం చేయాలంటే రైతులు ముందుకు రావడం లేదు. ఉపాధి హామీ కింద ప్రభుత్వం వ్యవసాయ పనులను అనుసంధానం చేయాలి. కానీ అలాంటి చర్యలు తీసుకోవడం లేదు.

-మచ్చా ప్రసాదు, సాయిపేట

కూలీల కొరత ఉంది



5 ఎకరాల వరకు వరి సాగు చేశా. వరి విత్తనాలు చల్లిన భూమిలో వరి నాట్లు వేసేందుకు కూలీల చుట్టూ తిరగాల్సి వస్తుంది. రోజుకు రూ.500 చెల్లించినా పనులకు రావడం లేదు. కూలీల కొరతతో తీవ్ర ఆందోళన చెందుతున్నాం.

- మామిళ్లపల్లి శ్రీనివాసులు, మవరప్పాడు

చెరువు కట్టల పటిష్టతకు ప్రత్యేక చర్యలు

శ్రీనాథ్‌రెడ్డి, ఇరిగేషన్ ఏఈఈ, కలిగిరి



ఇంటర్వ్యూ...

కలిగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): చెరువు కట్టల పటిష్టతకు ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మండల ఇరిగేషన్ ఏఈ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. చిన్నపాటి మరమ్మతులు తలెత్తిన వెంటనే స్థానిక రైతుల సహాయంతో సరిచేస్తామన్నారు.

? ఎన్ని చెరువులున్నాయి.

! 48చెరువులున్నాయి. ఈ ఏడాది కురిసిన వర్షాలకు 12 చెరువుల కింద పొలాలకు సాగునీటి సమస్య ఉండదు.

? మరమ్మతులకు గురైన చెరువుల వద్ద చేపట్టిన చర్యలు.

! చిన అన్నలూరు, క్రాకుటూరు, గుడ్లదొన చెరువు తూముల వద్ద లీకుల నివారణకు ఇసుక బస్తాలు వేసి లీకేజీలు నివారించాం.

? గ్రామకొలను పనుల్లో పురోగతి.

! గత ప్రభుత్వంతో 30శాతం మేర పనులు మాత్రమే జరిగాయి. కూటమి ప్రభుత్వంలో మిగిలిన పనులు జరుగుతున్నాయి.

? ప్రపంచ బ్యాంకు నిధులతో చేస్తున్న పనులు ఏ దశల్లో ఉన్నాయి.

! పెదఅన్నలూరు పాతచెరువు, కుడుమలదిన్నెపాడు, తెల్లపాడు చెరువుల అభివృద్ధి పనులు ప్రపంచబ్యాంకు నిధులతో చేపట్టారు. 50శాతం మేర మాత్రమే పనులు జరిగాయి. బిల్లులు రాకపోవడంతో ప్రస్తుతం ఆ పనులు ఆగిపోయి ఉన్నాయి.

అభివృద్ధి పనులతో మారుతున్న గ్రామాల రూపురేఖలు

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



సీసీరోడ్డు శిలాఫలకంను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల

కలిగిరి, జనవరి17(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పనులతో గ్రామాల రూపురేఖలే మారిపోతున్నాయని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన రావులకొల్లులో పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. రోడ్డుకిరువైపులా మొక్కలు నాటి, సీసీరోడ్లు, గోకులం షెడ్డు ప్రారంభోత్సవం చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధిని పూర్తిగా విస్మ రించిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పంచాయతీలకు ప్రత్యేక నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు పరిగెడుతున్నాయని చెప్పారు. ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టుకూరు చిరంజీవిరెడ్డి, ఎంపీపీ మెట్టుకూరు శిరీష, సర్పంచ్ వెంగపనాయుడు, కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

దళిత రైతుల ఆందోళన



ధర్నాలో పాల్గొన్న దళితులు, ఎల్లు సాల్మన్‌రాజు

దగదర్తి (బిట్రగుంట) జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనంతవరం గ్రామానికి చెందిన దళితులు గాలి ప్రభుదాసు, వీర దాసు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వీరికి మద్దతుగా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్లు సాల్మన్‌రాజ్ సంఘం సభ్యులతో కలిసి నిరసనలో పాల్గొని మాట్లాడారు. దళితులు వారి సొంత పొలంలో వేసుకున్న వరినాటుపై గడ్డి మందు కొట్టడంతో పైరు ఎండిపోయిందని వాపోయారు. అదే గ్రామానికి చెందిన కొందరు పెద్దలు వారి భూములపై కన్నేసి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. విషయం తెలుసుకున్న కావలి రూరల్ సీఐ పాపారావు అక్కడికి చేరుకుని న్యాయం జరిగేలా చూస్తానని సర్ది చెప్పడంతో వారు ధర్నా విర మించారు. సతీష్, సుధాకర్, నరేంద్ర, దానం మాల్యాద్రి పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లపై కొరడా

- హద్దురాళ్లు, రోడ్లు, కాలువల తొలగింపు
- ప్లాట్ల కొనుగోలుదారుల ఆందోళన



ఎక్స్‌కవేటర్‌తో కాలువలు తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

కావలి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో అక్రమ లేఅవుట్లపై మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. శుక్రవారం మద్దూరుపాడు 204, 208 నుంచి 211వరకు ఉన్న సర్వే నంబర్లలో 19.91 ఎకరాల్లో పెనుశిల గ్రీన్‌సిటీ పేరుతో అక్రమ లేఅవుట్ వేసినట్లు మున్సిపల్ అధికారులు గుర్తించి వాటి సరిహద్దు రాళ్ల, కాలువలు, రోడ్లను తొలగించారు. అలాగే ముసునూరు టీచర్స్ కాలనీలోని దిగువన పాపిరెడ్డి చెరువు పక్కన ఉన్న 1919 సర్వే నంబరులో 2.5ఎకరాల అక్రమ లేఅవుట్‌లోని సరిహద్దు రాళ్ల, రోడ్లు తొలగించారు. వీటికి ఎలాంటి అనుమతులు లేవని ఈ విషయాన్ని ప్రజలు ఈ విషయం గమనించాలని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. రాళ్ల, రోడ్లు తొలగిస్తుండటంతో ప్లాట్లు కొనుగోలు చేసిన వారు ఆందోళన చెందారు. పట్టణంలో ఉన్న అన్ని అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకుంటారా లేక ఈ రెండు లేఅవుట్లతో సరిపెట్టుకుంటారా అని రియల్‌ఎస్టేట్ రంగంలో చర్చనీయాంశమైంది.

ఓటమితోనే గెలుపును నేర్చుకుంటాం: ఎమ్మెల్యే దగుమాటి



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే దగుమాటి

కావలి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలలో గెలుపోట ములు సహజమని, గెలిస్తే గర్వపడటం, ఓటమి చెందితే కుంగిపోకుండా ఓటమితోనే ఎలా గెలవాలో నేర్చుకోవాలని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. కేకేఆర్ యూత్ ఆధ్వర్యంలో కావలిలో నిర్వహించిన మినీ క్రికెట్ టెన్నీ స్బాల్ టోర్నీ విజేతలకు గురువారం రాత్రి బహుమతులు అందజేశారు. తొలుత విజేతలైన టీమ్ సభ్యులతో పొలిటికల్ టీమ్ కొంతసేపు క్రికెట్ ఆడి క్రీడాకారులను ఉత్సాహ పరిచారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కష్టాన్ని ఇష్టంగా ఉంచుకుంటే దేనినైనా సాధించవచ్చని కష్టపడందే విజయం దక్క దన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్ బాబు, నేతలు గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, ప్రళయకావేరి మల్లికార్జున , టీడీపీ.జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం

కావలి: టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి రూ.లక్ష చెల్లించి టీడీపీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ముసునూరులోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చేతుల మీదుగా సభ్యత్వ కార్డును పమిడి అందుకున్నారు.

పీహెచ్‌సీ అభివృద్ధికి కృషి చేస్తాం: ఎంపీపీ

కలిగిరి, జనవరి17(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం అభివృద్ధికి పూర్తిస్థాయిలో కృషి చేస్తామని పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్, ఎంపీపీ మెట్టుకూరు శిరీష తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో శుక్రవారం వైద్యాధికారి బిజ్జం గీతారెడ్డి అధ్యక్షతన పీహెచ్‌సీ కమిటీ సభ్యులతో సమావేశం అయ్యారు. సదుపాయాల కల్పనకు అవసరమైన పనులను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎంపీడీఓ ప్రత్యూష, ఏపీ స్టేట్ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన సంక్రాంతి వేడుకలు

బిట్రగుంట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బోగోలు కుమ్మరవీధిలో నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగల సందర్భంగా యుత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నాలుగు రోజులు నిర్వహించిన ఆటలపోటీలు శుక్రవారంతో ముగిశాయి. కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి గ్రామ పెద్ద బోగిరి యోహాను అధ్యక్షత వహించారు. బహుమతుల ప్రదానోత్సవంలో టీడీపీ మండల అధ్యక్షుడు మాలేపాటి నాగేశ్వరరావు, పార్టీ బోగోలు ఇంచార్జి ముంతాల వెంకయ్య, ఎల్.సుధీర్‌బాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బోగిరి ప్రభాకర్, మేకల కిరణ్‌కుమార్, మురళీ, రమేష్ ఉన్నారు.

పలుకూరు యువకుడి మృతిపై అనుమానాలు

- తల్లి ఫిర్యాదుతో మృతదేహానికి రీ పోస్టుమార్టం

కందుకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పలుకూరులో ఈ నెల 7న మృతిచెందిన గుంటూరు ప్రేమ్ కుమార్ అనే యువకుడి మృతిపై ఆయన తల్లి మరియమ్మ అనుమానం వ్యక్తం చేస్తూ ఈ నెల 13న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పదిరోజుల తర్వాత శుక్రవారం మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. రిమ్స్ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టరు వెంకటేశ్వర్లు నేతృత్వంలో కందుకూరు తహసీల్దారు ఇక్బాల్, సీఐ వెంకటేశ్వరరావులు దగ్గరుండి పోస్టుమార్టం చేయించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి విచారణ పూర్తిచేసి బాధ్యులపై చర్యలు తీసుకోవటం జరుగుతుందని తహసీల్దారు ఇక్బాల్, సీఐ వెంక టేశ్వరరావులు తెలిపారు.

అభివృద్ధికి ప్రాధాన్యత

- ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లింగసముద్రం, జనవరి 17(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని కందు కూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం రాత్రి 8గంటల సయమంలో ఎర్రారెడ్డిపాలెం పంచాయతీ ఉట్లవారిపాలెంలో రూ.18.30లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, రూ.6.50లక్షలతో నిర్మించిన వాటర్ ప్లాంటును ప్రారంభించారు. అనంతరం టీడీపీ మండలాధ్యక్షుడు వేముల గోపాలరావు ఇతర నాయకులతో కలిసి గ్రామంలోని ఆలయాన్ని సందర్శించి స్వామి వార్లకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీని వాసులు, మాలకొండయ్య, సోంపల్లి మనోహర్, బొల్లినేని నాగేశ్వరరావు, ప్రసాద్, నారాయణ, ప్ర సాద్, బాలకోటయ్య పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

కందుకూరు, జనవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక టీఆర్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం 2007-09 ఇంటర్ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రిన్సిపాల్ నాగూర్‌వలికి రూ.10వేలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా పాత జ్ఞాపకాలను నెవరు వేసుకున్నారు. కార్యక్రమంలో పీడీ తొట్టెంపూడి సుబ్బారావు, అధ్యాపకులు చుండూరి బాబూరావు, కలగట్ల హజరత్తయ్య, కాశీరత్నం, అక్రమ్, మాధవరావు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతిని విజయవంతం చేయాలి

ఉదయగిరి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో శనివారం నిర్వహించే మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారక రామారావు వర్ధంతిని జయప్రదం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పొన్నెబోయిన చెంచలబాబుయాదవ్ పాల్గొంటారన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధికసంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

●వరికుంటపాడు (ఉదయగిరి రూరల్): స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించే ఎన్టీఆర్ వర్ధంతిని విజయవంతం చేయాలని మండల కన్వీనర్ చంద్ర మధుసూధన రావు కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కార్యాలయ ప్రాంగణంలో కేక్ కట్‌చేసి సంబరాలు జరుపుతామన్నారు. కూట మి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల బాధ్యు లు, ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సీడీపీవో బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి సీడీపీవోగా టీ శారద శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కావలి ఏసీడీపీవోగా పనిచేస్తున్న ఆమెను ఉదయగిరికి ఇన్‌చార్జి సీడీపీవోగా ఉన్నతాధికారులు నియమించడంతో బాధ్యతలు చేపట్టారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలు సక్రమంగా అందేలా కృషి చేస్తానన్నారు.

వ్యవసాయాధికారుల తనిఖీలు

కందుకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు భూసార పరీక్షా కేంద్రం ఏడీఏ కె.కన్నయ్య, మండల వ్యవసాయాధికారి వి.రాముతో కలిసి పట్టణంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. వ్యాపారులంతా ఎంఆర్పీలకే ఎరువులు విక్రయించటంతో పాటు రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని, ఆయా డీలర్లకు ఎరువులు సరఫరా చేసే లైసెన్సీల ఉత్పత్తుల వివరాలను బహిరంగపరచాలని సూచించారు. యూరియా, డీఏపీ అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. రైతులకు వారికున్న భూమి ఆధారంగా బయోమెట్రిక్ విధానంలో మాత్రమే ఎరువులు విక్రయించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా బయోమెట్రిక్ నిల్వలు, గోదాముల్లో భౌతికంగా ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఏవైనా ఫిర్యాదులు ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి

బిట్రగుంట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఇదివరకు జరిగిన వివాదాన్ని మనసులో పెట్టుకుని పాతకక్షలతో ఉద్దేశపూర్వకంగానే తనపై దాడి చేశారని బాధితుడు పల్లిబోయి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. ఏనుగులబావి పంచాయతీలోని ఒంటేరు తిరుపతి శుక్రవారం దాడి చేశాడన్నారు. రక్తగాయాలైన ఆయన్ను గ్రామస్థులు ఆటోలో కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. వృద్ధాప్యంలో ఉన్న తాము గ్రామంలో ఉండలేకపోతున్నామని బాధితుని భార్య ఆదిశేషమ్మ తెలిపింది.

ఉదయగిరి పట్టణ రూపురేఖలు మారుస్తా : ఎమ్మెల్యే కాకర్ల

ఉదయగిరి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన ఉదయగిరి పట్టణాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసి రూపురేఖలు మారుస్తానని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభు త్వ డిగ్రీ కళాశాలకు పీఎం ఉష పథకం కింద రూ.5 కోట్లు నిధులు మంజూరు కావడంతో నూతన భవన నిర్మాణాలకు అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేఖరులతో మాటా ్లడుతూ నియోకవర్గంలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. 15 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎంఆర్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణాన్ని సర్వాంగసుందరంగా తీర్చిదిద్దనున్నామన్నారు. మరో ఏడాదిన్నర కాలంలో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో సిమెంట్‌రోడ్ల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బయ్యన్న, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, టీడీపీ రాష్ట్ర మైనారిటీ సెల్ ఉపాధ్యక్షుడు రియాజ్, టీడీపీ నాయకులు గడ్డం శ్రీనివాసులు, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, బొజ్జా శ్రీనివాసులు, ఓబులరెడ్డి, సందానీ, నరసింహ, వైస్ ప్రిన్సిపాల్ నరసింహులు, ఏపీఈడబ్ల్యూఐడీసీ డీఈ సుబ్బారావు, ఏఈ శ్రావణకుమార్ పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వాల స్వీకరణ

ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయగిరిలో పలువురు టీడీ పీ నాయకులు శాశ్వత సభ్యత్వాలను స్వీకరించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నేటి వెంకటరెడ్డి, నాయకులు రెడ్డి బత్తిన నరసింహా రావు, రావులపల్లి వెం కట నరసయ్య ఎమ్మెల్యే చేతుల మీదుగా శాశ్వత సభ్యత్వాలను స్వీకరించారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

● వింజమూరు: మండలంలోని బొమ్మరాజుచెరువు గ్రామంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ఉదయగిరి శాసనసభ్యుడు కాకర్ల సురేష్ చేతుల మీదుగా బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ఉదయగిరి నియోజకవర్గ వ్యాప్తంగా దాదాపు రూ.21.35లక్షల విలువ గల 16 చెక్కులను బాధితులకు అందించినట్లు తెలియజేశారు.

పారిశుధ్యం మెరుగుపరచాలని వినతి

కలువాయి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరచాలని తోపుగుంట అగ్రహారం గ్రామానికి చెందిన పలువురు సాఫ్టవేర్ ఉద్యోగులు శుక్రవారం ఎంపీడీవోకు వినతిపత్రం అందచేశారు. సంక్రాంతికి సొంత ఊరికి వచ్చిన పలువురు సాఫ్టవేర్ ఉద్యోగులు, యువకులు కలిసి గ్రామంలోని సమస్యలను తెలుసుకుని అధికారులు దృష్టికి తీసుకుపోయారు.

కిశోరి వికాసంపై అవగాహన

ఆత్మకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీడీపీవో కార్యాలయంలో శుక్రవారం ఆత్మకూరు సీడీపీవో సునీలత ఆధ్వర్యంలో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, సీఐ జి గంగాధర్, ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ తదితరులు మాట్లాడుతూ వ్యక్తిగత పరి శుభ్రత, లైంగిక దాడి, అక్రమ రవాణ, బాల్య వివాహాలు తదితర తొమ్మిది అంశాలపై అవగాహన కల్పించారు. కిశోరి వికాశం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అస్మా, డాక్టర్ అనూష, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

సీతారామపురం, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): బెస్త కాలనీలో సంక్రాంతి సందర్భంగా టీడీపీ మండల నాయకుడు తోట మనోజ్‌బాబు, బిజెపి నాయకుడు ముడమల రమేష్‌ల సహకారంతో క్రికెట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు శుక్రవారం బహుమతులు అందచేశారు. బిజెపి నేత బాల చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి

ఆత్మకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలు ఐక్యతకు దోహదపడతాయని డాక్టర్ బిఎస్‌ఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ బొమ్మిరెడ్డి తారక్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి ఆటల పోటీలు శుక్రవారం ముగిసాయి. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి కొప్పోలు డేవిడ్‌రాజు, సీఐటీయు జిల్లా నాయుకులు జి శివప్రసాద్, మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ షేక్ సందాని, రెడ్‌క్రాస్ ఛైర్మన్ సాధిక్‌హుస్సేన్, డీవైఎఫ్ఐ నాయకులు నందా శ్రీను, ఆళ్ల హజరత్తయ్య, రిచర్డ్, మహేష్, వాగాల శ్రీహరి, యుటీఎఫ్ నాయకులు మురళీకృష్ణ, కె నరేష్ పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల విజేత కరటంపాడు జట్టు

మండలంలోని కరటంపాడు పంచాయతీ పరిధిలోని సాతానుపల్లిలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు కరటంపాడు, వాశిలి జట్లు మధ్య పోటీ హోరాహోరీగా జరిగింది. కరటంపాడు జట్టు విజేతగా నిలిచింది. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దావా పెంచలరావు, సర్పంచ్ పూనుగుంట రేవతి, ఉత్తరకాలువ వైస్‌ఛైర్మన్ పూనుగుంట ధనుంజయ, న్యాయవాది నందా ఓబులేశు, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని విజేతగా నిలిచిన కరటంపాడు జట్టుకు ట్రోఫీని, రూ. 50 వేలు నగదు బహుమతిని అందజేసి అభినందించారు. విన్నర్‌గా నిలిచిన వాశిలి జట్టుకు రూ. 25 వేలు నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిఎల్ నిర్వాహకులు పూనుగుంట సునీల్, టిడిపి మైనార్టీ నాయకులు షేక్ నజీర్ తదితరులు పాల్గొన్నారు.

కేరట్ మనదే!

భోజనకుతూహలం
ఆహారంతో ఆరోగ్యం

'కేరో' అనే ఇండో-యూరోపియన్ మూల పదానికి 'కొమ్ము' ఆకారంలో ఉండేదని అర్థం. పసుపుకొమ్ము, శొంఠి కొమ్ము లాగానే 'కేరెట్ కొమ్ము' అని వాడేవారు. చాలామంది ఇది విదేశాల నుంచి మనకు దిగుమతి అయిన దుంప అని భావిస్తారు. వాస్తవానికి ఈ దుంప మన దేశంలో కొన్ని వేల ఏళ్లుగా పండుతోంది. మన ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలు గుంజన దుంపలు, గాజర గడ్డలనే పేర్లతో కేరట్‌నే పేర్కొన్నాయి. 16వ శతాబ్ది నాటి భోజన కుతూహలం, 17వ శతాబ్ది నాటి హంసవింశతి గ్రంథాలలో ఈ దుంప ప్రస్తావన ఉంది.

మనకు దొరికే గాజర దుంపలు లేత కాషాయ రంగులో ఉంటాయి. ఇవి మిగిలిన రంగుల్లో కూడా మనకు లభ్యమవుతాయి. కేరట్ కాయలను మెరికార్ప్ అంటారు. మానవ శరీరంలో నిర్మాణ క్రియలకు సమస్యలు ఏర్పడినప్పుడు వాటిని సరిచేసే గుణం వీటికుంది. ఇక కేరట్‌లోని బీటాకెరోటిన్ అనే పదార్థంవల్ల ఆ దుంపలకు కాషాయ వర్ణం ఏర్పడుతుంది. సాధారణంగా మొక్కల్లోని కణాలను అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి ఈ బీటాకెరోటిన్ కాపాడుతూ ఉంటుంది. అందువల్లే కేరట్‌ను తింటే బీటాకెరోటిన్ శరీరానికి అందుతుంది. చర్మం నిగనిగలాడుతుంది. అంతే కాకుండా కంటి చూపు మెరుగుపరచటానికి కూడా కేరట్ ఉపకరిస్తుంది. రెండో ప్రపంచ యుద్ధం సమయంలో బ్రిటిష్ సైనికులకు కంటి చూపు మెరుగుపరచటం కోసం కేరట్‌ను ఆహారంగా పెట్టేవారట!



కేరట్, ముల్లంగి, కీర... ఈ మూడు దుంపలను సమాన పరిణామాల్లో తీసుకొని జ్యూస్ చేసుకొని రోజూ ఉదయం తాగితే శరీరంలోని అనేక రకాల రోగాలు తగ్గుతాయి. దీనిలో కొద్దిగా పెరుగు కలిపినా మంచిదే.

'భోజన కుతూహలం' గ్రంథం ప్రకారం కేరట్ వల్ల కలిగే ప్రయోజనాలివి...

- కేరట్‌లు కఫ దోషాలను పోగొడతాయి. కడుపు ఉబ్బరాన్ని, ఆమ్లాలను తగ్గిస్తాయి.
- నులిపురుగులను అరికడతాయి. కడుపునొప్పి వంటి సమస్యలకు ఔషధంగా పని చేస్తాయి.
- శరీరంలో వేడి తగ్గుతుంది. చలవ చేస్తుంది. దప్పిక కూడా తగ్గుతుంది.
- స్త్రీలలో రక్తస్రావాన్ని అరికట్టడానికి ఇవి ఉపకరిస్తాయి
- అమీబియాసిస్ వ్యాధి ఉన్నవారికి కేరట్‌వల్ల ఎన్నో ప్రయోజనాలుంటాయి.

● గంగరాజు అరుణాదేవి

ఆవకాయ, మాగాయి, నిమ్మకాయ...
ఇలా రకరకాల నిల్వ పచ్చళ్లు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని...
అందువల్ల ఎక్కువగా తినవద్దని... తాజా కూరగాయలతో
తయారుచేసిన పచ్చళ్లనే తినమని
డాక్టర్లు సూచిస్తూ ఉంటారు.
అలాంటి కొన్ని పచ్చళ్ల తయారీ...
మీ కోసం.



వంటిల్లు

తాజా తాజా చట్నీలు

మిక్స్‌డ్ వెజిటబుల్ చట్నీ

కావాల్సిన పదార్థాలు:

ఉల్లిపాయ ముక్కలు- పావు కప్పు, తరిగిన పచ్చిమిర్చి- రెండు చెంచాలు, తరిగిన అల్లం: అర చెంచా, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, పసుపు- అర చెంచా, టమోటా ముక్కలు- ఒక కప్పు, కేరట్- అర కప్పు, బీన్స్- పావు కప్పు, కాలీఫ్లవర్- అర కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు చెంచాలు, చింతపండు రసం- రెండు చెంచాలు, పంచదార- ఒక చెంచా, ఉప్పు- తగినంత, నూనె- పావు కప్పు, ఆవాలు- ఒక చెంచా, మినపప్పు- ఒక చెంచా, జీలకర్ర- ఒక స్పూను, ఎండు మిరపకాయలు- రెండు, ఇంగువ- తగినంత

తయారీ విధానం:



- కేరట్, బీన్స్, కాలీఫ్లవర్ ముక్కలను కుక్కర్‌లో ఒక విజిల్ వచ్చే దాకా ఉడికించాలి. ఆ తర్వాత బయటకు తీసి చల్లార్చాలి.
- ఒక మూకుడులో నూనె తీసుకొని అందులో తరిగిన ఉల్లిపాయలు, అల్లం, పచ్చిమిర్చి ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి. చివరగా పసుపు వేయాలి.
- ఆ మిశ్రమంలోనే టమోటాలు వేసి ఉడకనివ్వాలి. తరువాత ఉడికించిన కూర ముక్కలు వేయాలి. పంచదార కలపాలి.
- కూర ముక్కల్లోని నీళ్ల ఆవిరి అయ్యేదాకా మగ్గనివ్వాలి. ఈ మిశ్రమాన్ని కిందకు దింపి చల్లారనివ్వాలి.
- ఒక మిక్సీలో ఈ మిశ్రమాన్ని, కొత్తిమీర, చింతపండు రసం, ఉప్పు వేసి ముద్దగా చేయాలి. దీనిని ఒక గిన్నెలో పెట్టుకోవాలి.
- వేరే మూకుడులో కొద్దిగా నూనె వేసి ఆవాలు, మినపప్పు, జీలకర్ర, ఎండు మిరపకాయలు, ఇంగువ వేసి వేయించాలి. దీనిని గిన్నెలోని పచ్చడిలో కలపాలి.

జాగ్రత్తలు:

- పంచదార వేయటంవల్ల పచ్చడిలో ఉన్న ఆమ్ల లక్షణాలు తొలగిపోతాయి. తినటానికి కమ్మగా ఉంటుంది.
- ఈ పచ్చడిలో టమోటా ముక్కలు ఎక్కువ వేయకూడదు.

ముల్లంగి ఆకుల చట్నీ



కావాల్సిన పదార్థాలు:

తరిగిన కొత్తిమీర- అర కప్పు, ముల్లంగి ఆకులు- అర కప్పు, ముల్లంగి ముక్కలు- పావు కప్పు, వెల్లుల్లి రెబ్బలు- ఆరు, పచ్చిమిర్చి ముక్కలు- రెండు చెంచాలు, తరిగిన అల్లం ముక్కలు- అర చెంచా, నూనె- రెండు చెంచాలు, నిమ్మకాయ రసం- నాలుగు చెంచాలు, ఉప్పు- తగినంత

తయారీ విధానం:

- మూకుడులో నూనె వేసి కొత్తిమీర, ముల్లంగి ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు, అల్లం ముక్కలు, వెల్లుల్లి రెబ్బలు వేసి దోరగా వేయించాలి.
- ఈ మిశ్రమం చల్లారిన తర్వాత మిక్సీలో వేసి ముద్దగా చేయాలి.
- ఆ మిశ్రమంలోనే ముల్లంగి ముక్కలు, ఉప్పు వేసి బాగా ముద్దగా చేయాలి. అందులో నిమ్మకాయ రసం కలపాలి.

జాగ్రత్తలు:

- కొన్నిసార్లు ముల్లంగి చేదుగా ఉంటుంది. అలాంటి ముల్లంగిని వాడకూడదు. లేత ముల్లంగి ఆకులతో మంచి రుచి వస్తుంది.
- నిమ్మ రసం కూడా తగినంత చేర్చుకోవాలి. నిమ్మ రసం ఎక్కువ అయినా రుచి బాగుండదు.

చేమ ఆకుల చట్నీ



కావాల్సిన పదార్థాలు:

సన్నగా తరిగిన చేమ ఆకులు- రెండు కప్పులు, పచ్చిమిర్చి ముక్కలు- మూడు స్పూన్లు, చింత పండు రసం- రెండు చెంచాలు, బెల్లం పొడి- రుచికి తగినంత, కొబ్బరి తురుము- నాలుగు చెంచాలు, వేయించిన నువ్వులు- రెండు చెంచాలు, నూనె- పావు కప్పు, తరిగిన కొత్తిమీర- రెండు స్పూన్లు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని

తయారీ విధానం:

- ఒక మూకుడులో నూనెను వేడి చేయాలి. దీనిలో చేమ ఆకులు, పచ్చిమిర్చి ముక్కలు వేయించాలి.
- ఈ మిశ్రమంలో చింతపండు రసం, బెల్లం పొడి, కొద్దిగా నీళ్లు పోసి బాగా ఉడకబెట్టాలి. కిందకు దింపి చల్లార్చాలి.
- మరో మూకుడులో కొబ్బరి తురుము, నువ్వులు దోరగా వేయించాలి. ఇవి చల్లారిన తర్వాత మిక్సీలో వేసి పొడి చేసుకోవాలి.
- ఈ పొడిలో చేమ ఆకుల మిశ్రమం, ఉప్పు వేసి ముద్దగా చేసుకోవాలి. తరిగిన కొత్తిమీర కలపాలి.

జాగ్రత్తలు:

- లేత చేమ ఆకులు రుచిగా ఉంటాయి. అయితే ఇవి ఉడకటానికి మామూలు ఆకు కూరల కన్నా ఎక్కువ సమయం పడుతుంది.
- బెల్లం బదులు పంచదార కూడా వేసుకోవచ్చు

దుస్తులపై మరకలా... వదిలించండిలా...


ఒక్కోసారి బట్టలపై అనుకోనివిధంగా మరకలు పడుతుంటాయి. సబ్బుతో ఉతికినా, వాషింగ్ మెషిన్‌లో వేసినా అవి పోవు. కొన్ని చిట్కాలు పాటించి మొండి మరకలను సైతం సులువుగా పోగొట్టుకోవచ్చు. వాటి గురించి తెలుసుకుందాం!

- బట్టలపై సిరా మరకలు పడితే వాటి మీద కొద్దిగా శానిటైజర్ లేదా పెర్ఫ్యూమ్ చల్లి దూదితో రుద్దాలి. ఒక చెంచా బేకింగ్ సోడాని నీళ్లతో తడిపి ముద్దలా చేసి ఈ మిశ్రమంతో రుద్దినా సిరా మరకలు వెంటనే పోతాయి. మరక మీద కొద్దిగా డెటాల్ వేసి అయిదు నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత టూత్ బ్రష్‌తో రుద్దితే మరక పోతుంది.
- బట్టల మీద టీ లేదా కాఫీ ఒలికి మరకలు పడుతుంటాయి. అలాంటపుడు ఒక గిన్నెలో ఒక చెంచా నిమ్మరసం, ఒక చెంచా వైట్ వెనిగర్ వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమంతో మరకమీద రుద్దితే ఫలితం ఉంటుంది. మరక మీద టూత్ పేస్ట్ రాసి పది నిమిషాలు అలాగే ఉంచాలి. తరవాత వేడి నీళ్లతో కడిగి సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- పార్కులో కూర్చున్నపుడు లేదా తోటపనిచేసినపుడు బట్టల మీద మరకలు ఏర్పడుతుంటాయి. అర బకెట్ నీళ్లలో అయిదు చెంచాల వెనిగర్ వేసి బాగా కలపండి. ఈ నీళ్లలో బట్టలను గంటసేపు నానబెట్టి తరవాత సబ్బుతో ఉతికితే మరకలన్నీ పోతాయి. టమాటా, తుప్పు, జ్యూస్, రక్తం మరకలను కూడా ఈవిధంగానే పోగొట్టవచ్చు.
- చాక్లెట్ మరకలైనపుడు ఆ బట్టలను.... బట్టల సోడా కలిపిన నీళ్లలో అరగంటసేపు నానబెట్టి సబ్బుతో ఉతికితే చాలు.
- బట్టలను వాషింగ్ మెషిన్‌లో వేసినపుడు కొన్నిటి రంగులు మిగతా వాటికి అంటుకుంటుంటాయి. సబ్బుతో రుద్దినా ఆ మరకలు పోవు. వాటి మీద 90 శాతం ఆల్కహాల్ ఉన్న ద్రావణాన్ని చల్లి దూదితో రుద్దితే రంగుల మరకలు పోతాయి.
- రక్తం మరకలు పడినపుడు వాటి మీద హైడ్రోజన్ పెరాక్సైడ్ ద్రావణం చల్లి అరగంటసేపు ఉంచాలి. తరవాత సబ్బుతో ఉతికితే మరకలు పోతాయి.
- నూనె మరకలు పడినపుడు వాటి మీద డిష్ వాషింగ్ లిక్విడ్ లేదా బేకింగ్ సోడా చల్లి అరగంట తరవాత టూత్‌బ్రష్‌తో రుద్దితే చాలు.
- బకెట్ వేడి నీళ్లలో కొద్దిగా సర్ఫ్, కొద్దిగా బట్టల సోడా వేసి బాగా కలిపి అందులో బట్టలను నానబెట్టాలి. అరగంట తరవాత వాటిని సబ్బుతో ఉతికి ఎండలో ఆరవేస్తే తేలికపాటి మరకలన్నీ పోతాయి.



చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

నేడు ఎన్టీఆర్ 29వ వర్ధంతి



పురాణ పరిజ్ఞానంలోనూ అన్నగారు మిన్న!

'ధన, రుణ సమ్మిళితం శక్తి-తత్ఫలితం సృష్టి' అన్నది అనాదిగా జగమెరిగిన సత్యం! పాజిటివ్, నెగిటివ్ అన్నవి లేకుంటే పవర్ లేదన్న విషయం సైన్స్ కూడా ధ్రువీకరిస్తోంది. దీనిని అనుసరించే కళలు కాంతులీనాయని ప్రతీతి. రచనలోనూ ఈ విషయాన్నే స్మరిస్తూ ఓ కథలోని ప్రధాన పాత్రల్లోని తప్పొప్పులను విశదీకరిస్తూ సాగారు. వేద వ్యాస భగవానుడు కూడా అదే తీరున పంచమ వేదం మహాభారతాన్ని రచించారు. యూదు, క్రైస్తవ, ఇస్లామ్ మతస్థులు పవిత్రంగా భావించే మోజెస్ రచనలు సైతం ఇదే పంథాను అనుసరించాయని చెప్పవచ్చు. ఇవన్నీ తెలుగు చిత్రసీమలో పౌరాణికాలతో కళాఖండాలు తెరకెక్కించిన వారికి తెలియనివి కావు. అలాగే ప్రపంచంలోనే అత్యధిక పౌరాణిక చిత్రాల్లో నటించిన విశ్వవిఖ్యాత నటసార్వభౌమ నందమూరి తారక రామారావుకు కూడా ఆ పురాణపరిజ్ఞానం ఉందనే విషయాన్ని ఆయన తెరకెక్కించిన పురాణగాథలు చెప్పకనే చెబుతాయి.

● ఈ మధ్య ఎన్టీఆర్ పుట్టిన గడ్డపైనే నిల్చుని అనంతమైన అవివేకం ప్రదర్శిస్తూ కర్ణుని పాత్రను గొప్పగా చిత్రీకరించడం తప్పు అని ఇంకా ఏవేవో చెప్పారు. 'దానవీరశూర కర్ణ'లో కర్ణుడిని గొప్పగా చూపించడం వల్లే తరువాతి తరాల వారు కర్ణ పాత్రను ఎంతో ఉదాత్తంగా భావిస్తున్నారని వారి భావన! నిజానికి ఎన్టీఆర్ కంటే ముందు కూడా ఎంతోమంది కర్ణుని గొప్పతనం గురించి పౌరాణిక చిత్రాల్లో ప్రస్తావించినవారున్నారు. ఘోష యాత్ర సమయంలోనూ, గోగ్రహణ సమయాన కర్ణుడు పరాజితుడైన మాట వాస్తవమే! అయితే అదే కర్ణుడిపై దుర్యోధనునికి ఎందుకంత నమ్మకం అంటే అస్త్రశస్త్ర రచనలోనూ, గదాయుద్ధంలోనూ ప్రావీణ్యం ఉన్న జరాసంధుని సైతం కర్ణుడు నిలువరించి ఉంటాడు. అందువల్ల దుర్యోధనునికి కర్ణుడంటే అంతటి విశ్వాసం! ఇక తన ప్రాణరక్షితాలైన సహజ కవచకుండలాలను ఇంద్రునికి దానమిచ్చిన సమయంలోనే బలి, శిబి, దధీచి వంటి పుణ్యాత్ముల సరసన చేరాడు కర్ణుడు. ఇవన్నీ కాదు సాక్షాత్తు వేదవ్యాసుడే కర్ణుని గొప్పతనాన్ని వివరిస్తూ 'మహాతేజస్వి, అభిమానవంతుడు, ధార్మికోత్తముడు..' అంటూ (మహాభారతం-ఉద్యోగపర్వం 144-31)లో వర్ణించాడు. ఇలాంటి అంశాలన్నీ నటరత్న ఎన్టీఆర్‌కు తెలియనివి కావు. ప్రధాన పాత్రలోని మంచిచెడ్డలలో మంచినే ఎక్కువగా ప్రదర్శించాలన్న సంప్రదాయాన్ని అనుసరించారు ఎన్టీఆర్. ఆయనే కాదు తరవాత వెలసిన పురాణాల లక్ష్యం కూడా అదే! ఆ అష్టాదశ పురాణాలను సైతం 'మహాభారత' కర్త వేదవ్యాసులవారే అందించారు.

● అదే తీరున రామాయణ, భారత, భాగవతాలను అందులోని పాత్రలను ఆశ్రయించుకొని తరువాతి రోజుల్లో పలు రచనలు వచ్చాయి. ఇక తెలుగులో కవిత్రయం మూలభారతంలోని కొన్ని అంశాలను వదిలివేసిన సందర్భాలూ ఉన్నాయి. ఈ తీరున ఎవరికి వారు తమ స్వేచ్ఛాసృష్టితో ఆ పురాణ పాత్రలకు తమదైన రీతిలో హంగులు అద్దారు. అలా వెలసిన కథనే మనమంతా మహా కళా ఖండమని కీర్తిస్తున్న 'మాయాబజార్'(1957) చిత్ర రాజం!

● తొలి నుంచీ మన పురాణాల లక్ష్యం సామాన్యులలో సత్ప్రవర్తన కలుగజేయడమే! ఎన్టీఆర్ సైతం దానిని అనుసరించారు. తాను తొలిసారి స్వీయ దర్శకత్వంలో నటిస్తూ తెరకెక్కించిన 'సీతారామకళ్యాణం'లో రావణ పాత్రను అదే తీరున చిత్రీకరించారు. పరమశివభక్తుడైన రావణుడు స్త్రీ వ్యామోహంతో పతనమయ్యాడని చాటారు. ఎన్నో సున్నితాంశాలను సైతం నిశితంగా చాటిన ఎన్టీఆర్ పురాణ పరిజ్ఞానాన్ని శంకించడం అనంతమైన అజ్ఞానమే అవుతుంది. 'లవకుశ' చిత్రం ఘనవిజయం తరువాత ఆ సినిమా వెలుగు చూడటానికి కారకులైన సుందర్‌లాల్ నహతా ఎన్టీఆర్‌ను ఓ కోరిక కోరారు. హిందీలో తాను తీసే సినిమాలో శ్రీకృష్ణ పాత్ర ధరిస్తే కోటి రూపాయలు పారితోషికంగా సమర్పించుకుంటానని అన్నారు నహతా. అయినా ఎన్టీఆర్ తన పౌరాణిక పాత్రలు తెలుగు వారికే సొంతం కావాలని ఆశించి, నహతా ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించారు. తన తెలుగు జాతి అంటే ఎన్టీఆర్‌కు అంతటి అభిమానం! అలాగే తెలుగుదేశం పార్టీతో రాజకీయ ప్రవేశం చేసి సృష్టించిన చరిత్ర తెలిసిందే. ప్రజల మదిలో ఆయన నేటికీ కొలువై ఉండడానికి ఆయన పోషించిన పౌరాణిక పాత్రలు, వాటిలో చూపించిన వైవిధ్యం కారణమని చెప్పక తప్పదు. భారతీయులు పవిత్రంగా భావించే దేవతామూర్తుల పాత్రల్లో ఎన్టీఆర్ నటించలేదు, జీవించారు. అందువల్లే ఈ నాటికీ ప్రజల హృదయాల్లో ఎన్టీఆర్ జీవించే ఉన్నారు. అంతటి మహానటుణ్ణి, మహానాయకుణ్ణి కొందరు స్వార్థపరులు రాజకీయం కోసం వేలెత్తి చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే రాజకీయ ప్రయోజనాల కోసం ఉత్తరాదిన ఓ మహా స్వాప్నికుడిని హిందువు కాదంటూ ఛిద్రం చేసే ప్రయత్నం చేస్తున్నారు. అదే తీరున ఎన్టీఆర్ పేరును కూడా తమ పాలిటిక్స్‌కు ఉపయోగించుకోవాలనుకుంటే ఇక్కడ అటువంటివారి పప్పులు ఉడకవు. ఎందుకంటే తెలుగు నేలతో మమేకమైన - తెలుగు జనతతో పెనవేసుకున్న ఎన్టీఆర్ అనుబంధం అంతటి గాఢమైనది.

- కొమ్మినేని వెంకటేశ్వర రావు

నా రికార్డ్స్ అన్నీ అన్‌స్టాపబుల్

-నందమూరి బాలకృష్ణ



నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా నటించిన 'డాకు మహారాజ్' చిత్రం సంక్రాంతి సందర్భంగా విడుదలై ఘన విజయం సాధించిన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లోని ఐటీసీ కోహినూర్‌లో విజయోత్సవ సభను చిత్ర బృందం నిర్వహించింది. ఈ కార్యక్రమంలో బాలకృష్ణ మాట్లాడుతూ 'వరుసగా ఇది నాకు నాలుగో విజయం. నీటి సమస్య గురించి ప్రజలకు అవగాహన కలిగించిన సినిమా డాకు మహారాజ్. ఒక తెలుగు ఇంజనీర్ రాజస్థాన్ వెళ్లి, అక్కడి ప్రజల కోసం డాకుగా మారడం ఈ సినిమాలో చూశారు. ఆదరించి, అఖండమైన విజయాన్ని అందించిన తెలుగు ప్రేక్షకులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. నన్ను ఎంతగానో ప్రేమించి, నాలో ఉన్న నట విశ్వరూపాన్ని ఆవిష్కరించేలా చేశాడు దర్శకుడు బాబీ. అలాగే మా నిర్మాత వంశీ గారు నా అభిమాని. ఈ సినిమాలో కొత్త బాలకృష్ణను ఆవిష్కరించాలని ఆయన కల కన్నారు. అన్ని క్రాఫ్ట్ మీద మంచి గ్రిప్ ఉన్న వంశీ.. నా అభిమాని కావడం నాకు చాలా గర్వంగా ఉంది. మన సినిమాలను చూసి ప్రశంసించే స్థాయికి తెలుగు చలన చిత్రసీమ ఎదిగింది. నా వరకు చూసుకుంటే, నా రికార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా కలెక్షన్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా అవార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్, నా రివార్డ్స్ అన్నీ అన్ స్టాపబుల్' అన్నారు. ఈ నెల 22న అనంతపురంలో విజయోత్సవ పండుగ నిర్వహిస్తామని బాలకృష్ణ చెప్పారు. దర్శకుడు బాబీ కొల్లి మాట్లాడుతూ,' బాలకృష్ణ ఫిల్మోగ్రఫీలో ఒక మాస్టర్ పీస్ సినిమా ఇవ్వడానికి కారణమైన మా టీమ్ అందరికీ థాంక్యూ సో మచ్. బాలకృష్ణ గారు కథను అర్థం చేసుకొని, దర్శకుడు ఏది అడిగితే అది చేస్తారు' అన్నారు. నిర్మాత నాగవంశీ మాట్లాడుతూ, బాలకృష్ణ గారిని కొత్తగా చూపించాలనే ఉద్దేశంతో ఈ సినిమా చేశాము. అభిమానులు, ప్రేక్షకుల నుంచి మేము ఊహించిన దానికంటే పది రెట్లు ఎక్కువ స్పందన లభించింది. జనవరి 12న ఈ సినిమా విడుదలైతే, సంక్రాంతి పండుగ రోజుకే మా డిస్ట్రిబ్యూటర్లు సేఫ్ జోన్‌కి వెళ్లిపోయారు. అది మాకు పెద్ద సక్సెస్.' అన్నారు.

మహేశ్ ట్వీట్ చేయడం ఆనందంగా ఉంది

- వెంకటేశ్



'కష్టపడి పనిచేస్తే ఫలితం వస్తుందని నా నమ్మకం. ఆ నమ్మకాన్ని ఈ విజయం మరోసారి రుజువు చేసింది. ఇది మా విజయం కాదు, తెలుగు ప్రేక్షకులది. ఈ సినిమాను ఇంతటి సూపర్ డూపర్ హిట్ చేసిన ప్రేక్షకులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు చెబుతున్నా' అని అన్నారు హీరో వెంకటేశ్. 'సంక్రాంతికి వస్తున్నాం' ఇటీవలె విడుదలై ప్రేక్షకాదరణతో సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్ పొంగల్ బ్లాక్‌బస్టర్ జాతర సెలబ్రేషన్స్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వెంకటేశ్ మాట్లాడుతూ 'చిత్ర పరిశ్రమలోని అనేక మంది ఫోన్ చేసి అభినందిస్తున్నారు. సినిమా చాలా నచ్చిందంటూ చిన్నోడు మహేశ్‌బాబు ట్వీట్ చేయడం చాలా ఆనందంగా ఉంది' అని అన్నారు. చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి మాట్లాడుతూ 'ఈ రోజు నాకు ఎనిమిది సక్సెస్‌లు అంటున్నారు. ప్రేక్షకుల సపోర్ట్ లేకుంటే నాకు ఏ విజయమూ దక్కేది కాదు. ఒక దర్శకుడిగా ప్రేక్షకులకు ఎంతగా రుణపడి ఉండాలో అర్థం కావడం లేదు' అన్నారు. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ 'ఈ సినిమా మేము ఊహించని మహా అద్భుతం. అనిల్, వెంకటేశ్ కాంబినేషన్‌లో సినిమా అంటే పాజిటివ్ వైబ్రేషన్. ఇది మాకు బ్లాక్ బస్టర్ పొంగల్. ఈ సంక్రాంతిని మర్చిపోలేం' అని అన్నారు. మరో నిర్మాత శిరీష్ మాట్లాడుతూ 'ఎన్టీఆర్ ఆర్ట్స్ హరికి కృతజ్ఞతలు చెప్పాలి. ఈ చిత్రం మా సమస్యలన్నింటినీ తీరుస్తుందని షూటింగ్‌లో చెప్పేవారు. ఆయన మాట నిజమైంది' అని అన్నారు.

పెద్దోడిని అభినందించిన చిన్నోడు

శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సెలబ్రేషన్స్‌కు మహేశ్ హాజరై సందడి చేశారు. వెంకటేశ్‌తో పాటు చిత్రబృందాన్ని అభినందించారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి ఖేల్‌రత్న పురస్కారాలు అందుకుంటున్న మను భాకర్, ప్రవీణ్ కుమార్, హర్మన్‌ప్రీత్ సింగ్, గుకేశ్

కనుల పండుగ.. క్రీడా అవార్డుల వేడుక

న్యూఢిల్లీ (ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో విశేష ప్రతిభ కనబర్చిన ఆటగాళ్లను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఘనంగా సత్కరించారు. శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జాతీయ క్రీడా అవార్డుల వేడుక కన్నుల పండుగగా జరిగింది. ఇందులో భాగంగా అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న అవార్డును డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ షూటర్ మను భాకర్, వరల్డ్ చెస్ చాంపియన్ గుకేశ్‌లతో పాటు హాకీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారాలింపిక్స్ విజేత ప్రవీణ్ కుమార్ అందుకున్నారు. వీరికి సర్టిఫికెట్, మెడల్‌తో పాటు తలా రూ.25 లక్షల రివార్డు దక్కుతుంది. అలాగే 32 మంది అథ్లెట్లు అర్జున అవార్డును అందుకోగా, ఐదుగురు ద్రోణాచార్య స్వీకరించారు. తెలంగాణకు చెందిన పారా అథ్లెట్ దీప్తి జీవాంజితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ జ్యోతి యర్రాజిలకు అర్జున దక్కింది. దీప్తి అవార్డును స్వీకరించగా, జ్యోతి శిక్షణ నిమిత్తం దక్షిణాఫ్రికాలో ఉండడంతో వేడుకకు హాజరుకాలేకపోయింది. ఈ పురస్కారంతో పాటు రూ.15 లక్షల రివార్డు వీళ్లకు దక్కనుంది.

భావోద్వేగ సన్నివేశం..



అర్జున అవార్డు కోసం దశాబ్దాలుగా ఆయన పోరాటానికి ఫలితం దక్కింది. పారాలింపిక్స్‌లో దేశానికి తొలి స్వర్ణం అందించిన 80 ఏళ్ల మురళీకాంత్ పేట్కర్ చివరకు అర్జున అవార్డు (లైఫ్ టైమ్) అందుకున్నాడు. అయితే ఈ సందర్భంలో అంతటా భావోద్వేగం చోటుచేసుకుంది. 1965లో పాకిస్థాన్‌తో యుద్ధంలో పేట్కర్‌కు బుల్లెట్ గాయం తగిలి నడుం కింది భాగానికి వైకల్యం ఏర్పడింది. ఆ తర్వాత 1972 పారాలింపిక్స్ స్విమ్మింగ్‌లో అతను స్వర్ణం సాధించాడు. ఆహూతుల హర్షధ్వానాల మధ్య అతను చేతి కర్రల సహాయంతో అవార్డును స్వీకరించేందుకు రాగా, రాష్ట్రపతి ముందుకు వచ్చి పేట్కర్‌ను సత్కరించడం అందరినీ ఆకట్టుకుంది.

అమ్మాయిలూ.. అదరగొట్టాలి

- డిఫెండింగ్ చాంపియన్‌గా భారత్
- తొలి రోజే ఆరు మ్యాచ్‌లు
- రేపు విండీస్‌తో యువ భారత్ పోరు

నేటి నుంచి అండర్-19 మహిళల టీ20 వరల్డ్‌కప్

ఉదయం 8 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో



కౌలాలంపూర్: భారత కొత్తతరం మహిళా క్రికెటర్లు అంతర్జాతీయ వేదికపై మరోసారి సత్తా నిరూపించుకోవాలనుకుంటున్నారు. శనివారం నుంచి మలేసియాలో అండర్-19 టీ20 వరల్డ్‌కప్ ఆరంభం కాబోతోంది. 2023లో దక్షిణాఫ్రికాలో జరిగిన తొలి మెగా టోర్నీలో షఫాలీ వర్మ నేతృత్వంలోని భారత జట్టు విజేతగా నిలిచింది. ఈసారి నికీ ప్రసాద్ కెప్టెన్సీలో టీమ్ చెలరేగి రెండో టీ20 వరల్డ్ కప్‌ను సైతం ఖాతాలో వేసుకోవాలనుకుంటోంది. ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటుండగా, వీటిని నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. ప్రతీ గ్రూప్ నుంచి టాప్-3 జట్లు సూపర్ సిక్స్ దశకు వెళతాయి. ఆ తర్వాత రెండు సూపర్ సిక్స్ గ్రూపుల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు సెమీస్‌లో తలపడతాయి. ఫిబ్రవరి 2న ఫైనల్ జరుగుతుంది. ఇక భారత జట్టు గ్రూప్ 'ఎ'లో ఉండగా శ్రీలంక, వెస్టిండీస్, మలేసియా ఇతర జట్లు. ఆదివారం విండీస్‌తో జరిగే పోరుతో భారత్ తమ టైటిల్ వేట ఆరంభిస్తుంది. అయితే శనివారం జరిగే టోర్నీ ప్రారంభ మ్యాచ్‌ల్లో ఆసీస్-స్కాట్లాండ్, ఇంగ్లండ్-ఐర్లాండ్, సమోవా-నైజీరియా, బంగ్లాదేశ్-నేపాల్, పాకిస్థాన్-యూఎస్‌ఏ, న్యూజిలాండ్-దక్షిణాఫ్రికా జట్లు తలపడతాయి.

భారత్ షెడ్యూల్

జనవరి 19	వెస్టిండీస్‌తో
జనవరి 21	మలేసియాతో
జనవరి 23	శ్రీలంకతో

మ్యాచ్‌లన్నీ మధ్యాహ్నం 12 గం. నుంచి

త్రిష మరోసారి..



గత నెలలో జరిగిన అండర్-19 ఆసియాకప్‌లో హైదరాబాదీ జి.త్రిష విశేషంగా రాణించింది. దీంతో ఆమె వరుసగా రెండోసారి ఈ మెగా టోర్నీలో చోటు దక్కించుకుంది. టాపార్డర్‌లో త్రిష దూకుడు జట్టుకు ఉపయోగపడగలదు. అలాగే స్పిన్ విభాగంలో పరునిక సిసోడియా, సోనమ్ యాదవ్, ఆయుషి శుక్లా కీలకం కానున్నారు. జట్టులో మరో ఇద్దరు తెలుగమ్మాయిలు కేసరి ధ్రుతి, షబ్నమ్‌లకు కూడా చోటు దక్కడం విశేషం.

భారత మహిళల జట్టు: నికీ ప్రసాద్ (కెప్టెన్), సానికా చాల్కే, త్రిష, కమలిని, భవిక, ఈశ్వరి, మిథిల, జోషితా, సోనమ్ యాదవ్, పరునిక, కేసరి ధ్రుతి, ఆయుషి, ఆనందిత, షబ్నమ్, వైష్ణవి.

షూటర్ ముకేష్‌కు రజతం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): మొహాలీలో జరిగిన అఖిల భారత విశ్వవిద్యాలయాల షూటింగ్ చాంపియన్‌షిప్‌లో గుంటూరు షూటర్ ముకేష్ రజతంతో మెరిశాడు. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ముకేష్ రెండో స్థానంలో నిలిచాడు.

చెస్ పోటీలు ప్రారంభం

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పెద్దాపురంలో జాతీయస్థాయి పాఠశాల చెస్ చాంపియన్‌షిప్ శుక్రవారం ఘనంగా మొదలైంది. టోర్నీని స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభించారు. ఈనెల 21 వరకు ఈ పోటీలు జరుగుతాయి.

చాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా ఎంపిక నేడే

ముంబై: చాంపియన్స్ ట్రోఫీతో పాటు ఇంగ్లండ్‌తో జరిగే మూడు వన్డేల సిరీస్ కోసం భారత జట్లను శనివారం ప్రకటించనున్నారు. 15 మందితో కూడిన ఈ ప్రాథమిక జట్టులో సెలెక్షన్ కమిటీ బుమ్రాపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఆసీస్‌తో చివరి టెస్టులో తను గాయపడిన విషయం తెలిసిందే. అలాగే, ఈనెల 22 నుంచి ఇంగ్లండ్‌తో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్‌కు కూడా జట్టును ప్రకటించనున్నారు.

స్టార్లు సాఫీగా..



సబలెంకా

- ప్రీక్వార్టర్స్‌లో జొకో, అల్కారజ్, సబలెంకా, గాఫ్
- ఏడో సీడ్ పెగులాకు షాక్
- ఆస్ట్రేలియన్ ఓపెన్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో స్టార్ ఆటగాళ్లు అంచనాలను అందుకొంటూ ముందంజ వేస్తున్నారు. పురుషుల్లో..11వ టైటిల్‌పై కన్నేసిన దిగ్గజం నొవాక్ జొకోవిచ్, నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల విజేత కార్లోస్ అల్కారజ్, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరేవ్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టారు. మహిళల విభాగంలో డిఫెండింగ్ చాంప్ అర్యానా సబలెంకా, మూడో సీడ్ కొకొ గాఫ్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించారు. అయితే మెల్‌బోర్న్ పార్క్‌లో రెండుసార్లు విజేతగా నిలిచిన నవోమి ఒసాకా గాయంతో మూడో రౌండ్ నుంచి అర్ధంతరంగా వైదొలగింది. ఏడో సీడ్ జెస్సికా పెగులాకు అన్‌సీడెడ్ సెర్బియా క్రీడాకారిణి ఓల్గా డానిలోవిచ్ షాకిచ్చింది. గత ఏడాది సెమీఫైనలిస్ట్ గాఫ్ 6-4, 6-2తో 2021 యూఎస్ ఓపెన్ రన్నరప్ లెలా ఫెర్నాండెజ్‌ని చిత్తు చేసింది. టాప్ సీడ్ సబలెంకా కూడా 7-6 (5), 6-4తో క్లారా టాసన్‌పై గెలిచింది. ఇతర మూడో రౌండ్ మ్యాచ్‌లలో 11వ సీడ్ పౌలా బడోసా 6-4, 4-6, 6-3తో 17వ సీడ్ కోస్త్యుక్‌ని, 14వ సీడ్ ఆండ్రీవా 6-2, 1-6, 6-2తో 23వ సీడ్ ఫ్రెచ్‌ని, 27వ సీడ్ వల్యుచెన్కోవా 6-1, 6-2తో సీగ్మండ్‌ని ఓడించి ప్రీక్వార్టర్స్‌కు చేరారు. 23 ఏళ్ల ఓల్గా డానిలోవిచ్ 7-6 (3), 6-1తో ఏడో సీడ్, యూఎస్ ఓపెన్ రన్నరప్ పెగులాపై సంచలన విజయం సాధించింది. 12వ సీడ్ ష్నీడెర్‌కు 7-6 (4), 6-7 (7), 7-5తో 18వ సీడ్ వెకిక్ షాకిచ్చింది. మరోవైపు నవోమి ఒసాకా 6-7 (7)తో టోక్యో ఒలింపిక్స్ చాంపియన్ బెలిండా బెన్సిక్‌తో తొలి సెట్‌ను కోల్పోయిన దశలో పొత్తి కడుపు నొప్పితో మ్యాచ్ నుంచి నిష్క్రమించింది. పురుషుల మూడో రౌండ్‌లో ఏడో సీడ్ జొకోవిచ్ 6-1, 6-4, 6-4తో టోమస్ మకాక్‌పై వరుస సెట్లలో విజయం సాధించాడు. అయితే రెండో సెట్‌లో జొకో శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందిపడ్డాడు. ఆపై చికిత్స తీసుకొని మ్యాచ్‌ను కొనసాగించాడు. రెండో సీడ్ జ్వెరేవ్ 6-3, 6-4, 6-4తో ఫెర్న్‌లీపై, మూడో సీడ్ అల్కారజ్ 6-2, 6-4, 6-7 (7), 6-2తో బోర్గెస్‌పై, 12వ సీడ్ టామీ పాల్ 7-6 (0), 6-2, 6-0తో కార్బలెస్‌పై విజయంతో నాలుగో రౌండ్‌కు చేరారు.

మిక్స్‌డ్‌లో బోపన్న జోడీ బోణీ

పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగిన భారత వెటరన్ రోహన్ బోపన్న మిక్స్‌డ్‌లో బోణీ చేశాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో బోపన్న/షుయ్ జాంగ్ (చైనా) ద్వయం 6-4, 6-4తో డోడిగ్/క్రిస్టియానాపై నెగ్గి రెండోరౌండ్ చేరింది.

సింధుకు చుక్కెదురు

- సెమీస్‌కు సాత్విక్ జోడీ
- ఇండియా ఓపెన్



న్యూఢిల్లీ: సొంతగడ్డపై టైటిల్‌తో సత్తా చాటాలనుకున్న స్టార్ షట్లర్ పీవీ సింధుకు చుక్కెదురైంది. ఇండియా ఓపెన్ సూపర్ 750 బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో క్వార్టర్‌ఫైనల్లోనే వెనుదిరిగింది. కాగా, పురుషుల డబుల్స్‌లో స్టార్ జోడీ సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి టోర్నీలో భారత్ ఆశలను సజీవంగా ఉంచింది. శుక్రవారం జరిగిన మహిళల సింగిల్స్ పోరులో మాజీ చాంపియన్ సింధు 9-21, 21-19, 17-21తో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత గ్రెగోరియా మరిస్కా (ఇండోనేసియా) చేతిలో పరాజయం పాలైంది. 2017లో ఇండియా ఓపెన్ టైటిల్ నెగ్గిన సింధు.. ఆ మరుసటి ఏడాది రన్నరప్‌గా నిలిచింది. కాగా, పురుషుల సింగిల్స్ బరిలో మిగిలిన ఏకైక ఆటగాడు కిరణ్ జార్జ్ 13-21, 19-21తో చైనా షట్లర్ వెంగ్ హాంగ్‌యాంగ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. పురుషుల డబుల్స్‌లో సాత్విక్/చిరాగ్ ద్వయం 21-10, 21-17తో కొరియా జోడీ కాంగ్ మిన్ హ్యూక్/హో జిన్‌ను చిత్తుచేసి సెమీస్ చేరింది. ఫైనల్ బెర్త్ కోసం మలేసియా జంట గో జె ఫె/ఇజుద్దీన్ కాన్‌తో సాత్విక్ ద్వయం తలపడనుంది.



సీఎం చంద్రబాబును కలిసిన హంపి

అమరావతి (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రపంచ ర్యాపిడ్ చెస్ టైటిల్ సాధించిన తెలుగు గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును శుక్రవారం మర్యాదపూర్వకంగా కలుసుకుంది. ఈ సందర్భంగా హంపిని చంద్రబాబు అభినందించారు. తెలుగు రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన హంపి.. భవిష్యత్‌లో మరిన్ని టైటిళ్లు గెలవాలని సీఎం ఆకాంక్షించారు. హంపి వెంట ఆమె కుటుంబసభ్యులు కూడా ఉన్నారు.


విజయ్ హజారే టోర్నీ ఫైనల్ నేడు | కర్ణాటక X విదర్భ మ. 1.30 నుంచి

బిజినెస్

‘ఆటో’ పెట్టుబడుల కేంద్రంగా భారత్

నాలుగేళ్లలో వాహన రంగంలోకి రూ.3.09 లక్షల కోట్ల ఎఫ్‌డీఐ

ఏడాదిలో 2.5 కోట్ల వాహనాల విక్రయం.. భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పోలో ప్రధాని



న్యూఢిల్లీ: మొబిలిటీ రంగం భవిష్యత్తు భారత్‌దేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దేశంలో గత ఏడాది రికార్డు స్థాయిలో రెండున్నర కోట్ల వాహనాలు అమ్ముడుపోయాయని, అనేక దేశాల జనాభా కన్నా మన దేశంలో కార్ల అమ్మకాలు అధికమని చెప్పారు. కేవలం నాలుగేళ్ల కాలంలో మొబిలిటీ రంగంలోకి 3,600 కోట్ల డాలర్ల (రూ.3.09 లక్షల కోట్లు) విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చాయని చెప్పారు. ఐదు రోజుల పాటు జరిగే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో 2025 ప్రదర్శనను ఢిల్లీలోని భారత మండపంలో శుక్రవారం ప్రారంభించిన సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. మొబిలిటీ (ఆటోమొబైల్) రంగంలో తన భవిష్యత్తును తీర్చి దిద్దుకోవాలనుకునే ప్రతి ఇన్వెస్టర్‌కు భారత్ అద్భుతమైన గమ్యమన్నారు. ఆటోమోటివ్ పరిశ్రమకు ఇన్నోవేషన్, టెక్నాలజీలే చోదకమని పేర్కొంటూ "ప్రపంచం కోసం దేశంలో తయారుచేయండి" అనే మంత్రంతో ముందడుగేసే ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పూర్తి మద్దతు, ప్రోత్సాహం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. "మేక్ ఇన్ ఇండియా" మంత్రం ఆటోమొబైల్ రంగం వృద్ధికి ఎంతో దోహదపడిందని చెప్పారు. పీఎల్ఐ పథకాలు ఈ ప్రచారానికి కొత్త ఉత్తేజం కల్పించడంతో పాటు రూ.2.25 లక్షల కోట్ల విక్రయాలు, 1.5 లక్షల ప్రత్యక్ష ఉపాధి అవకాశాలకు బాటవేశాయని తెలిపారు. భారత్ ప్రస్తుతం ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ, మూడో పెద్ద ప్రయాణికుల వాహన మార్కెట్‌గా ఉందన్నారు. అధిక సంఖ్యలో ఉన్న యువ జనాభా, పెరుగుతున్న మధ్యతరగతి జీవులు, వేగవంతమైన నగరీకరణ, ఆధునిక మౌలిక వసతుల అభివృద్ధి, అందుబాటులోకి వస్తున్న అఫర్డబుల్ వాహనాలు మొబిలిటీ మార్కెట్‌కు బలమని ఆయన అన్నారు.


వేగంగా విస్తరిస్తున్న ఈవీ మార్కెట్

దేశంలో విద్యుత్ వాహనాల (ఈవీ) మార్కెట్ వేగవంతమైన వృద్ధిని నమోదు చేస్తోందని ప్రధాని చెప్పారు. గత దశాబ్ది కాలంలో ఈవీ విక్రయాలు 640 రెట్లు పెరిగాయన్నారు. 10ఏళ్ల క్రితం ఏడాదికి 2,600 ఈవీలు అమ్ముడుపోగా గత ఏడాది ఆ సంఖ్య 16.8 లక్షలకు చేరిందన్నారు. ఈ దశాబ్ది చివరి నాటికి ఈ సంఖ్య 8 రెట్లు పెరగవచ్చని అంచనా వేశారు.

రతన్ టాటా, ఒసాము సుజుకీలకు నివాళి

ఆటోమొబైల్ దిగ్గజాలైన రతన్ టాటా, ఒసాము సుజుకీలను ప్రధాని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. భారత ఆటోమొబైల్ వృద్ధికి, మధ్య తరగతి ప్రజల కలల సాకారానికి వారిద్దరి సేవలు చిరస్మరణీయమన్నారు. మొత్తం భారత మొబిలిటీ రంగానికి వారిద్దరి వారసత్వం ఎల్లప్పుడూ స్ఫూర్తిని అందిస్తుందని నివాళి ఘటించారు.

మెర్సిడెస్ బెంజ్ రెండు కొత్త కార్లు




మెర్సిడెస్ బెంజ్ సరికొత్త బ్యాటరీ విద్యుత్ కారు (బీఈవీ) ఈక్యూఎస్ మేబాక్ ఎస్‌యూవీ 680 "నైట్ సీరీస్"ను విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.2.63 కోట్లు. దీనితో పాటు మెర్సిడెస్ మేబాక్ జీఎల్ఎస్ 600 నైట్ సీరీస్ కారు కూడా విడుదల చేసింది. ఈ కారు ఎక్స్‌షోరూమ్ ధర రూ.3.71 కోట్లు. ఇవి కాకుండా కొత్తగా డెవలప్ చేసిన కాన్సెప్ట్ సీఏల్ఏ కారును ఆవిష్కరించింది.




జేఎస్‌డబ్ల్యూ ఎంజీ సైబర్‌స్టర్

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ రెండు కొత్త ఈవీ మోడళ్లను ఆవిష్కరించింది. ఇందులో ఎంజీ సైబర్‌స్టర్ కారు దేశంలోని తొలి ఆల్ ఎలక్ట్రిక్ రోడ్‌స్టర్ కారు. రెండోది ఎంజీ ఎం9. ఇది మూడు వరుసలున్న తొలి విద్యుత్ లిమోసిన్ కారు. ఈ రెండు కార్లను ఈ ఏడాదే మార్కెట్లో విడుదల చేస్తారు. ఈ కార్లతో తాము యాక్సెసిబుల్ లగ్జరీ విభాగంలోకి ప్రవేశించినట్టు కంపెనీ ప్రకటించింది.

బీఎండబ్ల్యూ ఇండియా ఈవీ



జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల దిగ్గజం బీఎండబ్ల్యూ పూర్తిగా స్థానికంగా తయారు చేసిన బీఎండబ్ల్యూ ఎక్స్ 1 లాంగ్ వీల్ బేస్ ఈవీని విడుదల చేసింది. దీని ఎక్స్‌షోరూమ్ ధర రూ.49 లక్షలు. దీన్ని చెన్నై ప్లాంట్‌లో ఉత్పత్తి చేశారు. బీఎండబ్ల్యూ నుంచి పూర్తిగా దేశీయంగా తయారైన తొలి ఈవీ ఇది.




పోర్షే కొత్త విద్యుత్ ఎస్‌యూవీ

జర్మనీకి చెందిన లగ్జరీ స్పోర్ట్స్ కార్ల కంపెనీ పోర్షే సరికొత్త విద్యుత్ ఎస్‌యూవీ మకాన్, సరికొత్త హంగులతో తీర్చిదిద్దిన స్పోర్ట్ సెలూన్ టైకాన్‌ను భారత మార్కెట్లో విడుదల చేసింది. మకాన్ బీఈవీ మూడు మోడళ్లలో అందుబాటులో ఉంటుంది. ధర రూ.1.22 కోట్ల నుంచి రూ.1.69 కోట్ల మధ్యన ఉంటుంది. కొత్త హంగులతో విడుదల చేసిన టైకాన్ ధర రూ.1.89 కోట్ల నుంచి రూ.2.53 కోట్ల మధ్యన ఉంటుంది.

సుజుకీ తొలి విద్యుత్ స్కూటర్



సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తొలి విద్యుత్ స్కూటర్ ఈ-యాక్సెస్‌ను, మరో రెండు కొత్త మోడళ్లను విడుదల చేసింది. ఈ యాక్సెస్ 3.07 కిలోవాట్ల లిథియం ఐరన్ ఫాస్ఫేట్ బ్యాటరీతో వస్తుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 95 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. ఇతర మోడళ్లలో జిక్సర్ ఎస్ఎఫ్ ఫ్లెక్స్ ఫ్యుయెల్ బైక్, పూర్తిగా కొత్తగా తయారుచేసిన యాక్సెస్ 125 సీసీ స్కూటర్ ఉన్నాయి.



హీరో మోటోకార్ప్

టూవీలర్ దిగ్గజం హీరో మోటోకార్ప్ నాలుగు కొత్త వాహనాలను ప్రదర్శించింది. ఎక్స్‌ట్రీమ్ 250 ఆర్ ద్వారా 250 సీసీ వాహనాల విభాగంలోకి తొలిసారిగా ప్రవేశించింది. అలాగే ఎక్స్‌పల్స్ 210 బైక్, జూమ్ 125, జూమ్ 160 స్కూటర్లు కూడా ప్రదర్శించిన వాహనాల్లో ఉన్నాయి. ఈ వాహనాలన్నింటి బుకింగ్స్ ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయి. మార్చి నుంచి వాహనాల డెలివరీ ప్రారంభిస్తారు.

విప్రో లాభంలో 24 శాతం వృద్ధి

క్యూ3లో రూ.3,354 కోట్లుగా నమోదు

ఒక్కో షేరుకు రూ.6 మధ్యంతర డివిడెండ్

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికానికి (క్యూ3) విప్రో ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 24.4 శాతం వృద్ధితో రూ.3,354 కోట్లకు చేరుకుంది. సమీక్షా కాలానికి కంపెనీ ఆదాయం కేవలం 0.5 శాతం పెరిగి రూ.22,319 కోట్లుగా నమోదైంది. ఈ మార్చితో ముగియనున్న నాలుగో త్రైమాసికం(క్యూ4)లో ఐటీ సేవల ద్వారా సమకూరే ఆదాయం 260.2-265.5 కోట్ల డాలర్ల స్థాయిలో ఉండవచ్చని విప్రో అంచనా వేసింది. క్యూ3తో పోలిస్తే క్యూ4లో ఐటీ సేవల ఆదాయ వృద్ధి మైనస్ 1 శాతం నుంచి ఒక శాతం శ్రేణిలో ఉండవచ్చని అంచనా. కాగా, ఈ ఆర్థిక సంవత్సరానికి గాను వాటాదారులకు ఒక్కో షేరు కు రూ.6 మధ్యంతర డివిడెండ్ చెల్లించనుంది.

12,000 నియామకాలు

వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో ప్రాంగణ నియామకాల (క్యాంపస్ హైరింగ్) ద్వారా 10,000-12,000 మంది ఫ్రెషర్లను ఉద్యోగంలో చేర్చుకోనున్నట్లు విప్రో వెల్లడించింది. కాగా డిసెంబరు త్రైమాసికంలో ఉద్యోగుల సంఖ్య 1,157 తగ్గి 2,32,732కు పరిమితమైంది.

కస్టమర్లకు కాల్ చేసేందుకు ‘1600XX’ సిరీస్‌నే ఉపయోగించండి

బ్యాంకులను కోరిన ఆర్‌బీఐ

ముంబై: బ్యాంకింగ్ రంగంలో పెరుగుతున్న ఆర్థిక మోసాలను నిరోధించేందుకు ఆర్‌బీఐ మరో నిర్ణయం తీసుకుంది. వాయిస్ కాల్స్, ఎస్ఎంఎస్‌ల ద్వారా జరుగుతున్న ఆర్థిక మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు లావాదేవీల విషయమై ఖాతాదారులకు కాల్ చేసేందుకు '1600XX' సిరీస్ నంబర్లను మాత్రమే ఉపయోగించాలని బ్యాంకులను ఆర్‌బీఐ కోరింది. అలాగే, ప్రచార అవసరాల కోసం '140XX' సిరీస్ నంబర్లను మాత్రమే వినియోగించాలని నిర్దేశించింది. అంతేకాదు, బ్యాంకులు, ఇతర నియంత్రిత సంస్థలు తమ కస్టమర్ల డేటాబేస్‌ను పర్యవేక్షించడంతో పాటు ఎప్పటికప్పుడు ప్రక్షాళన చేస్తుండాలని సూచించింది. మార్చి31 నాటికి ఈ ఆదేశాలను అమలు చేయాలని స్పష్టం చేసింది.

అకౌంట్లు, లాకర్లకు నామినీలుండాల్సిందే: మరణించిన ఖాతాదారు కుటుంబ సభ్యులు లేదా సంబంధీకులకు క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను వేగవంతం చేసేందుకు అన్ని ఖాతాలు, లాకర్లకు నామినీ వివరాలు అందుబాటులో ఉండేలా జాగ్రత్త పడాలని బ్యాంకులకు ఆర్‌బీఐ సూచించింది. ప్రస్తుత, కొత్త డిపాజిట్ అకౌంట్లు, సేఫ్టీ లాకర్లకు నామినీలను నిర్ధారించాలని కోరింది.

మారుతి ఈ-విటారా



దేశీయ కార్ల దిగ్గజం మారుతి సుజుకీ తొలి బ్యాటరీ విద్యుత్ కారు ఈ-విటారాను ఆవిష్కరించింది. ఈ కారు 49 కిలోవాట్లు, 61 కిలోవాట్ల బ్యాటరీ ఆప్షన్లలో అందుబాటులో ఉంటుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 500 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుంది. దీన్ని భారత్‌లోనే ఉత్పత్తి చేసి 100 దేశాలకు ఎగుమతి చేయనున్నట్టు ప్రకటించింది. ఈ మోడల్‌కు భారత్‌ను ప్రపంచ ఉత్పత్తి కేంద్రంగా చేయాలనుకుంటున్నట్టు కంపెనీ డైరెక్టర్, ప్రెసిడెంట్ తొషిహిరో సుజుకీ తెలిపారు.

మూడు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మూడు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. ఐటీ, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగ షేర్లలో అమ్మకాల కారణంగా ప్రామాణిక సూచీలు శుక్రవారం నష్టాల్లో ముగిశాయి. విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ, గరిష్ఠ స్థాయి ముడిచమురు ధరలు సైతం ట్రేడింగ్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేశాయి. సెన్సెక్స్ ఒక దశలో 780 పాయింట్ల మేర పతనమైనప్పటికీ, మళ్లీ కాస్త కోలుకుంది. చివరికి సూచీ 423.49 పాయింట్ల నష్టంతో 76,619.33 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 108.60 పాయింట్లు కోల్పోయి 23,203.20 వద్ద క్లోజైంది.

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	131
వరంగల్	112	గుంటూరు	130
కరీంనగర్	112	ఒంగోలు	130
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	104
కర్నూలు	112	నెల్లూరు	109
విశాఖపట్నం	127	అనంతపురం	109
గోదావరి	131		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

18వ తేదీ

హైదరాబాద్	475	విజయవాడ	500
వరంగల్	477	గోదావరి	495
చిత్తూరు	503	విశాఖపట్నం	500
		దజను గుడ్లు రూ. 72	

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	81,270 ▲	74,500 ▲	1,04,000 ▲
విజయవాడ	81,820 ▲	77,000 ▲	93,500 ▲
విశాఖపట్నం	79,290 ▲	72,680 ▲	91,760 ▼
రాజమండ్రి	84,270 ▲	74,500 ▲	91,700 ▲
ప్రొద్దుటూరు	80,350 ▲	74,400 ▲	93,500 ▼
ముంబై	79,239 ▲	72,583 ▲	90,820 ▼

Printed and Published by Koganti Venkata Seshagiri Rao, on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at "Aamoda Press" at 91, Wood Complex, Vedayapalem, Nellore, A.P., Tel. No.0861-2312299, Editor: N.Rahul Kumar,
RNI No. APTEL/2004/11742, Managing Director : Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

పక్షుల కేంద్రంలో ఏర్పాట్ల పరిశీలన



నేలపట్టు పక్షుల కేంద్రంలో సందర్శకులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా

దొరవారిసత్రం, జనవరి17(ఆంధ్రజ్యోతి): నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో ఫ్లెమింగో ఫెస్టివల్ ఏర్పాట్లను శుక్రవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. ఫెస్టివల్ నిర్వాహక ఇన్‌చార్జి అధికారిగా వ్యవహరిస్తున్న గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాల పార్కింగ్, క్యూలైన్‌లో చెరువు కట్టలపై సందర్శకులను పంపడం, వంటి జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రోడ్డు భద్రతా నియమాలను పాటించండి



పోస్టర్లను విడుదల చేస్తున్న సబ్‌కలెక్టర్, రవాణాశాఖ అధికారులు

గూడూరు అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తూ సురక్షిత ప్రయాణాలు సాగించాలని సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో రవాణాశాఖ అధికారులతో కలిసి జాతీయ రహదారి మాసోత్సవాల పోస్టర్లను రవాణాశాఖ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ వాహనాలను నడిపే సమయంలో ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలన్నారు. కారులో ప్రయాణం చేసేవారు సీట్‌బెల్టు పెట్టుకోవాలన్నారు. మద్యం తగి వాహనాలను నడపడం నేరమని, అలాగే అతివేగంగా వాహనాలను నడపడం ప్రమాదకరమన్నారు. వాహన దారులు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలను పాటిస్తే ప్రమాదాలను నియంత్రించవచ్చునన్నారు. కార్యక్రమంలో రవాణశాఖ అధికారి కిషోర్, ఎంవీఐలు జాకీర్‌ఆహ్మద్, సునీల్‌రెడ్డి, ఏఎంవీఐలు ప్రభాకర్, శాంతి పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి సుధాకర్ రెడ్డి, పక్కన రమేష్, మాధవనాయుడు, ఏజీ కిషోర్ తదితరులు

సూళ్లూరుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం రైల్వేగేటు సమీపంలో ఉన్న పార్టీ కార్యాలయంలో అయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా పాలన చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో అనేక పరిశ్రమలతో పాటు కేంద్రం నుంచి నిధులు వస్తున్నాయన్నారు. వైసీపీ నిలిపివేసిన పక్షుల పండుగను కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని నిర్వహిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, సురేష్ నాయుడు, వాకచర్ల రమేష్, ఈవీ సురేష్, రమణయ్య, పెంచలయ్య పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత అల్లీపురం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నాగరాజు

చిల్లకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరూరు గ్రామంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా రామసీత వెల్ఫేర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో అల్లీపురం జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్ మ్యాచ్‌లో అల్లీపురం - ఏరూరు జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన అల్లీపురం జట్టు 12 ఓవర్లలో 5 వికెట్లకు 96 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఏరూరు జట్టు 12 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 67 పరుగులతో ఓటమిపాలైంది. విజేతగా నిలిచిన అల్లీపురం జట్టుకు ఫౌండేషన్ అధ్యక్షుడు చేవూరు నాగరాజు ట్రోఫీని అందజేశారు.

క్రీడలతో మానసికోల్లాసం



వాలీబాల్ వాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ

వెంకటగిరి టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక ఉల్లాసాన్ని పొందవచ్చని మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అన్నారు. శుక్రవారం స్థానిక విశ్వోదయ జూనియర్ కళాశాలలో జీఎన్‌ఆర్ సోషల్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జోనల్ వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ గంగోడు నాగేశ్వరరావు, సీఐ ఏవీరమణ, ట్రస్ట్ సభ్యులు చెంగల్‌రాయలు, సుబ్రమణ్యం, క్రీడాకారులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

గూడూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బాధితులను ఆదుకునేందుకు సీఎం సహాయనిధి తోడ్పాటునందిస్తుందని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో వాకాడు మండలం పల్లెపాళెం గ్రామానికి చెందిన గౌతమ్‌కు రూ.7లక్షలు, చిల్లకూరు మండలం తూర్పుకనుపూరు గ్రామానికి చెందిన భరత్‌కుమార్‌కు రూ. 1.03 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య, వెంకటేశ్వర్లురాజు, మధుసూదన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భార్యను వేధించిన కేసులో భర్తకు జైలు

గూడూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): భార్యను వేధించిన కేసులో భర్తకు ఆరు నెలలు జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తూ శుక్రవారం గూడూరులోని ఫస్ట్‌కాస్ మేజిస్ట్రేట్ తీర్పు ఇచ్చినట్లు రూరల్ ఎస్‌ఐ మనోజ్‌కుమార్ తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు... మండలంలోని తిప్పవరప్పాడు గ్రామానికి చెందిన ప్రసన్నకుమారి అనే వివాహిత 2016లో తన భర్త సురేంద్ర వేధింపులకు గురిచేస్తున్నాడని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో నిందితుడు సురేంద్రకు ఆరు నెలలు జైలుశిక్ష, వెయ్యి రూపాయలు జరిమాన విధిస్తూ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ శుక్రవారం తీర్పు ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెంకటగిరి టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి పట్టణంలో పాలకేంద్రం వద్ద వున్న 132 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో శనివారం మధ్యాహ్నం 3నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ మునిరవిచంద్ర తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.





ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ - జనసంద్రంగా స్వర్ణముఖినది పరివాహక ప్రాంతం

ముగిసిన ఏటి పండుగ

నాయుడుపేట/టౌన్, జనవరి 17: స్వర్ణముఖినదిలో ఏటి పండుగ అట్టహాసంగా ముగిసింది. సంక్రాంతి పండుగ పర్వదినాల్లో భాగంగా మూడు రోజులపాటు నిర్వహించిన ఏటి పండుగ ఆఖరిరోజు శుక్రవారం నాడు భారీగా తరలివచ్చిన ప్రజలతో స్వర్ణముఖినది జనసంద్రమైంది. చిన్నారులతో పాటు యువత, పెద్దలు ఆటపాటలు, ఆనందోత్సాహాలతో ఏటిపండుగలో పాల్గొన్నారు. చిన్నారులతో పాటు పెద్దలూ పతంగులను ఎగురవేశారు. రింగ్‌బాల్, బంతి, కబడ్డీ ఆటలు ఆడారు. స్వర్ణముఖినది వద్ద గొబ్బెమ్మ పూజలు చేసి నదిలో నిమజ్జనం చేశారు. ఏటి పండుగ ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మాట్లాడుతూ అధికారులు, నాయకులు ప్రజల సహకారంతో ఏటి పండుగ ఆహ్లాదకరంగా జరిగిందన్నారు. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఆనందోత్సాహాలతో ఏటి పండుగ జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నం, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్, నెలవల రాజేష్, మధురెడ్డి, చంద్రారెడ్డి, తిరుమూరు సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లను ప్రజలకు అందుబాటులో ఉంచండి

మండల మీట్‌లో ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిల్లకూరు గ్రామంలో మూతపడిన రెండు మినరల్ వాటర్ ప్లాంట్‌లను అధికారులు స్వాధీనం చేసుకుని ప్రజలకు అందుబాటులోకి తేవాలని పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి కోరారు. శుక్రవారం జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తన వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిల్లకూరులో మినరల్ వాటర్ ప్లాంట్‌ను నిర్మించారన్నారు. అదేవిధంగా ఎన్డీసీసీబీ మాజీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి భాగస్వామ్యంతో ఉపాధి నిధులు ఉపయోగించి మరో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం గ్రామంలో నెలకొన్న వర్గవిభేదాలతో ఈ రెండు ప్లాంట్‌లు మూతపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు రాజకీయాలకు అతీతంగా ప్రజల తాగునీటి అవసరాలను గుర్తించి ఆ రెండు ప్లాంట్‌లను స్వాధీనం చేసుకుని వినియోగంలోకి తేవాలని కోరారు. ఎంపీడీవో ప్రమీలారాణి మాట్లాడుతూ ఈ రెండు ప్లాంట్‌లు రాజకీయ నాయకుల ఆధీనంలో ఉన్నాయని, ఈవోపీఆర్డీని పంపించి వాటర్ ప్లాంట్‌లు స్వాధీనం చేసుకుంటామన్నారు. జీలపాటూరు సర్పంచు కందమూడి శివకుమార్ మాట్లాడుతూ తమ గ్రామానికి స్వర్ణముఖి నది నుంచి తాగునీరు అందిస్తున్న మోటారు పైపులు వరదలకు కొట్టుకెళ్లాయని, ఈ విషయాన్ని అధికారులు దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీపీ స్పందిస్తూ తాగునీటి అవసరాలకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. సమావేశానికి ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులు డుమ్మా కొట్టడంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో స్వర్ణముఖి నది ఆనకట్ట సిస్టమ్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దామెర ప్రసాద్‌నాయుడు, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా, వైస్ ఎంపీపీలు, బెల్లపు వెంకటరాఘవరెడ్డి, ఇలకా సుధారాణి, డిప్యూటీ తహసీల్దార్ యువరాజు, వ్యవసాయాధికారి గొడవర్తి ప్రవీణ, ఐసీడీఎస్ సీడీపీవో కొండ్రెడ్డి ఉమామహేశ్వరి, ఎంఈవో మించల శంకరయ్య, ఎంపీటీసీలు శ్యామలమ్మ, కట్టంరెడ్డి జాన్సీ, కల్లూరు కృష్ణయ్య, కన్నలి కుమార్‌స్వామి, సునీత, సుజాత తదితరులు పాల్గొన్నారు.



ఎంపీడీవో ప్రమీలారాణితో వాగ్వాదం చేస్తున్న శిరసనంబేడు సర్పంచు గుంటపూడి పెంచలయ్య

ప్రజాప్రతినిధులంటే చులకనా?

ఎంపీడీవో వైఖరిపై శిరసనంబేడు సర్పంచు ఆవేదన



వేలూరు మురళీకృష్ణారెడ్డి, సర్పంచు పెంచలయ్య, ఉప సర్పంచు సురేష్‌రెడ్డి

పెళ్లకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు ఎంపీడీవో ప్రమీలారాణి ప్రజాప్రతినిధులంటే చులకన భావంతో వ్యవహరిస్తున్నారని శిరసనంబేడు సర్పంచు గుంటపూడి పెంచలయ్య అన్నారు. శుక్రవారం ఆయన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ఇటీవల మండలంలో 24 పంచాయతీలకు ఉపాధి నిధులు విడుదలయ్యాయని, ఇందులో శిరసనంబేడు పంచాయతీకి రూ.18 లక్షలు కేటాయించారని తెలిపారు. ఈ నిధులతో సీసీ రోడ్ల పనులను సర్పంచు తెలియకుండానే నామినేషన్ పద్ధతిలో కేటాయించారన్నారు. ఈ విషయమై సర్వసభ్య సమావేశంలో ఎంపీడీవోను ప్రశ్నించగా సర్పంచు అనుమతి అవసరం లేదని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని సర్వసభ్య సమావేశ మినిట్ బుక్‌లో రాయాలని కోరితే వాగ్వాదానికి దిగారని అన్నారు. పంచాయతీ ప్రథమ పౌరుడైన సర్పంచుకు కనీస సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారం పనులు కేటాయించుకుంటే తమకు పదవులు ఎందుకని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో ఏ పని కావాలని ఎవ్వరు అడిగినా ఓ నాయకుడి సంతకం చేయించుకొని రావాలని ఇదే ఎంపీడీవోగా చెబుతుండడంతో అప్పట్లో ఆ పార్టీలో విభేదాలు నెలకొని తారాస్థాయికి చేరయన్నారు. ఇప్పుడు టీడీపీలో వర్గవిభేదాలు సృష్టించేందుకు ఎంపీడీవో ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ధనార్జనే ధ్యేయంగా ఎంపీడీవో ఉపాధి నిధులు దిగమింగుతున్నారని, ఆమె అవినీతిపై పూర్తి ఆధారాలతో ఉమ్మడి నెల్లూరు జిల్లా మంత్రులతో పాటు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్‌కు నివేదిక ఇవ్వనున్నట్లు వారు తెలిపారు.

మొక్కుబడిగా మండల మీట్

కోట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కోట మండల సమావేశం మొక్కుబడిగా జరిగింది. ఎంపీపీ అంజమ్మ, వైస్ ఎంపీపీలు సౌజన్యరెడ్డి, శేషయ్య, జడ్పీటీసీ కోటయ్య, కోఆప్షన్ సభ్యులు ఎవరూ హాజరుకాలేదు. కేవలం ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు, ముగ్గురు సర్పంచులు మాత్రమే హాజరయ్యారు. పలుశాఖల అధికారులు కూడా రాలేదు. ఎంపీడీవో వేణు, ఎంపీటీసీలు సురేష్, షంషుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

నవోదయ పరీక్షా కేంద్రం పరిశీలన

కోట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కోటలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నవోదయ పరీక్షలు జరగనున్న నేపథ్యంలో శుక్రవారం తహసీల్దారు జయజయరావు తరగతి గదులను పరిశీలించారు.

శ్మశానానికి దారిలేక ఆగచాట్లు



పొలాలలో మృతదేహాన్ని తీసుకువెళ్తున్న కాట్రగుంట గ్రామస్తులు

బాలయపల్లి, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాట్రగుంట గ్రామస్తులు శ్మశానానికి దారి లేక ఆగచాట్లు పడుతున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన పోలమ్మ మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని శ్మశానానికి తీసుకువెళ్లేందుకు దారిలేక పంటపొలాలలో వరినాట్లు తొక్కుకుంటూ పాడి మోసుకువెళ్లారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి శ్మశాన కష్టాలను తీర్చాలని కాట్రగుంట గ్రామస్తులు మొరపెట్టుకుంటున్నారు.

కుట్టుమెషిన్ అందజేత

గూడూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణానికి చెందిన స్రవంతి అనే మహిళకు కుట్టుమెషిన్ అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ పేద మహిళకు జీవనోపాధి కల్పించాలనే ఉద్దేశంతో తమ సంస్థ ఆధ్వర్యంలో రమేష్ సహకారంతో కుట్టుమెషిన్ అందజేశామన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాము, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమెషిన్ అందజేస్తున్న ప్రగతి సేవాసంస్థ సభ్యులు

రోప్‌జంప్ క్రీడాకారుడికి అభినందన



వెంకటేశ్వర్లును అభినందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

చిల్లకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి రోప్‌జంప్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించిన క్రీడాకారుడు మంద వెంకటేశ్వర్లును ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ శుక్రవారం అభినందించారు. మండలంలోని నెలబల్లిరెట్టపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న వెంకటేశ్వర్లు ఇటీవల నేపాల్ జరిగిన రోప్‌జంప్ పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాడు. శుక్రవారం ఎమ్మెల్యే తన కార్యాలయంలో వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, బిల్లు చెంచురామయ్య తదితరులు పాల్గొన్నారు.

అంకమ్మ గ్రామోత్సవం



చిల్లకూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో శుక్రవారం అంకమ్మ గ్రామోత్సం నిర్వహించారు. గ్రామంలో ఏడాది పండుగ సందర్భంగా అంకమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలు, బాణసంచా పేల్చుతూ, యువకుల నృత్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. స్థానిక సుందరమ్మ ఆలయం వద్ద స్థానికులు పొంగళ్లు పెట్టి నైవేద్యంగా నివేదించి మొక్కులు తీర్చుకున్నారు.

గొబ్బెమ్మ గ్రామోత్సవం

కోట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలి, కోట పట్టణం, శ్రీలక్ష్మమ్మ కాలనీల్లో శుక్రవారం గొబ్బెమ్మల గ్రామోత్సవం జరిగింది. మహిళలు గొబ్బెమ్మలు తడుతూ మేళతాళాలతో గ్రామోత్సవంగా తీసుకువెళ్లి గూడలి స్వర్ణముఖినదిలో నిమజ్జనం చేశారు.

ధ్యాన శిక్షణ కేంద్రం ప్రారంభం

కోట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): కోటలోని గ్రామదేవత కోటమ్మ ఆలయంలో నాయుడుపేటకు చెందిన పిరమిడ్ మాస్టర్ మైత్రేయ బుద్ధ, రాఘవేంద్ర ఆధ్వర్యంలో ధ్యాన కేంద్రాన్ని ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. 41 రోజులపాటు ఉదయం 6నుంచి 7గంటల వరకుపిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ఆధ్వర్యంలో ధ్యాన ప్రక్రియ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో పెల్లూరు కోటేశ్వరరెడ్డి, అల్లం రమణయ్య, సుబ్బయ్య, సుబ్రహ్మణ్యం, తదితరులు ఉన్నారు.

పక్షుల పండుగ వెలుగులు




జీఎన్‌టీ రోడ్డులో విద్యుత్ వెలుగులు

సూళ్లూరుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణం పక్షుల పండుగ వెలుగులతో ప్రత్యేక శోభ సంతరించుకుంది. స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో స్టాల్స్‌తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే వేదికను సిద్ధం చేశారు. మైదానంలో స్టాల్స్, హోలీక్రాస్ కూడలి వద్ద నుంచి రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ దీపకాంతులతో పట్టణం వెలిగిపోతోంది. మైదానంలో ఏర్పాటు చేసే స్టాల్స్‌లో షార్ ఆధ్వర్యంలో రాకెట్ ప్రయోగ వేదిక, ఉపగ్రహాలు, వ్యోమగాముల మాడ్యూల్‌ను ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేశారు. అదేవిధంగా వన్యప్రాణి విభాగం ఆధ్వర్యంలో సరస్సులో పక్షులు చక్కెర్లు కొట్టే నమూనాతో పాటు జింకలు, పాముల నమూనాలను ఏర్పాటు చేశారు. అలాగే పశుసంవర్ధకశాఖ ఆధ్వ ర్యంలో మేలుజాతి ఆవులు, గేదెలు, కోడె దూడలను ప్రదర్శనకు తీసుకొస్తున్నారు.

భారీ బందోబస్తు

పక్షుల పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. మొత్తం 400 మంది పోలీసులను బందోబస్తుకు నియమించినట్లు డీఎస్పీ చెంచుబాబు తెలిపారు. శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ మణికంఠ సూళ్లూరుపేటకు విచ్చేసి కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా అధికారులతో బందోబస్తుపై చర్చించారు.

ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థలపై దుష్ప్రచారం తగదు



విజయకుమార్‌రెడ్డి

కోట, జనవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థలపై బోధనేతర సిబ్బంది, కొంతమంది ఉద్యోగ సంఘాల నేతలు దుష్ప్రచారం చేయడం మంచి పద్ధతికాదని కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి హితవు పలికారు. కళాశాలలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థల యాజమాన్యం బోధనేతర సిబ్బంది, కొంతమంది ఉద్యోగులకు డీఏలు, జీతాలు, అలవెన్స్‌లు చెల్లించలేదన్న ప్రచారం సరికాదన్నారు. ఉద్యోగులకు సంబంధించి జీతభత్యాల విషయమై హైకోర్టులో కేసు నడుస్తోందన్నారు. అంతేకాకుండా నెల్లూరు కోర్టులో కూడా ఓ కేసు పెండింగ్‌లో ఉందన్నారు. కళాశాల యాజమాన్యం ఏ ఉద్యోగి పట్ల వివక్షత చూపలేదన్నారు. ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇచ్చేందుకు యాజమాన్యం సిద్ధంగా ఉందన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎన్‌బీకేఆర్ విద్యాసంస్థలకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేస్తే తగిన చర్యలు తీసుకుంటామని విజయకుమార్‌రెడ్డి హెచ్చరించారు.

ఏకసభ్య కమిషన్‌ను వ్యతిరేకిస్తున్నాం: చింతా



టవర్‌క్లాక్ కేంద్రం వద్ద నిరసన తెలుపుతున్న మాజీ ఎంపీ చింతామోహన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు

గూడూరు, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించడాన్ని వ్యతిరేకిస్తున్నామని మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక టవర్ క్లాక్ కేంద్రం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణను అనేక రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్నాయన్నారు. ఏపీలో మాత్రం ఏకసభ్య కమిషన్‌ను నియమించడం తగదన్నారు. కార్యక్రమంలో కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

దుగరాజపట్నం పోర్టు పనులను ప్రారంభించాలి

సూళ్లూరుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): దుగరాజపట్నం పోర్టు పనులను వెంటనే ప్రారంభించాలని మాజీ కేంద్రమంత్రి చింతామోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చొరవ తీసుకొని దుగరాజపట్నం పోర్టు పనులు ప్రారంభించాలని కోరారు. దళితులను విభజించి పాలించేందుకు కొన్ని దుష్టశక్తులు ప్రయత్నం చేస్తున్నాయని, దీనికి తోడు సీఎం చంద్రబాబు ఏక సభ్య కమిషన్ వేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చందనమూడి శివ, వెంకటయ్య, రాజేంద్ర, తొప్పల వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి బీమా నగదు అందజేత

సూళ్లూరుపేట, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొణ్ణంబట్టు గ్రామానికి చెందిన గొల్లపాలెం జమున అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. శుక్రవారం ఆమె కుటుంబ సభ్యులకు పీఎంజేజేబీవై కింద రూ.2 లక్షల చెక్కును కెనరా బ్యాంకు మేనేజర్ కరుణానిధి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకుల్లో ఖాతా ఉన్నవారందూ పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై బీమా చేసుకోవాలన్నారు. దీని వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు కుటుంబాలకు ఆసర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది నాగార్జున, సదానందం తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

నాయుడుపేట టౌన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట గ్రామదేవత పోలేరమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ పర్వదినాల్లో భాగంగా పోలేరమ్మ, పోతురాజును ప్రత్యేకంగా అలంకరించారు. పోలేరమ్మను దర్శించుకునేందుకు ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

పక్షుల పండుగ వచ్చేసింది..



- నేటి నుంచి ఫ్లెమింగో ఫెస్టివల్
- సూళ్లూరుపేటలో ఏర్పాట్లు పూర్తి

అట్టకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రం వద్ద ఆహ్వానం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెమింగో సైకత శిల్పం



ఎమ్మెల్యే విజయశ్రీతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సూళ్లూరుపేట/తడ, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలో సంక్రాంతి, ఏటి పండుగ ముగియగానే పక్షుల సంబరాలు వచ్చేశాయి. పులికాట్, నేలపట్టులకు వచ్చే వలస పక్షుల ప్రాముఖ్యతను తెలుపుతూ శనివారం నుంచి మూడు రోజుల పాటు పక్షుల పండగ అంగరంగ వైభవంగా జరగనుంది. ఇందుకోసం జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. శనివారం ఉదయం 10 గంటలకు రాష్ట్ర టూరిజం, పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ జూనియర్ కళాశాల మైదానంలో ఈ ఉత్సవాలను ప్రారంభించనున్నారు. ఉదయం చెంగాళమ్మ ఆలయం నుంచి శోభాయాత్రలో మంత్రులు పాల్గొని కళాశాల మైదానంలో జరిగే ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీతో కలిసి కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. కళాశాల మైదానంలో స్టేజీ, స్టాల్స్, డిజిటల్ గ్యాలరీలు సిద్ధం చేశారు. భీములవారిపాళెంలో పడవషికారుకు 35 పడవలను సిద్ధం చేశారు. లైఫ్ జాకెట్‌లు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచారు. అక్కడే స్టేజీ నిర్మించి స్థానిక కళాకారుల ద్వారా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అటకానితిప్ప, శ్రీసిటీలలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో ఇద్దరు డీఎస్పీలు, ఆరుగురు సీఐలు, 22 మంది ఎస్ఐలతో సహా 400 మందితో భద్రతా ఏర్పాట్లు చేశారు. పర్యాటకులను అటకానితిప్ప, నేలపట్టు, భీములవారిపాళెంలకు తీసుకువెళ్లేందుకు ఆర్టీసీ బస్సులతో పాటు కొన్ని ప్రైవేట్ బస్సులను ఏర్పాటు చేశారు.

వలస పక్షులకు ఆహ్వానం పలుకుతూ..

ఏటా శీతాకాలంలో పులికాట్ సరస్సు, నేలపట్టు ప్రాంతాలకు వలస వచ్చే విదేశీ విహంగాలకు ఆహ్వానం పలుకుతూ వాటి విశిష్టతను తెలియజేసేందుకు 2001లో తొలిసారిగా పక్షుల పండగకు అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అప్పటి ఉమ్మడి నెల్లూరు కలెక్టర్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో ఈ పండగ నిర్వహించారు. పులికాట్‌కు వచ్చే వలస పక్షుల్లో అరుదైన ఫ్లెమింగో పేరుతో ఈ పండగను ఏటా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. అనంతరం వచ్చిన ప్రభుత్వాలు కూడా ఈ పండగను అట్టహాసంగా చేస్తూ వచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది చేసి తర్వాత ఆపేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఈ ఫెస్టివల్‌ను అట్టహాసంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంది. ఈ ఏడాది మొత్తం 5 చోట్ల పండగ నిర్వహిస్తున్నారు. నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం, సూళ్లూరుపేట జూనియర్ కళాశాల మైదానం, అటకానితిప్ప పర్యావరణ విజ్ఞాన కేంద్రం, బీవీపాలెం, శ్రీసిటీలో నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

పకడ్బందీగా 'గణతంత్ర' ఏర్పాట్లు

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): 76వ గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. శుక్రవారం ఆయన ఎస్పీ మణికంఠ, జేసీ శుభం బన్సల్ తదితర అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈనెల 26న తిరుపతి నగరంలోని పోలీస్‌పరేడ్ గ్రౌండ్‌లో జరగనున్న గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై స్టాల్స్, శకటాల ఏర్పాటు, వివిధ అంశాలపై సమీక్షించారు. డీఆర్వో నరసింహులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

- రేషనలైజేషన్‌తో 2,687 పోస్టులు మిగులు
- మిగులు సిబ్బంది సంఖ్య 1,371
- హేతుబద్ధీకరణతో ఖాళీల స్థానంలో మిగులు పోస్టులు
- సచివాలయాల రేషనలైజేషన్ ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదం

జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రస్తుతం అమలవుతున్న విధానంలో 1,316 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం సచివాలయాల హేతుబద్ధీకరణకు పెట్టిన ప్రతిపాదనలను శుక్రవారం జరిగిన సమావేశంలో మంత్రివర్గం ఆమోదించిన నేపథ్యంలో ఖాళీ పోస్టులకు మించి 2,687 మిగులు పోస్టులు ఏర్పడ్డాయి. అదే సమయంలో పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య పరంగా చూస్తే 1,371 మంది ఉద్యోగులు మిగులు సిబ్బంది కేటగిరీలో చేరారు. ఇప్పుడు వీరిని సచివాలయాల్లో కాకుండా ఇతర చోట్ల సర్దుబాటు చేయాల్సిన పరిస్థితి ఉంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సచివాలయాల్లో 1,316 పోస్టులు ఖాళీ



జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం 33 మండలాల పరిధిలో 495 గ్రామ సచివాలయాలు, ఏడు మున్సిపాలిటీల పరిధిలో 196 వార్డు సచివాలయాలు చొప్పున మొత్తం 691 సచివాలయాలను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. గ్రామ సచివాలయాల్లో 5,445 పోస్టులు, వార్డు సచివాలయాల్లో 1,960 పోస్టులు చొప్పున అప్పట్లో ప్రభుత్వం మంజూరు చేసింది. గ్రామ సచివాలయాలకు చెందిన 5,445 పోస్టులకు గానూ ప్రస్తుతం 4,365 మంది మాత్రమే పనిచేస్తుండగా 1,080 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అదేవిధంగా వార్డు సచివాలయాలకు సంబంధించిన 1,960 పోస్టులకు గానూ 1,724 మందే పనిచేస్తున్నారు. వీటిలో 236 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఆ మేరకు మొత్తం 691 గ్రామ, వార్డు సచివాలయాల్లో మంజూరైన 7,405 పోస్టులకు 6,089 మంది పనిచేస్తుండగా 1,316 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వైసీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని యథాప్రకారం అమలు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం 1,316 ఖాళీ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది.

హేతుబద్ధీకరణతో 2,687 పోస్టులు మిగులుతున్నాయి!

గత వైసీపీ ప్రభుత్వం సచివాలయాల ఏర్పాటు విషయంలో అనుసరించిన విధానం సక్రమంగా లేదని ప్రస్తుత కూటమి ప్రభుత్వం భావిస్తోంది. అందువల్ల కొంతకాలంగా దీని హేతుబద్ధీకరణ కోసం చేపట్టిన కసరత్తు ఇటీవల పూర్తి కావడంతో ఆ ప్రతిపాదనలను క్యాబినెట్ శుక్రవారం ఆమోదించింది. దాని ప్రకారం చూస్తే జిల్లాలో రేషనలైజేషన్‌తో జిల్లాలో భారీగా మిగులు పోస్టులు ఏర్పడుతున్నాయి. రేషనలైజేషన్‌లో భాగంగా జనాభా ప్రాతిపదికన సచివాలయాలను విభజించి వాటికి అవసరానుగుణంగా సిబ్బందిని కేటాయిస్తే కేవలం 4,718 పోస్టులు మాత్రమే అవసరమవుతున్నాయి. మంజూరైన మొత్తం 7,405 పోస్టుల్లో వీటిని మినహాయిస్తే ఏకంగా 2,687 పోస్టులు మిగులుగా మారుతున్నాయి. అదే సమయంలో ప్రస్తుతం పనిచేస్తున్న మొత్తం 6,089 మంది ఉద్యోగుల్లో అవసరమైన 4,718 మందిని మినహాయిస్తే 1,371 మంది ఉద్యోగులు మిగులుగా మారుతున్నారు. ఈ మిగులు సిబ్బందిని ఇతర చోట్ల సర్దుబాటు చేయనున్నారు.

జనాభా వారీగా సచివాలయాల వర్గీకరణ

జిల్లాలో సచివాలయాలను జనాభా ప్రాతిపదికన వర్గీకరించేందుకు అధికార యంత్రాంగం ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఆ మేరకు 2,500 లోపు జనాభా కలిగిన కేటగిరీలో 213 గ్రామ సచివాలయాలు, 60 వార్డు సచివాలయాలు చేరనున్నాయి. అలాగే 2500-3500 మధ్య జనాభా ఉన్న కేటగిరీలోకి 182 గ్రామ, 82 వార్డు సచివాలయాలు చేరుతాయి. 3,500కు మించి జనాభా కలిగిన కేటగిరీలోకి వంద గ్రామ, 54 వార్డు సచివాలయాలు చేరుతాయి. మొత్తంగా చూస్తే 2,500 లోపు జనాభా కలిగిన సి- కేటగిరీలోకి 273 సచివాలయాలు, 2500-3500 మధ్య జనాభా కలిగిన బి-కేటగిరీలోకి 264 సచివాలయాలు, 3,500కి పైబడిన జనాభా ఉన్న ఏ-కేటగిరీలోకి 154 సచివాలయాలు చేరనున్నాయి. ఇకమీదట ఏ కేటగిరీ సచివాలయాల్లో ఎనిమిది మంది చొప్పున, బి కేటగిరీ సచివాలయాల్లో ఏడుగురు చొప్పున, సి కేటగిరీ సచివాలయాల్లో ఆరుగురు చొప్పున మాత్రమే ఉద్యోగులు పనిచేయనున్నారు. మిగులు సిబ్బందిని అవసరానికి అనుగుణంగా ఇతర శాఖల్లో సర్దుబాటు చేయనున్నారు.





ప్రమాదానికి కారణమైన టిప్పర్

ఎక్స్‌కవేటర్ సాయంతో బస్సును పైకి తీస్తున్న దృశ్యం

- స్లీపర్ బస్సును ఢీకొట్టిన టిప్పర్
- గంగాసాగరం వద్ద ఘోర ప్రమాదం
- రోడ్డు పక్కనున్న విద్యుత్తు స్తంభం బస్సులోకి దూసుకెళ్లిన వైనం
- నలుగురి మృతి.. 15మందికి గాయాలు

చిత్తూరు అర్బన్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : చిత్తూరు సమీపంలో గంగాసాగరం వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన ఘోరరోడ్డు ప్రమాదంలో నలుగురు దుర్మరణం పాలయ్యారు. మరో 15మందికి తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి నుంచి మధురై వెళ్లే ఎస్ఆర్ఎంఎస్ స్లీపర్ బస్సు రోజూలాగే గురువారం రాత్రి 9.45 గంటలకు తిరుపతిలో 29మంది ప్రయాణికులతో బయల్దేరింది.రాత్రి 11.50గంటలకు చిత్తూరు సమీపం గాజులపల్లె సమీపాన వెళుతుండగా.. హైవే నిర్మాణ పనుల కోసం మట్టిని తరలిస్తున్న ఓ టిప్పర్ వేగంగా ఢీకొంది. దీంతో బస్సు పక్కకు బోల్తా పడింది. రోడ్డు పక్కన పడేసి ఉన్న విద్యుత్తు స్తంభాల్లో ఒకటి బస్సులోకి దూసుకువచ్చింది. అప్పర్ సీట్లలో పడుకుని ఉన్న ప్రయాణికులను ఆ స్తంభం వేగంగా కొట్టడంతో ముగ్గురు బస్సులోనే మరణించారు. వారి తలలు ఛిద్రమైపోయాయి. లోయర్ సీటులో కూర్చున్న మరో వ్యక్తి సీట్ల మధ్యలో నలిగిపోయి మరణించాడు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు.ప్రమాద సమాచారం గుడిపాల పోలీసులకు చేరగానే ఆ ప్రాంతం తాలూకా స్టేషన్ పరిధిలోది కావడంతో ఇరు ప్రాంతాల పోలీసులూ ఘటనా స్థలానికి చేరుకున్నారు.అటుగా వెళ్తున్న ప్రయాణికులు, చుట్టుపక్కల జనంతో కలసి క్షతగాత్రులను బయటకు తెచ్చి ఆస్పత్రులకు తరలించారు.

పండుగ కోసం వచ్చి తిరిగి రాని లోకాలకు



శ్రీధర్(ఫైల్ ఫొటో)

సంక్రాంతి సెలవులకోసం తిరుపతికి వచ్చిన కె. శ్రీధర్ వారం రోజులుగా కుటుంబ సభ్యులు, స్నేహితులతో ఆనందంగా గడిపాడు.ఎన్జీవో కాలనీలో కాపురమున్న ఆదాయ పన్ను శాఖ అధికారి శ్రీకాంత్‌కు చిన్న కుమారుడైన శ్రీధర్ తంజావూరులో బీటెక్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు.కళాశాలకని బయల్దేరిన కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడనే వార్త తెలియగానే కుటుంబం కన్నీటిపర్యంతమైంది.

- **ప్రాణాలు తీసిన విద్యుత్తు స్తంభం**

ప్రమాదం జరిగిన ప్రాంతానికి సమీపంలో సబ్‌స్టేషన్ ఉండడంతో.. దానికి సంబంధించిన విద్యుత్తు స్తంభాలు హైవే పక్కన పడేశారు. టిప్పర్ వేగంగా ఢీ కొట్టడంతో బోల్తా పడిన బస్సులోకి అక్కడి విద్యుత్తు స్తంభం ఒకటి దూసుకుపోవడంతో నిద్రలో ఉన్న ముగ్గురు ప్రయాణికుల తలలు ఛిద్రమయ్యాయి. ఒకవేళ అక్కడ స్తంభాలు లేకపోయి ఉంటే ఈ స్థాయిలో నష్టం జరిగేది కాదని సహాయక చర్యల్లో పాల్గొన్నవారు చెబుతున్నారు.

- **మృతుల్లో తిరుపతివాసులు**

తిరుపతి సప్తగిరి కాలనీకి చెందిన ముత్తు విజయ్ రాజు కుమారుడు పొన్నుచంద్ర (33), ఎన్జీవో కాలనీకి చెందిన ఆదాయ పన్ను శాఖ అధికారి శ్రీకాంత్ కుమారుడు శ్రీధర్ (21), తమిళనాడు రాష్ట్రం తంజావూరు జిల్లా కుంభకోణం సౌరాష్ట్ర వీధికి చెందిన గోవిందరాజన్ కుమారుడు ప్రశాంత్ (31), కన్యాకుమారి జిల్లా తోవలకు చెందిన జీవా (40) అక్కడికక్కడే మృతి చెందారు.తలలు ఛిద్రం కావడంతో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా ఉన్నాయి.వీరిలో తమిళనాడువాసులు తిరుమలలో స్వామి దర్శనం చేసుకుని స్వస్థలానికి వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.ప్రమాదంలో మరణించిన నలుగురికీ చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతదేహాలను చూసి కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ఆవరణంలో విలపించడంతో అక్కడున్న వారు కూడా చలించిపోయారు.

- **అమ్మ కళ్లెదుటే కుమారుడి మృతి**

తిరుపతికి చెందిన పొన్నుచంద్ర (21) తన తల్లి సెల్వ సుందరితో కలిసి మధురైలోని ఆస్పత్రికి బస్సులో వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. కింద సీటులో తల్లి కూర్చోగా.. అప్పర్ బెర్త్‌లో పొన్నుచంద్ర పడుకున్నాడు. టిప్పర్ ఢీకొనడం, బస్సు ఓ వైపునకు వాలడం, స్తంభం దూసుకురావడం..అన్నీ కలిపి పొన్నుచంద్రను మృత్యువు రూపంలో కబళించాయి. కళ్లెదుటే కుమారుడు మృతి చెందడాన్ని చూసిన ఆ తల్లి తనకూ గాయాలైన విషయాన్ని కూడా మర్చిపోయి కన్నీరుమున్నీరైంది. ప్రస్తుతం ఆమె చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది.

- **సహాయక చర్యలు** : నిత్యం రద్దీగా ఉండే చిత్తూరు-వేలూరు మార్గంలో ఈ ప్రమాదంతో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు ఎక్సకవేటర్ సాయంతో బోల్తా పడ్డ బస్సును పక్కకు తొలగించి మృతదేహాలను వెలికితీశారు. గుడిపాల, చిత్తూరు తాలూకా ఎస్ఐలు రామ్మోహన్, రమేష్ బాబు క్షతగాత్రులను చీలాపల్లె సీఎంసీతో పాటు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.సమాచారం తెలిసిన వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న కలెక్టర్.. తెల్లవారుజామున మూడు గంటల వరకు అక్కడే వుండి సహాయక చర్యలను పర్యవేక్షించారు.ఏఎస్పీ రాజశేఖర రాజు, డీఎస్పీ సాయినాథ్, సీఐలు శ్రీనివాసరావు, శ్రీధర్ నాయుడు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పరిశీలించారు.అక్కడినుంచి చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి చేరుకుని క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని వైద్యులను ఆదేశించారు. చిత్తూరు తాలూకా ఎస్ఐ రమేష్ బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి సంతాపం

చిత్తూరు సెంట్రల్, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): గంగాసాగరం వద్ద జరిగిన రోడ్డు ప్రమాద ఘటనలో నలుగురు మృతి చెందడం పట్ల జిల్లా ఇన్‌చార్జి మంత్రి రాంప్రసాద్‌రెడ్డి సంతాపం తెలిపారు. ప్రాణాపాయ స్థితిలోని వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. అలాగే చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. ఎమ్మెల్యే జగన్మోహన్ తండ్రి చెన్నకేశవులు నాయుడు చిత్తూరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నవారిని పరామర్శించారు. మృతదేహాలను స్వస్థలాలకు తీసుకెళ్లేందుకు ఆర్థిక సాయం కూడా అందించారు.

ప్రయాగ్‌రాజ్‌లో గంగాహారతి సమర్పణ

తిరుమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళా సందర్భంగా ప్రయాగ్‌రాజ్‌లోని దశాశ్వమేధ ఘాట్‌లో అర్చకులు శుక్రవారం సాయంత్రం గంగగంగాహారతి సమర్పించారు. ముందుగా శ్రీవారి నమూనా ఆలయం నుంచి శ్రీనివాసస్వామిని దశాశ్వమేధ ఘాట్ వద్దకు మంగళవాయిద్యాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ వేంచేపు చేసి గంగానదీ తీరంలో హారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, డిప్యూటీ ఈవో గుణభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



24 గంటల్లో బాధితులకు ఆపన్న హస్తం

11మందికి రూ.34.50లక్షల సీఎం సహాయ నిధి పంపిణీ

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 17(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాలుగు రోజుల క్రితం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని నారావారిపల్లెకు విచ్చేశారు. పలువురు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి ఆర్థిక సాయం అందజేయాలని కోరారు. 24 గంటల సమయంలోనే శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చేతుల మీదుగా ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి 11మందికి రూ.34.50లక్షల ఆర్థిక సాయం అందజేశారు. ఇందులో చంద్రగిరి మండలం రంగంపేటకు చెందిన సందీప్‌రెడ్డి, చంద్రగిరి మండలం నారావారిపల్లెకు చెందిన నాగరత్నమ్మ, ఆర్‌సీపురం మండలం రామాపురం గ్రామానికి చెందిన అశ్వికొరెడ్డి, తిరుపతి రూరల్ మండలం తిరుచానూరుకు చెందిన రాధాకృష్ణయ్య, చంద్రగిరి మండలం పనబాకం పంచాయతీకి చెందిన సుబ్రహ్మణ్యం, దామోదర నాయుడు, మామండూరుకు చెందిన గుణశేఖర్ నాయుడు, చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం కమ్మపల్లికి చెందిన మనోరంజని, దొరవారిసత్రానికి చెందిన రమేష్, కందులవారిపల్లెకు చెందిన రాజశేఖర్ నాయుడు, ఐతేపల్లికి చెందిన పట్టాభిరెడ్డి ఉన్నారు. కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.



కలెక్టర్, ఎమ్మెల్యే నాని నుంచి చెక్కు అందుకుంటున్న సందీప్‌రెడ్డి

శ్రీవారి సేవలో ప్రముఖులు


నూకసాని బాలాజీ


పీఎంఎస్ ప్రసాద్


విజయేంద్ర ప్రసాద్


అంబికా కృష్ణ


దివి


నీలిమా రాణి


ఆర్పీ ఠాకూర్


జగన్మోహన్

తిరుమల, జనవరి 17(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో ఏపీ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, రిలయన్స్ సంస్థ సీఈవో పీఎంఎస్ ప్రసాద్, సినీ రచయిత విజయేంద్రప్రసాద్, నిర్మాత అంబికా కృష్ణ, నటులు దివి, నీలిమా రాణి, మాజీ డీజీ ఆర్పీ ఠాకూర్, చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ ఉన్నారు.

పెరిగిన హుండీ ఆదాయం

తిరుమలలో రద్దీ కొనసాగుతోంది. చలి తీవ్రత కూడా పెరగడంతో వసతి దొరకని భక్తులు అవస్థ పడుతున్నారు. హుండీ ఆదాయం కూడా పెరిగింది.

బుధవారం నాటి హుండీ ఆదాయం : రూ.4.03 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 67,115

తలనీలాలు సమర్పించినవారు : 16,656



ఏ ఊరెళ్లి... ఏమేమి చూద్దాం..!

● ఫ్లెమింగో ఫెస్టివల్ పర్యాటక ప్రదేశాలు... వాటి విశేషాలు

ఫ్లెమింగో ఫెస్టివల్‌కు వచ్చే పర్యాటకులు సందర్శించదగిన ప్రదేశాలు ఎన్నో సూళ్లూరుపేట పరిసరాల్లో ఉన్నాయి. విహంగాల అందాలతో పాటూ ప్రాచీన ఆధ్యాత్మిక క్షేత్రాలనూ సందర్శించవచ్చు. సూళ్లూరుపేట, తడల్లో అనేక హోటల్స్ అందుబాటులో ఉంటాయి. తడలో స్టార్ హోటల్స్, పోష్ రెస్టారెంట్లు కూడా ఉన్నాయి. పులికాట్ రొయ్యలు, చేపలు, పీతలు ఈ ప్రాంతపు ప్రత్యేక డిష్‌లు.

- దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ (ఆంధ్రజ్యోతి)





సూళ్లూరుపేటలో ప్రదర్శన స్టాల్స్:

ఫ్లెమింగ్ ఫెస్టివల్ ప్రధాన వేదిక సూళ్లూరుపేట బస్టాండ్ ఎదురుగా ఉన్న జూనియర్ కళాశాల మైదానం. ఇక్కడ ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నారు.ఉద్యానవన శాఖ, షార్ రాకెట్ కేంద్రం, ఇతర ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఇక్కడ ఉంటాయి. ప్రతిరోజూ సాయంత్రం నుంచి ఇక్కడ అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.

మన్నారుకృష్ణస్వామి గుడి:



సూళ్లూరుపేట-శ్రీకాళహస్తి రోడ్డులో మూడు కిలోమీటర్ల దూరంలో మన్నారుపోలూరులో 11వ శతాబ్దం నాటి చారిత్రక దేవాలయం ఉంది. నిలువెత్తు జాంబవంతుడి విగ్రహం, కన్నీరు కారుస్తున్నట్టు ఉండే గరుత్మంతుడి విగ్రహం ఈ ఆలయంలోని ప్రత్యేకతలు. టీటీడీ ఆధ్వర్యంలో ఇక్కడ పూజలు జరుగుతాయి.

శ్రీచెంగాళమ్మ ఆలయం:

సూళ్లూరుపేట బస్టాండు నుంచి దక్షిణం వైపునకు ఒక కిలోమీటరు దూరంలో చెంగాళమ్మ ఆలయం ఉంటుంది. తలుపులు లేని ఆలయంగా ప్రసిద్ధి చెందిన ఈ ఆలయంలో శతాబ్దాల నాటి చెట్టు ప్రత్యేక ఆకర్షణ. శ్రీహరికోటలో ఎగరేసే ప్రతి రాకెట్టుకూ ముందుగా ఈ ఆలయంలో పూజలు చేయడం సంప్రదాయం.





ఫ్లెమింగోల కోసం పులికాట్‌కి :

ఫ్లెమింగో పక్షులు వేలాదిగా కనిపించే ప్రదేశం శ్రీహరికోట రోడ్డులోని పులికాట్ సరస్సు. ఈ రోడ్డులోని అటకానితిప్ప వరకూ ప్రయాణిస్తే పులికాట్‌లో రొయ్యలు వేటాడే జాలర్లు, ఫ్లెమింగో పక్షులూ కనిపిస్తాయి. ఈ ఏడాది పులికాట్‌కు 25 వేల పైచిలుకు ఫ్లెమింగోలు వచ్చి ఉన్నాయి. వేనాడు, పేర్నాడులకు దారితీసే మట్టిరోడ్లలో కొంతదూరం ప్రయాణిస్తే కూడా పక్షులు కనిపిస్తాయి.



పక్షుల పండుగ కార్యక్రమాల వివరాలు ఇలా..

తొలిరోజు..

● చెంగాళమ్మ ఆలయం నుంచి శోభాయాత్ర ● బెలూన్ల విడుదల ● ప్రారంభోత్సవం ● సాయంత్రం 4 గంటలకు పాఠశాల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు ● 5 గంటలకు సాంస్కృతిక వేడుకలు ● రాత్రి 7 గంటలకు కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు

రెండవ రోజు

● మధ్యాహ్నం వరకు క్రీడా పోటీలు ● సాయంత్రం 4 గంటలకు విద్యార్థుల సాంస్కృతిక పోటీలు ● రాత్రి 7 గంటలకు ప్రముఖ కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలు

మూడవ రోజు

● ఉదయం 10 గంటలకు వంటల పోటీలు ● సాయంత్రం 4 గంటలకు ముగింపు వేడుక ● 5 గంటలకు సంప్రదాయ సంస్కృతి వేడుక ● 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు



వెదురుపట్టు:

దొరవారిసత్రం, సూళ్లూరుపేట మధ్య జాతీయ రహదారిపై పడమర వైపున 10 కి.మీ దూరంలో కాళంగి నది ఒడ్డున వెదురుపట్టు నర్సమాంబపురం అగ్రహారం ఉంది. ఈ చిన్న గ్రామంలో ఇళ్ల మధ్యన ఉన్న నాలుగు చింత చెట్లమీద పెయింటెడ్ స్టార్క్స్ (ఎర్రకాళ్ల కొంగలు) ఉంటాయి. ఇవి స్థానికులతో కలసి జీవించడం ఇక్కడి ప్రత్యేకత.



చేనేత అందాలు :

మన్నారుపోలూరు చేనేత చీరలకు ప్రసిద్ధి. చెన్నైలోని ప్రముఖ వాణిజ్య సంస్థలు కుమరన్, శరవణన్, నల్లి, జయచంద్ర, చెన్నై శిల్క్స్ వంటి వారికి ఇక్కడ నుంచి చేనేత చీరలు సరఫరా అవుతాయి. మహిళలు మంచి చీరలను ఎంపిక చేసుకోవడం కోసం ఈ గ్రామాన్ని సందర్శించవచ్చు.

నేలపట్టు: సూళ్లూరుపేట, నాయుడుపేట మధ్య ఉన్న దొరవారిసత్రానికి 2 రెండు కిలోమీటర్ల దూరంలో హైవేకు తూర్పు వైపున నేలపట్టు ఉంది. ఇక్కడ ఉన్న రెండు మంచినీటి చెరువుల్లోని కడప చెట్లపై వేలాది పక్షులు ఉంటాయి. సుదూర దేశాల నుంచి వచ్చిన ఈ పక్షులు ప్రస్తుతం చెట్లపై గూళ్లు కట్టుకుని పిల్లల్ని పొదిగి ఉన్నాయి. ఇక్కడ బైనాకులర్స్ కూడా అందుబాటులో ఉంటాయి.



శ్రీహరికోట రాకెట్ కేంద్రం:

సూళ్లూరుపేటకు 18 కిలోమీటర్ల దూరంలో శ్రీహరికోట అంతరిక్ష పరిశోధన కేంద్రం ఉంది. వందవ రాకెట్ ప్రయోగానికి సిద్ధమవుతున్న షార్‌లోకి అడుగుపెట్టాలంటే మాత్రం ప్రత్యేక అనుమతి ఉండాలి. అయితే రాకెట్ కేంద్రం ప్రధాన గేటు ముందుండే అన్ని రాకెట్‌ల నమూనాల వద్ద సెల్ఫీలు తీసుకోవచ్చు.





పడవెక్కాలంటే భీములవారి పాళెం వెళ్లాలి :

సూళ్లూరుపేట నుంచి చెన్నై వెళ్లే మార్గంలో 15 కి.మీ దూరంలో భీములవారిపాళెం పడవల రేవు ఉంది. ఇక్కడ తెరచాప పడవలు, మోటారు బోటు పడవలు ఉంటాయి. పర్యాటకులు ఈ పడవల్లో పులికాట్ సరస్సులో విహరించవచ్చు. ఇరకం దీవి వరకూ పడవలో వెళ్లి రావచ్చు.



వేనాడు దర్గా: శ్రీహరికోట రోడ్డులో అటకానితిప్ప నుంచి దక్షిణం వైపునకు మట్టిరోడ్డులో 12 కిలోమీటర్లు ప్రయాణిస్తే వేనాడుకు చేరుకోవచ్చు. ఇక్కడి హజరత్ దావూద్ అవులియా దర్గా బాగా ప్రసిద్ధి చెందింది. ఏటా ఇక్కడ జరిగే గంథోత్సవానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రహమాన్ హాజరవుతుంటారు. ఇక్కడే ప్రాచీన కాలం నాటి ఆలయం ఉంది. ఒకే ప్రాంగణంలో శివాలయం, విష్ణు ఆలయం ఉండడం ప్రత్యేకత. శృంగి మహర్షి కావడిలోని ఒక బుట్టలో శివలింగంను, మరొకదానిలో విష్ణు విగ్రహాన్ని పెట్టుకుని కాశి నుంచి కన్యాకుమారికి బయలుదేరాడని, దారిలో సేద తీరేందుకు కావడిని వేనాడు దీవిలో కిందకు దించగా విగ్రహాలు రెండూ ఇక్కడే స్థాపితం అయిపోయాయని పురాణ ఐతిహ్యం ప్రచారంలో ఉంది.



శ్రీసిటీ: దేశంలోనే అద్భుత పారిశ్రామికవాడగా ప్రసిద్ధి చెందిన శ్రీసిటీ సందర్శన ప్రత్యేక అనుభూతిని ఇస్తుంది. తడ వద్ద నుంచి శ్రీసిటీలోకి ప్రవేశించవచ్చు. హాలీవుడ్ నటులు తొడుక్కునే కోట్‌ల నుంచి, మెట్రో రైళ్ల దాకా ఇక్కడ తయారవుతున్నాయి.



ప్రతి మూడవ శనివారం స్వచ్ఛ దివస్‌ను పాటించాలి

- కలెక్టర్ వెంకటేశ్వర్ -

తిరుపతి(కలెక్టరేట్), జనవరి 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛ దివస్‌ను నిర్వహించాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. శుక్రవారం టెలి కాన్ఫరెన్సు ద్వారా మున్సిపల్ కమిషనర్లు, జిల్లా, మండల స్థాయి అధికారులకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతినెలా మూడవ శనివారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఏప్రిల్ లోపు ఇంటింటి చెత్త సేకరణ వందశాతం నిర్వహించేలా, అక్టోబరు లోపు చెత్తకుప్పలు లేకుండా చేయాలన్నదే ముఖ్య ఉద్దేశ్యమన్నారు. మన ఇల్లు, మన కార్యాలయం, సచివాలయాలు, బస్టాండ్లు, పరిసరాల పరిశుభ్రత పాటించడం చేయాలన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యవంతులను చేస్తూ మానవ హారం తదితర కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. చెత్తకుప్పలను తొలగించి ఆ స్థలంలో చెట్లు నాటే కార్యక్రమం చేయాలని సూచించారు. మురుగుకాలువలను శుభ్రం చేయించాలని, ప్రజలు తడి, పొడిచెత్తను వేర్వేరుగా పారిశుధ్య కార్మికులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్లు, ఆర్డీవోలు, పంచాయతీరాజ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో గీత కార్మికులకు 23 మద్యం దుకాణాలు

తిరుపతి(నేరవిభాగం), జనవరి 17(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సందర్భంగా గీత కార్మికులకు ప్రత్యేకంగా మద్యం దుకాణాలు కేటాయిస్తామని ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారు. ఇప్పటికే జిల్లాలో దాదాపు 227 ప్రైవేటు మద్యం దుకాణాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీనికి తోడు కల్లు గీత కార్మికులకు సైతం దాదాపు 23 మద్యం దుకాణాలను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికోసం దరఖాస్తుదారులు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. దరఖాస్తు రుసుం రూ.2 లక్షలుగా ప్రభుత్వం నిర్ణయించింది. లైసెన్సు ఫీజు మాత్రం సగం చెల్లిస్తే సరిపోతుంది. 2016లో చేసిన స్మార్ట్ పల్స్ సర్వే ఆధారంగా కులాల జనాభా ప్రాతిపదికన ఈ దుకాణాలు కేటాయించనున్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల కంటే తిరుపతి జిల్లాకు అత్యధికంగా దాదాపు 23 మద్యం దుకాణాలను కల్లు గీత కార్మికులకు కేటాయిస్తుండటంతో వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హెల్మెట్‌ను బరువుగా కాకుండా బాధ్యతగా తీసుకోండి...

- జిల్లా రవాణాశాఖాధికారి మురళీమోహన్ -

తిరుపతి (జీవకోన), జనవరి 17(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహన వినియోగదారులు హెల్మెట్‌ను బరువుగా కాకుండా బాధ్యతగా తీసుకోవాలని జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం రవాణాశాఖ కార్యాలయంలో లైసెన్స్ కోసం హాజరైన వాహనదారులకు హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహనదారుడు, వెనుక కూర్చున్న వారు కూడా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనుకోకుండా ప్రమాదం జరిగితే హెల్మెట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికానాజ్‌లు మాట్లాడుతూ హెల్మెట్ తప్పనిసరిగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ ప్రమాణాలను పాటించేలా ఉండాలని సూచించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంవీఐలు స్వర్ణలత, ఏవో శ్రీనివాసులు, కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


వాహనదారులతో మాట్లాడుతున్న డీటీవో మురళీమోహన్

హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవం

● ఒక్కొక్కరికి రూ.12వేల జరిమానా


యావజ్జీవశిక్ష పడిన ముగ్గురు నిందితులతో పోలీసులు

కేవీబీపురం, జనవరి 17(ఆంధ్రజ్యోతి): హత్య కేసులో ముగ్గురికి యావజ్జీవ శిక్షతో పాటు రూ.12వేలు చొప్పున జరిమానా విధిస్తూ శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్‌నాయక్ తీర్పు నిచ్చారు. సీఐ కొండయ్య కథనం మేరకు.. మండలంలోని మఠం గ్రామానికి చెందిన పల్లమాల కుప్పయ్య (55) రెండవ కోడలితో అదే గ్రామానికి చెందిన గంగరాజు (35) అసభ్యంగా ప్రవర్తించాడు. ఆ విషయంలో గంగరాజును కుప్పయ్య పలుమార్లు మందలించాడు. దీంతో అతడిని అంతమొందించాలని గంగరాజు పథకం వేశాడు. 2017 డిసెంబరు 30న పెరిందేశం గ్రామానికి లోకేష్(33), రాజా(36)తో కలిసి మద్యం తాగడానికి కుప్పయ్యను పిలిపించి ముగ్గురూ కలిసి హత్యచేశారు. మృతదేహాన్ని పక్కనే ఉన్న బీడుభూమిలో వేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేశారు. నేరం రుజువు కావడంతో కోర్టు వారికి శిక్ష విధించింది. పీపీగా వీరరాఘవరెడ్డి, కోర్టు లైజన్ అధికారిగా గోపాల్‌రాజు వ్యవహరించారు. కాగా కేసులో పురోగతి చూపిన కానిస్టేబుల్ దాము ప్రత్యేక ప్రశంసలు పొందారు. కానిస్టేబుళ్లు కలాం, దయాకర్ పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం హెల్ప్‌డెస్క్

తిరుపతి(సెంట్రల్), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో వైకుంఠ ద్వార దర్శనం కోసం వచ్చిన భక్తుల కోసం తిరుపతి రైల్వేస్టేషన్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. అలాగే ఉత్తర భారత దేశంలో ప్రారంభమైన పుష్కర స్నానాలు ఆచరించడానికి వెళ్లే భక్తులకు కమర్షియల్ విభాగం టీటీఐలు సేవలందిస్తున్నారు.ఈ కేంద్రాల్లో సిబ్బంది 24 గంటలు పనిచేస్తారని అధికారులు తెలిపారు.



తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్

వరికి సోకే అగ్గి తెగులుపై అప్రమత్తమిలా..

తిరుపతి(ఎంఆర్‌పల్లె), జనవరి 17(ఆంధ్రజ్యోతి): దాదాపుగా నాట్లు పూర్తి కావస్తున్న వరికి అగ్గి తెగులు సోకే ప్రమాదం ఉందని వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మెరుగు భాస్కరయ్య తెలిపారు. డిసెంబరు నుంచి ఫిబ్రవరి వరకూ మంచుతో కూడిన చల్లని వాతావరణం ఈ తెగులు వ్యాప్తి అనుకూలమన్నారు. తొలిదశలోనే గుర్తించి రైతులు అప్రమత్తమైతే దీనిని నివారించవచ్చునన్నారు. లేకుంటే నారు దశ నుంచే పైరును ఆశించి నష్టపరుస్తుందన్నారు.


మెరుగు భాస్కరయ్య, జిల్లా వ్యవసాయశాఖ వనరుల కేంద్రం ఏడీఏ



లక్షణాలు

తెగులు ఆశించిన ఆకులపై చిన్నచిన్న గోధుమ రంగు మచ్చలు ఏర్పడతాయి. క్రమంగా పెద్దవై మచ్చల మధ్య బూడిద రంగుగా మారుతుంది. తరువాత మొత్తం కాలినట్లు కనిపిస్తుంది. వెన్నుల కణుపు మీద ఆశిస్తే వెన్ను విరిగి పైరు వాలిపోతుంది.

నివారణమార్గాలు

● అగ్గి తెగులుకు ఆశ్రయమిచ్చే పొలం గట్లపై కలుపును ఎప్పటికపుడు తొలగించాలి. పొలంలో రెండు మీటర్ల కాలిబాట తీస్తే వ్యాప్తి తగ్గుతుంది. మంచు వాతావరణంలో పైరుకు తక్కువ మోతాదులో యూరియా వాడాలి.

● అవసరమనుకుంటే పొటాషియ నైట్రేట్(18-0-45) నీటితో కరిగే ఎరువును (లీటరు నీటికి 5గ్రాములు) స్ప్రే చేయవచ్చు.

● పొట్ట దశలో కూడా వ్యవసాయాధికారుల సూచనల మేరకు ఎకరాకు 20 కిలోల పొటాష్ వేయవచ్చు.

● సేంద్రియ పద్ధతిలో పుల్లటి మజ్జిగ, వేప లేదా మారేడు ఆకుల కషాయం స్ప్రే చేస్తే తెగులు ఉధృతి తగ్గుతుంది.

● రసాయన పద్ధతిలో తొలి దశలో బావిస్టిన్ లీటరు నీటికి 1.5గ్రాములు, లేదా కాసుగా మైసిన్ లీటరు నీటికి 3మి.లీ. స్ప్రే చేయవచ్చు.

● తెగులు ఎక్కువగా ఉంటే ట్రైసైక్లోజోల్ లీటరు నీటికి 0.6గ్రాములు, లేదా ఫ్యూజీ-ఒన్ లీటరు నీటికి 1మి.లీ. లేదా అమిస్టార్ లీటరుకు 1మి.లీ. స్ప్రే చేయాలి.

పీఎంఎఫ్ఎంఈ రిసోర్స్ పర్సన్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(విద్య), జనవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పథకం (పీఎంఎఫ్ఎంఈ) అమలు చేసేందుకుగాను మండల స్థాయిలో రిసోర్స్ పర్సన్స్ ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శోభన్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అయితే ఇది నెలవారీ స్థిరమైన వేతనం ఉన్న ఉద్యోగం కాదని, ఇన్సెంటివ్ ఆధారిత ఎంపానల్మెంట్ ప్రక్రియ అని వివరించారు. ఏదేని డిగ్రీ చదివి 21-30 సంవత్సరాల మధ్య వయసుగల మహిళ, పురుష, ట్రాన్స్‌జెండర్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. అభ్యర్థులు చక్కటి తెలుగు భాష మాట్లాడగలిగి, కంప్యూటర్ పరిజ్ఞానంతోపాటు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను మొబిలైజేషన్ చేయగలిన సామర్థ్యం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో లేదా గ్రామీణాభివృద్ధి రంగంలో పనిచేసిన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు సీడాప్ ఆధ్వర్యంలో రాత పరీక్ష, ఇంటర్వ్యూలద్వారా ఎంపిక ప్రక్రియ ఉంటుందని చెప్పారు. శిక్షణ అనంతరం రిసోర్స్ పర్సన్స్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ పథకం గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించి లబ్ధిదారులను గుర్తించాలని, వారు పరిశ్రమల స్థాపనకు అన్నివిధాల తోడ్పాటు అందించినందుకుగాను ప్రతీ యూనిట్‌కు రూ.10 వేల చొప్పున ఇన్సెంటివ్‌ను ఏపీఎఫ్‌పీఎస్ అందజేస్తుందని వెల్లడించారు.

వైకుంఠద్వార దర్శన టోకెన్ల జారీ పూర్తి

తిరుమల, జనవరి 17 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారి ఆలయంలో ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు జరుగుతున్న వైకుంఠద్వార స్లాటెడ్ సర్వదర్శన టోకెన్ల జారీ ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. 9వ తేదీ ఉదయం 5 గంటలకు తొలి మూడు రోజుల టోకెన్లను జారీ చేస్తామని, ఆ తర్వాత ఏ రోజుకారోజు జారీ చేస్తామని టీటీడీ ప్రకటించినప్పటికీ 8వ తేదీ రాత్రి జరిగిన తొక్కిసలాట ఘటన నేపథ్యంలో 8వ తేదీ రాత్రి నుంచే టోకెన్ల జారీ ప్రక్రియను మొదలుపెట్టారు. ఆ తర్వాత రద్దీ పెరుగుతున్న క్రమంలో మిగిలిన రోజులకు సంబంధించిన టోకెన్ల జారీని కూడా 11వ తేదీ రాత్రి నుంచి మొదలుపెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయానికి టోకెన్ల జారీ ప్రక్రియ పూర్తయింది. కాగా, 20వ తేదీకి సంబంధించి స్లాటెడ్ సర్వదర్శన టోకెన్లు జారీ చేసేది లేదని, ఆరోజు శ్రీవారిని దర్శించుకోవాలనుకునే భక్తులు నేరుగా తిరుమలకు వెళ్లి టోకెన్ రహిత దర్శన కేటగిరీలో దర్శించుకోవాలని టీటీడీ ప్రకటించింది. రద్దీ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. ఇక, వీఐపీ బ్రేక్ దర్శనాలను కూడా 20వ తేదీకి కేవలం ప్రొటోకాల్‌కే పరిమితం చేసింది.